గురువారం 19-10-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 209

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



న్యూజిలాండ్ నాలుగో గెలుపు

ప్రపంచకప్‌లో 149 పరుగులతో అఫ్గానిస్తాన్‌పై కివీస్ ఘన విజయం -16లో



లాభాలు ఒకరోజుకే పరిమితం

మళ్లీ 66వేల స్థాయి దిగువకు సెన్సెక్స్. నిఫ్టీకి 140 పాయింట్ల నష్టం -17లో



కేంద్ర ఉద్యోగులకు 4% డీఏ పెంపు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు. వారికి డీఏ, డీఆర్‌ను 4 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.
- వివరాలు 6లో



ఆ కిరాతకులు మీరే

గాజా సిటీలోని ఆసుపత్రిలో పేలుడు ఘటనపై ఇజ్రాయెల్, హమాస్ పరస్పరం నిందలు మోపుకుంటున్నాయి.
- వివరాలు 6లో



'ఎక్స్'లో పోస్ట్ పెట్టాలంటే...

మైక్రోబ్లాగింగ్ సైట్ 'ఎక్స్' వినియోగదారులకు చేదువార్త చెప్పింది. 'నాట్ ఎ బాట్' అనే కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది.
- వివరాలు 6లో



త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనా రెడ్డి

బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డిని త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు.
- వివరాలు 13లో

బుధవారం మేడ్చల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్



వాళ్లొస్తే కాటగలుస్తం!

కాంగ్రెస్ వస్తే కరెంటుకు కటకట.. రైతుబంధు, దళితబంధుకు రాంరాం

జడ్చర్ల, మేడ్చల్ ప్రజా ఆశీర్వాద సభల్లో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విమర్శలు

- కర్ణాటకలో 20 గంటలు కరెంటు ఇస్తామని కాంగ్రెస్ మాట తప్పింది... ఆ పార్టీ వల్లే తెలంగాణలో 60 ఏళ్ల గోస.. మళ్లీ నమ్మితే మోసపోతాం
- కోర్టుల్లో కేసులు వేసి ప్రాజెక్టులను ఆపాలని చూశారు
- శ్రీశైలం ఎవరి జాగీరు కాదు.. అందుకే పాలమూరు ఎత్తిపోతలకు సోర్సుగా ఎంపిక చేశాం
- అందరి మేలు కోరే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, మేడ్చల్ జిల్లా: నిన్నగాక మొన్న కర్ణాటకలో గెలిచిన కాంగ్రెస్ పార్టీ 20 గంటలు కరెంటు ఇస్తామని మాట తప్పిందని.. ఒకవేళ ఇక్కడ కూడా కాంగ్రెస్ వస్తే కాటగలుస్తామని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడే మాట్లాడాడని గుర్తు చేశారు. వాళ్లొస్తే కరెంటుకు కటకట తప్పదని.. రైతుబంధుకు రాంరాం, దళితబంధుకు జైభీం అంటూ ఆపేస్తారని ఆరోపించారు. అడ్డం పొడుగు ఏదో మాట్లాడి గోల్‌మాల్ చేయాలని చూస్తున్న వారి మాటలను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. అందరికీ మేలు చేసే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని, కారుకు ఓటేసి గెలిపించాలని కోరారు. బుధవారం జడ్చర్ల, మేడ్చల్‌లలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

మిగతా 14వ పేజీలో ▶

దొరల తెలంగాణ, ప్రజల తెలంగాణ మధ్య

సమరం


ములుగులోని రామాంజాపూర్‌లో నిర్వహించిన విజయభేరి సభలో రాహుల్, ప్రియాంక అభివాదం

ప్రజా తెలంగాణ కోసం వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

రామాంజాపూర్ సభలో రాహుల్, ప్రియాంక పిలుపు

- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది
- మోదీ కనుసన్నల్లో తెలంగాణను ధ్వంసం చేస్తున్నారు
- బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే..
- బీఆర్ఎస్ పాలన మోదీ రిమోట్ ద్వారా నడుస్తోంది
- విపక్ష నేతలందరిపై కేసులు పెట్టినా కేసీఆర్‌పై ఒక్క కేసు పెట్టలేదు
- సామాజిక న్యాయం కల్పించడంలో మోదీ, కేసీఆర్ విఫలం
- ఆరు గ్యారంటీ స్కీమ్‌లు అమలు చేసి తీరుతాం
- సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా నిర్వహిస్తాం
- రామప్ప ఆలయంలో రాహుల్, ప్రియాంకా పూజలు
- ఆదివాసీ గడ్డ నుంచి ఎన్నికల శంఖారావం

సాక్షి ప్రతినిధి, వరంగల్: స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటంలోంచి పుట్టిన కాంగ్రెస్, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని, కానీ ఇది ప్రస్తుతం దొరల తెలంగాణగా మారిందని ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు ధ్వజమెత్తారు. దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మార్చేందుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇది దొరల తెలంగాణ, ప్రజల తెలంగాణ మధ్య జరుగుతున్న సమరంగా అభివర్ణించారు. కాంగ్రెస్ ఇచ్చిన తెలంగాణను ప్రధాని మోదీ కనుసన్నల్లో ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటేనని అన్నారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఆ మూడు పార్టీలూ ఒక్కటయ్యాయని చెప్పారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ జనాభా దామాషా ప్రకారం సామాజిక న్యాయం కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. కులగణన చేయనిదే సామా జిక న్యాయం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. బుధవారం ములుగు జిల్లా వెంకటాపూర్(ఎం) మండలం రామాంజాపూర్ నుంచి వారు కాంగ్రెస్ ఎన్నికల శంఖం పూరించారు. తొలుత రామప్ప రామలింగేశ్వరస్వామి ఆ లయంలో రాహుల్, ప్రియాంక పూజలు చేశారు. అనంతరం బస్సు యాత్రను ప్రారంభించారు. ఆ తర్వాత రామాంజాపూర్‌లో ఏర్పాటు చేసిన

మిగతా 5వ పేజీలో ▶

జంగ్ తెలంగాణ

సంక్షేమం భళా.. మౌలికం ఎలా ?

- అధికారమే లక్ష్యంగా రాజకీయ పార్టీల అడుగులు
- ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి లేదు!

భూమార్గం పట్టిద్దాం

- భూ సంబంధిత సమస్యలు ఎన్నికల ఎజెండా కావాలి
- 'సాక్షి' ఇంటర్వ్యూలో భూచట్టాల నిపుణులు ఎం.సునీల్‌కుమార్

- వివరాలు 7, 8 పేజీల్లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate ₹ 65 per dozen	Ex Farm Live Bird	104 kg	Dressed with Skin	183 kg
	Retail Live Bird	126 kg	Skin Less	208 kg

Issued in the interest of consumers

ప్రవల్లిక కుటుంబానికి

అండగా ఉంటాం

- మంత్రి కేటీఆర్ భరోసా
- ఆమె సోదరుడికి ఉద్యోగం ఇస్తామని ప్రకటన


మర్రి ప్రవల్లిక తల్లిదండ్రులు లింగయ్య, విజయలను ఓదారుస్తున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన వరంగల్ జిల్లా బిక్కాజిపల్లికి చెందిన ప్రవల్లిక కుటుంబసభ్యులు బుధవారం మంత్రి కేటీ రామారావుతో భేటీ అయ్యారు. ప్రగతి భవన్‌లోని తన కార్యాలయంలో కలసిన ప్రవల్లిక కుటుంబానికి అండగా ఉంటానని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ప్రవల్లిక మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. తమ కుమార్తె మరణానికి కారణమైన శివరామ్ అనే వ్యక్తిని శిక్షించాలని ప్రవల్లిక కుటుంబ సభ్యులు కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రవల్లిక మరణం దురదృష్టకరమని, బాధాకర సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి వారిని ఓదార్చారు. కాగా ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర డీజీపీతో కేటీఆర్ మాట్లాడి, విచారణ వేగవంతం చేయాలని కోరారు. ప్రవల్లిక మృతికి కారణమైన వ్యక్తికి తగిన శిక్ష పడేలా చూస్తామని ఆమె కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు. అలాగే కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రవల్లిక సోదరుడికి ఉద్యోగం ఇప్పిస్తానని వారికి మంత్రి హామీ ఇచ్చారు. 'ధైర్యంగా ఉండండి.. నీ బిడ్డను తెచ్చి ఇవ్వలేను కాని అన్ని విధాలుగా ఆదుకుంటా'అని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు ప్రవల్లిక తల్లిదండ్రులు లింగయ్య, విజయ తెలిపారు.

పసిగుడ్డు తెలంగాణ.. ఇతరుల చేతుల్లో పెట్టొద్దు!

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే రాష్ట్రం ఆగమైతది
- జాబ్ క్యాలెండర్‌తో ఏటా కొలువుల భర్తీ
- కరీంనగర్ సభలో కేటీఆర్ - 14లో

గ్రూప్–1పై అప్పీలుకు

వెళ్లేదెప్పుడు?

- ప్రిలిమినరీ పరీక్ష రద్దు తీర్పు వెలువడి నెలరోజులు
- ఇప్పటికీ సుప్రీంకోర్టును ఆశ్రయించని టీఎస్‌పీఎస్సీ
- ఎటూ తేల్చుకోలేకపోతున్న పరీక్ష రాసిన అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షపై సందిగ్ధం వీడటం లేదు. నిర్వహణలో నిర్లక్ష్య వైఖరి వహించినందుకు ఈ పరీక్షను రద్దు చేయాలంటూ వేర్వేరు సందర్భాల్లో హైకోర్టు రెండుసార్లు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు వచ్చి నెలరోజులు కావస్తున్నా... తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఇప్పటివరకు ఏ నిర్ణయాన్ని ప్రకటించలేదు. పరీక్ష రద్దు విషయంలో స్పష్టతనివ్వని టీఎస్‌పీఎస్సీ హైకోర్టు తీర్పుపై అప్పీలు కోసం సుప్రీంకోర్టుకు సైతం వెళ్లలేదు. దీంతో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో తీవ్ర అయోమయం నెలకొంది. కొత్తగా పరీక్ష నిర్వహిస్తారా? లేదా? అందుకు మళ్లీ సన్నద్ధం కావాలా? లేక మెయిన్ పరీక్షలకు సిద్ధమవ్వా లా? తేల్చుకోలేక అభ్యర్థులు గందరగోళంలో ఉన్నారు.

పరీక్షలు రద్దు మీద రద్దు

గ్రూప్–1 కేటగిరీలో 503 ఉద్యోగ ఖాళీల భర్తీకి టీఎస్‌పీఎస్సీ గతేడాది ఏప్రిల్‌లో

మిగతా 13వ పేజీలో ▶


హరినాథ్


కిరణ్మయి


సుమతి


విజయ్

ఇద్దరు రాష్ట్ర హైకోర్టు

జడ్జీలు బదిలీ


జస్టిస్ నరేందర్

- రాజస్తాన్ హైకోర్టుకు జస్టిస్ ఎం.లక్ష్మణ్, పట్నా హైకోర్టుకు జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి
- ఏపీ హైకోర్టు నుంచీ ఇద్దరు న్యాయమూర్తులు బదిలీ.. కొత్తగా నలుగురి నియామకం
- అదనపు జడ్జీలుగా హరినాథ్, కిరణ్మయి, సుమతి, విజయ్‌ల పేర్లకు రాష్ట్రపతి ఆమోదం


జస్టిస్ ఎం. లక్ష్మణ్


జస్టిస్ అనుపమ చక్రవర్తి

సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీ హైకోర్టుల నుంచి ఇద్దరు చొప్పున న్యాయమూర్తులు ఇతర హైకోర్టులకు బదిలీ అయ్యారు. ఏపీ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు కొత్తగా నియమితులయ్యారు. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం ఆమోదముద్ర వేశారు. వీటికి సంబంధించి కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ హైకోర్టు నుంచి జస్టిస్ మున్నూరి లక్ష్మణ్ రాజస్తాన్ హైకోర్టుకు, జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి పట్నా హైకోర్టుకు.. ఏపీ హైకోర్టు నుంచి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ వెంకటరమణ మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ బదిలీ అయ్యారు. మరోవైపు కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గుహనాథన్ నరేందర్ ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు.

ఏపీకి కొత్తగా నలుగురు జడ్జీలు

ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నూనెపల్లి హరినాథ్, మండవ కిరణ్మయి, జగడం సుమతి, న్యాపతి విజయ్‌ల

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి


ఒకేసారి అన్ని హామీలిస్తే ఎలా తట్టుకుంటాడనుకున్నావ్!

ఓటర్ కార్డు లేకున్నా

ఓటేయొచ్చు..!



ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులుండాలి

- ఎపిక్ కార్డులో స్వల్ప తేడాలున్నా ఓటేయొచ్చు
- ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పును గుర్తింపుగా పరిగణించరాదు
- కేంద్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్)లోని వివరాల్లో స్వల్ప తేడాలున్నా, ఓటరు గుర్తింపు నిర్ధారణ అయిన పక్షంలో ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. వేరే నియోజకవర్గానికి సంబంధించిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డును ఆధారంగా చూపి, మరో నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటును వినియోగించుకోవడానికి వచ్చే వారికి (ఆ పోలింగ్ కేంద్రం ఓటర్ల జాబితాలో పేరున్న వారికి) సైతం ఓటు హక్కు కల్పించాలని సూచించింది. ఓటరు గుర్తింపు కార్డు లేనిపక్షంలో, ఒకవేళ ఉన్నా గుర్తింపు ధ్రువీకరణ సాధ్యం కానిపక్షంలో పోలింగ్ రోజు ప్రత్యామ్నాయ ఫొటో ధ్రువీకరణ పత్రాలను తీసుకువస్తే ఓటు హక్కు కల్పించాలని ఆదేశించింది. తెలంగాణ సహా మరో 4 రాష్ట్రాల్లో శాసనసభ సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓట రు గుర్తింపు నిర్ధారణ విషయంలో కొత్త మార్గదర్శకాలను జారీ చేస్తూ సీఈసీ ఆయా రాష్ట్రాల ఎన్నికల ప్రధాన అధికారులకు (సీఈఓలకు) లేఖ రాసింది.

ఇలాంటి పరిస్థితుల్లో గుర్తింపు తప్పనిసరి..

ఓటరు గుర్తింపు కార్డులో ఫొటోలు తారుమారు కావడం, ఇతర లోపాలతో

మిగతా 3వ పేజీలో ▶

ఆ డిక్లరేషన్లు ఎక్కడ?..

బీసీలు గర్జించేదెప్పుడు?

కాంగ్రెస్ పార్టీ తీరుపై చర్చ



- రైతు, యువ, ఎస్సీ.. ఎస్టీ డిక్లరేషన్లు మాత్రమే ప్రకటన
- బీసీ, మైనార్టీ, మహిళా డిక్లరేషన్లు వెలువడక పోవడంపై విమర్శలు
- అదిగో ఇదిగో అంటూ ఎప్పటికప్పుడు బీసీ గర్జన సభ వాయిదా
- మేనిఫెస్టోలో బీసీ వర్గాలకు ప్రాధాన్యతపై అనుమానాలు
- కమిటీలు ఏమయ్యాయో తెలియడం లేదంటున్న నేతలు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల హామీల విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్లడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందే వరంగల్ వేదికగా రైతు డిక్లరేషన్‌ను ప్రకటించిన టీపీసీసీ.. ఆ తర్వాత ఒకట్రెండు డిక్లరేషన్‌లకు మాత్రమే పరిమితం కావడాన్ని ఆ పార్టీ నేతలే గుర్తు చేస్తున్నారు. యూత్, ఎస్సీ–ఎస్టీ డిక్లరేషన్‌లు ప్రకటించిన కాంగ్రెస్ బీసీ, మహిళా, మైనార్టీ డిక్లరేషన్‌లపై శీతకన్ను వేసిందన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే క్రమంలో కీలకమైన బీసీ, మైనార్టీ, మహిళా డిక్లరేషన్‌లను పక్కనపెట్టడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బీసీలకు కేటాయిస్తామని చెప్పిన టికెట్ల విషయంలో కోత పెడుతున్నారని, ఇప్పుడు వారికిచ్చే హామీలు, ప్రకటించే పథకాల్లోనూ పరిమితులు పెడతారేమోననే చర్చ జరుగుతోంది. మైనార్టీలు కూడా కాంగ్రెస్ పట్ల

మిగతా 3వ పేజీలో ▶


విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సంధ్యారాణి

ఏం చేసిందో చెప్పాకే ఎన్నికలకు రావాలి

బీఆర్ఎస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కేసీఆర్
- రాహుల్ గాంధీ ఏ మొహం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారు
- బీజేపీలో చేరిన పాలకుర్తి జెడ్పీటీసీ సంధ్యారాణి

3లో







SHIRTS • TROUSERS • JEANS • T-SHIRTS • SUITS & BLAZERS

AVAILABLE AT ALL LEADING STORES | www.ottostore.com | @ottoclothingofficial @ottoindia

బీజేపీ తొలి జాబితా రెడీ!

నేటి రాత్రి పార్టీ సీఈసీ భేటీలో గ్రీన్‌సిగ్నల్ వచ్చే చాన్స్ | ఢిల్లీ వెళ్లిన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల, ఇతర నేతలు | అంతకుముందు ప్రకాశ్ జవదేకర్, సునీల్ బన్సల్‌తో సమావేశాలు | అభ్యర్థుల జాబితా, ఇతర అంశాలపై తుది చర్చలు | నేటి రాత్రి, లేదా రేపు తొలి జాబితా విడుదలకు ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాపై రాష్ట్ర స్థాయిలో కసరత్తు పూర్తయింది. గురువారం రాత్రి ఢిల్లీలో జరగనున్న పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) భేటీలో, లేదా ఉన్నతస్థాయి సమావేశంలో అభ్యర్థులపై చర్చించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రాధాన్యతాంశాల వారీగా తెలంగాణ అభ్యర్థుల జాబితాపై చర్చ రాత్రికల్లా ముగిస్తే వెంటనే 40మందితో తొలి జాబితా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ముఖ్య నేతలు చెప్తున్నారు. ఒకవేళ ఆలస్యమైతే శుక్రవారం ఉదయం లేదా తర్వాతిరోజున విడుదల చేయనున్నారని పేర్కొంటున్నారు. అయితే సీఈసీ/ఉన్నతస్థాయి భేటీకన్నా ముందే.. అంటే గురువారం ఉదయం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అభ్యర్థుల తొలి జాబితాకు సంబంధించి తమ కసరత్తు, 40మంది అభ్యర్థుల ముసాయిదాపై చర్చించి.. సీఈసీకి సమర్పించే జాబితాకు తుదిరూపం ఇవ్వనున్నట్టు తెలిసింది. వీలైతే సాయంత్రం ప్రధాని మోదీతోనూ రాష్ట్ర నేతల బృందం సమావేశమయ్యే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.



రోజంతా కసరత్తు చేసి..

బీజేపీ ముఖ్య నేతలు బుధవారం పొద్దంతా హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ నివాసంలో, పార్టీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ సమక్షంలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేశారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ జి.వివేక్ వెంకటస్వామి తదితరులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. బీసీ ఎజెండాతో తెలంగాణ ఎన్నికలకు వెళ్లాలన్న ప్రధాని మోదీ సూచనల మేరకు.. 40కి మందికి పైగా బీసీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది.

జనసేన పోటీ నుంచి విరమించుకునేలా?

బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్ బుధవారం ఉదయం జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కార్యాలయానికి వెళ్లి చర్చించారని.. తెలంగాణలో పోటీచేయాలనే ఆలోచనను విరమించుకోవాలని సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. తెలంగాణలో బీజేపీకి మద్దతు ప్రకటించాలని కోరినట్టు తెలిసింది. తెలంగాణలో పోటీ చేయాలని జనసేన నాయకులు, కార్యకర్తల నుంచి ఒత్తిడి ఉందని పవన్ వివరించగా.. పొత్తు కుదుర్చుకునే ప్రసక్తే లేదని, పోటీ విరమించుకుని మద్దతు ఇవ్వాలని బీజేపీ నేతలు స్పష్టం చేసినట్టు సమాచారం. కాగా హైదరాబాద్‌లో సమావేశాలు ముగిశాక ప్రకాశ్ జవదేకర్, బన్సల్, కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, ఈటల, డీకే అరుణ, రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఢిల్లీ వెళ్లినట్టు పార్టీ నేతలు తెలిపారు.

ఈ సీట్లపై ఏకాభిప్రాయం

రాష్ట్ర నేతల చర్చల సందర్భంగా పోటీలేని, బలమైన క్యాండిడేట్లు ఉన్న నియోజకవర్గాలపై ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. ఇందులో అంబర్‌పేట (కిషన్‌రెడ్డి), హుజూరాబాద్ (ఈటల రాజేందర్), గద్వాల (డీకే అరుణ), దుబ్బాక (ఎం.రఘునందన్‌రావు), మునుగోడు (కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి), మహబూబ్‌నగర్ (ఏపీ జితేందర్‌రెడ్డి), సూర్యాపేట (సంకినేని వెంకటేశ్వర్‌రావు), కల్వకుర్తి (టి.ఆచారి), నిర్మల్ (మహేశ్వర్‌రెడ్డి), వరంగల్ ఈస్ట్ (ఎర్రబెల్లి ప్రదీప్‌రావు), వర్ధన్నపేట (కొండేటి శ్రీధర్), బోథ్ (సోయం బాపూరావు), ఖానాపూర్ (రమేశ్ రాథోడ్), మహబూబాబాద్ (హుస్సేన్ నాయక్), చొప్పదండి (బోడిగె శోభ), మహేశ్వరం(అందెల శ్రీరాములు యాదవ్), భూపాలపల్లి (చందుపట్ల కీర్తి) తదితర నియోజకవర్గాలు ఉన్నాయి. మరికొన్ని నియోజకవర్గాలకు సంబంధించి రెండు పేర్లతో జాబితాను రూపొందించినట్టు తెలిసింది. ఇక బీఆర్ఎస్ నుంచి కేసీఆర్, కేటీఆర్ వంటి ముఖ్యనేతలు పోటీచేసే సెగ్మెంట్ల విషయానికొస్తే.. కామారెడ్డిలో ధర్మపురి అర్వింద్, గజ్వేల్‌లో ఈటల రాజేందర్, సిరిసిల్లలో బండి సంజయ్.. ఇలా బీజేపీ ముఖ్య నేతలను బరిలో నిలపాలనే అంశం కూడా చర్చకు వచ్చినట్టు తెలిసింది.

తెలంగాణ భవన్‌లో బతుకమ్మ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు తెలంగాణ భవన్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. పార్టీ మహిళా విభాగం కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో బతుకమ్మలను పేర్చి వేడుకలను ప్రారంభించారు. వేడుకల్లో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, సునీత, వనం సంగీత, మంజులారెడ్డి, శాంతి శేఖర్, మాజీ రీజనల్ ఆర్గనైజర్ విజయారెడ్డి, సుశీలరెడ్డితో పాటు ప్రభారెడ్డి, పద్మావతి, వరంగల్ కార్పొరేటర్లు షీబా, అరుణ, చందన, నిర్మలారెడ్డి, శోభాగౌడ్ పాల్గొన్నారు.





ఇద్దరు రాష్ట్ర హైకోర్టు జడ్జీలు బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి

నియామకాన్ని నోటిఫై చేస్తూ కేంద్ర న్యాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. వీరు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల పాటు హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారు. శుక్రవారం ఉదయం ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. బదిలీపై వచ్చే జస్టిస్ గుహనాథన్ నరేందర్ ఎప్పుడు ప్రమాణం చేస్తారన్నది ఖరారు కాలేదు. ఆయన సీనియార్టీ ప్రకారం ఏపీ హైకోర్టులో నంబర్ త్రీ స్థానంలో ఉండనున్నారు.

తెలంగాణ హైకోర్టులో తగ్గనున్న జడ్జీల సంఖ్య

తెలంగాణ హైకోర్టులో చీఫ్ జస్టిస్ సహా మొత్తం 42 న్యాయమూర్తుల పోస్టులు ఉన్నాయి. ఇప్పటివరకు 30మంది పనిచేస్తుండగా.. తాజాగా జస్టిస్ ఎం.లక్ష్మణ్, జస్టిస్ అనుపమ చక్రవర్తి బదిలీకావడంతో ఈ సంఖ్య 28కి తగ్గింది. అలాగే జస్టిస్ చిల్లకూర్ సుమలత, జస్టిస్ సుధీర్‌కుమార్‌లను కూడా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇప్పటికే సిఫార్సు చేసింది. ఈ బదిలీలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా ఆమోదం పొందితే న్యాయమూర్తుల సంఖ్య 26కు తగ్గి, ఖాళీల సంఖ్య 16కు పెరగనుంది.

బీఆర్ఎస్ ఏం చేసిందో చెప్పాకే ఎన్నికలకు రావాలి

- నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కేసీఆర్
- రాహుల్ గాంధీ ఏ మొహం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- బీజేపీలో చేరిన పాలకుర్తి జెడ్పీటీసీ సంధ్యారాణి

సాక్షి, హైదరాబాద్: అధికార బీఆర్ఎస్ గత రెండు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో వేటిని నెరవేర్చిందో ప్రజలకు వివరించాకే అసెంబ్లీ ఎన్నికలకు రావాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రాభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడకుండా, ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికలల్లో అధికార బీఆర్ఎస్ కేవలం డబ్బులపైనే ఆధార పడిందని ధ్వజమెత్తారు. తమ నిర్లక్ష్యం, అసమర్థతతో ఉద్యోగాలు భర్తీ చేయకుండా, పేపర్ లీకేజీలకు కారణమై యువత, నిరుద్యోగులను వెన్నుపోటు పొడిచిన వ్యక్తి కేసీఆర్ అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కుటుంబ, అవినీతి పార్టీల పీడ వదలాలని అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, జి.వివేక్ వెంకటస్వామి సమక్షంలో పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి, పెద్దపల్లి, రామగుండంకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఏ మొహం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర మొత్తం అవినీతి మయమేనని, ఆ పార్టీ నేతలకు తెలంగాణలో పర్యటించే నైతిక హక్కు లేదని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కారు గత 4 నెలల్లోనే పన్నుల పేరుతో వేలకోట్ల రూపాయలు ప్రజల నుంచి దండుకుందన్నారు. బీఆర్ఎస్ సర్కారు అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందని, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతు రుణమాఫీ, దళితబంధు, గిరిజనబంధు, దళితులకు 3 ఎకరాల భూమి వంటి హామీలను నెరవేర్చకుండా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజలు నిశ్శబ్ద విప్లవంతో రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తంచేశారు. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కందుల సంధ్యారాణి బీజేపీలో చేరడం వల్ల పార్టీ బలోపేతం అవుతుందన్నారు. సంధ్యారాణి మాట్లాడుతూ తెలంగాణకు పట్టిన గ్రహణం వీడాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు.

మల్కాజిగిరి ప్రజలకు రుణపడి ఉంటా

- ప్రజలు మామ, అల్లుడికి బుద్ధిచెప్పి నన్ను ఎంపీగా గెలిపించారు: రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన మలిపెద్ది సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి



ప్రతాపసింగారంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఘట్‌కేసర్: 'కుట్రపన్ని కొడంగల్‌లో నన్ను ఓడించారు. నా శకం ముగిసిందని ప్రచారం చేశారు. రాహుల్‌గాంధీ ఆదేశం మేరకు మల్కాజ్‌గిరి ఎంపీగా పోటీ చేస్తే.. గుండెల్లో పెట్టుకొని నన్ను ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపారు. ఇక్కడి ప్రజలకు సదా రుణపడి ఉంటాను' అని ఎంపీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండాను ఎగరేయాలని, ఉప్పల్, ఎల్‌బీనగర్, మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుధీర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు సూచనలతో ముందుకెళ్లాలని నేతలకు పిలుపునిచ్చారు.

అవినీతి మల్లారెడ్డిని ఓడించడమే లక్ష్యం...

అవినీతి మల్లారెడ్డిని ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరామని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ఆయన మాట్లాడుతూ, మంత్రి మల్లారెడ్డి తీరుతో విసిగిపోయానని, ఆయనను ఓడించడానికే కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు.

ఓటరు కార్డు లేకున్నా ఓటేయొచ్చు..!

▶ మొదటి పేజీ తరువాయి

ఓటరు గుర్తింపు ధ్రువీకరణ సాధ్యం కానప్పుడు, కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన జాబితాలోని ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని ఆధారంగా చూపాల్సి ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. ప్రవాస భారత ఓటర్లు తమ పాస్‌పోర్టును తప్పనిసరిగా చూపాల్సి ఉంటుందని తెలిపింది. పోలింగ్‌కు కనీసం 5 రోజుల ముందు పోలింగ్ కేంద్రం పేరు, తేదీ, సమయం, ఇతర వివరాలతో ఓటర్లకు పోలింగ్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులను జారీ చేయాలని ఆదేశించింది. అయితే వీటిని ఓటరు గుర్తింపుగా పరిగణించరాదని స్పష్టం చేసింది.

ప్రత్యామ్నాయ ఫొటో ధ్రువీకరణ పత్రాలివే..

- ఆధార్‌కార్డు
- ఉపాధి హామీ జాబ్ కార్డు
- బ్యాంకు/తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్
- కేంద్ర కార్మికశాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు
- డ్రైవింగ్ లైసెన్స్
- పాన్‌కార్డు
- రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్, ఇండియా (ఆర్జీఐ).. నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్పీఆర్) కింద జారీ చేసిన స్మార్ట్ కార్డు
- భారతీయ పాస్‌పోర్టు
- ఫొటో గల పెన్షన్ పత్రాలు
- కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు/పీఎస్‌యూలు/ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు
- ఎంపీలు/ఎమ్మెల్యేలు/ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు
- కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజెబిలిటీ గుర్తింపు కార్డు (యూడీఐడీ)

ఆ డిక్లరేషన్లు ఎక్కడ?.. బీసీలు గర్జించేదెప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

సానుకూలంగా ఉన్న పరిస్థితుల్లో ఆ వర్గాల డిక్లరేషన్‌లు త్వరగా ప్రకటించని పక్షంలో బీసీ, మైనార్టీ వర్గాల ఓట్లు ఎలా వస్తాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

గర్జిస్తారా లేదా?

తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీసీ గర్జన నిర్వహించాలన్నది దాదాపు ఆరు నెలల కిందటి ప్రతిపాదన. ఎన్నికల వేడి రాజుకుంటుండగా ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోగా, అసలు నిర్వహిస్తారో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. బీసీ గర్జన నిర్వహించాలంటూ సీనియర్ బీసీ నాయకుడు వి.హన్మంతరావు జిల్లాలు కూడా తిరిగొచ్చారు. మిర్యాలగూడలో బీసీ గర్జన పెడతామని తొలుత చెప్పిన కాంగ్రెస్ నేతలు ఆ తర్వాత నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, షాద్‌నగర్‌లకు వేదిక మార్చారు. చివరిగా అక్టోబర్ 10న షాద్‌నగర్‌లో గర్జిస్తామని ప్రకటించారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క బృందం బెంగళూరుకు వెళ్లి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను బీసీ గర్జనకు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. అక్టోబర్ 10 తర్వాత దాదాపు పది రోజులు గడిచి పోయాయి. ఇంత వరకు బీసీలు గర్జించకపోవడం గమనార్హం.

మేనిఫెస్టో ఏదీ?

వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకిచ్చే హామీలను ప్రకటించేందుకు మాజీ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన మేనిఫెస్టో కమిటీని ఏఐసీసీ నియమించింది. ఈ కమిటీలో సభ్యుల సంఖ్యను పెంచుతూ పోతున్నారే కానీ, అసలు మేనిఫెస్టో రూపకల్పన ఎక్కడివరకు వచ్చిందో తెలియని పరిస్థితి ఉంది. శ్రీధర్‌బాబు బృందం అప్పుడప్పుడు గాంధీభవన్‌లో కాసేపు కూర్చుని వెళ్లిపోవడం మినహా మేనిఫెస్టో తయారీలో ఏ మేరకు పురోగతి ఉందన్న సమాచారం పార్టీ వర్గాలకు లేకుండా పోయిందనే చర్చ జరుగుతోంది.

పొన్నం, షబ్బీర్ అలీ కమిటీలు ఏమయ్యాయి?

రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లతో పాటు బీసీలు, మైనార్టీలకు ప్రత్యేకంగా డిక్లరేషన్‌లు ప్రకటిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు బీసీ డిక్లరేషన్ రూపకల్పన కోసం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన, మైనార్టీ డిక్లరేషన్ కోసం మాజీ మంత్రి షబ్బీర్ అలీ అధ్యక్షతన కమిటీలు నియమించింది. ఆరు గ్యారంటీల ప్రకటనకు ముందే ఈ కమిటీ సమావేశాలు కూడా జరిగాయి. షబ్బీర్ అలీ కమిటీ అయితే భాగస్వాములతో చర్చిస్తామని ప్రకటించింది. కానీ ప్రస్తుతం ఆ కమిటీలు ఏమయ్యాయో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు పార్టీ మేనిఫెస్టోలో ఈ కమిటీల సిఫారసులను ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటారన్న అనుమానాలు కూడా గాంధీభవన్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.



Somajiguda: 9052288129 | Kompally - 8886608622 | Malakpet - 9392482799 | Kukatpally - 7669400333, 6309012122 | Mettuguda - 9248046065 | AS Rao Nagar - 7997990139 | Attapur - 7330740606 | Himayathnagar - 9866781234 | Trimulgherry - 8886655512 | Kondapur - 7669400333, 6309012122 | Ranigunj - 9248046068 | RC Puram - 8886620108 | LB Nagar - 9248046090 | Madinaguda - 8982988982 | Branch: Uppal - 9248046099 | Eragadda - 9032000745 | Tolichowki - 7669400333 | Tadbund - 8886655519 | Lakadikapool - 9032000744 | Yamaha Bike Corner: Suraram Colony - 7669400333 | Jagathgirigutta - 7669400333 | Manikonda - 7669400333 | Nagaram - 9100477333 | Medak - 9676111306 | Shankerpally - 9885988559 | Medchal - 8886608617 | Siddipet - 9666160160.





మానవత్వం మీద ఎప్పటికీ మనం విశ్వాసం కోల్పోవద్దు. మానవత్వం అనేది మహాసముద్రం; మహాసముద్రంలోని కొన్ని బిందువులు మురికివైనంత మాత్రాన, మహాసముద్రం మురికి కాదు.

– మహాత్మా గాంధీ

సాక్షి

గురువారం, 19 అక్టోబర్ 2023

సమన్యాయ సంకటం

ధర్మం, న్యాయం వేరు... చట్టం వేరు. కాలాన్ని బట్టి సమాజం దృష్టి మారినంత వేగంగా చట్టం మారడం కష్టం. ఒకవేళ మార్చాలన్నా ఆ పని పాలకులదే తప్ప, న్యాయస్థానాల పరిధిలోది కాదు. స్వలింగ వివాహాలకు చట్టబద్ధమైన గుర్తింపునిచ్చేందుకు నిరాకరిస్తూ అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం వెలువరించిన తీర్పు ఆ సంగతే తేల్చింది. ''ఈ కోర్టు చట్టం చేయలేదు. ప్రభుత్వం చేసిన చట్టాలను విశ్లేషించి, వ్యాఖ్యానించగలదు. అది అమలయ్యేలా చూడ గలదు'' అని భారత చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం పేర్కొంది. స్వలింగ వివాహాలను అనుమతించాలంటే చట్టం చేయాల్సింది పార్లమెంటేననీ, అందుకు తగ్గట్టు 'ప్రత్యేక వివాహ చట్టాన్ని' (ఎస్ఎంఏ) సవరించే బాధ్యత పాలకులదేననీ అభిప్రాయపడింది. అయితే, ఎల్జీబీటీక్యూ సముదాయ సభ్యులకు కలసి జీవించే హక్కుందనీ, దాన్ని తమ తీర్పు తోసిపుచ్చడం లేదనీ స్పష్టతనిచ్చింది. స్వలింగుల పెళ్ళికి చట్టబద్ధత లభిస్తుందని గంపెడాశతో ఉన్న ఎల్జీబీటీక్యూలకు ఇది అశనిపాతమే. హక్కులకై వారి పోరాటం మరింత సుదీర్ఘంగా సాగక తప్పదు.

నిజానికి, స్వలింగ సంపర్కం నేరం కాదని 2018 జూలైలో సుప్రీమ్ చరిత్రాత్మక తీర్పునిచ్చింది. ఇక తదుపరిగా స్వలింగ జంటల వివాహాలకు చట్టబద్ధమైన గుర్తింపు లభిస్తుందని ఎల్జీబీటీక్యూ వర్గం భావించింది. అందుకు తగ్గట్లే ఆ గుర్తింపును కోరుతూ 21 పిటిషన్లు దాఖలయ్యాయి. పిల్లల్ని దత్తత చేసుకొనే హక్కు, పాఠశాలల్లో పిల్లల తల్లితండ్రులుగా పేర్ల నమోదుకు అవకాశం, బ్యాంకు ఖాతాలు తెరిచే వీలు, బీమా లబ్ధి లాంటివి కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ అంశంపై ఏప్రిల్‌లో పదిరోజులు ఏకబిగిన విచారణ జరిపి, మే 11న తీర్పు రిజర్వ్ చేసిన ధర్మాసనం మంగళవారం నాలుగు అంశాలపై వేర్వేరు తీర్పులిచ్చింది. స్వలింగ పెళ్ళిళ్ళ చట్టబద్ధత పార్లమెంట్ తేల్చాల్సిందేనంటూ ధర్మాసనం బంతిని కేంద్రం కోర్టులోకి వేసింది. పెళ్ళి చేసుకోవడాన్ని రాజ్యాంగం ఒక ప్రాథమిక హక్కుగా ఇవ్వలేదని ఏకగ్రీవంగా అభిప్రాయపడింది. అయితే, పిల్లల దత్తత సహా స్వలింగ సంపర్కుల ఇతర అంశాలపై అయిదుగురు జడ్జీల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. దాంతో, ధర్మాసనం 3–2 తేడాతో మెజారిటీ తీర్పునిచ్చింది.

వివాహ వ్యవస్థ, స్వలింగ సంపర్కాలపై ఎవరి అభిప్రాయాలు ఏమైనప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే అర్జెంటీనా, ఆస్ట్రేలియా, జర్మనీ, బ్రిటన్, జపాన్ సహా 34 దేశాలు సమ లైంగిక వివాహాలను చట్టబద్ధం చేశాయి. వచ్చే ఏడాది నుంచి 35వ దేశంగా ఎస్తోనియాలోనూ అది చట్టబద్ధం కానుంది. ఇవి కాక మరో 35 దేశాలు స్వలింగ సంపర్కులకు పెళ్ళి మినహా అనేక అంశాల్లో చట్టపరమైన గుర్తింపునిచ్చాయి. అమెరికా అయితే సాధారణ వివాహ జంటలకిచ్చే ప్రభుత్వ సౌకర్యాలన్నీ ఈ స్వలింగ జంటలకు సైతం 2015 నుంచి అందిస్తోంది. స్వలింగ సంపర్కం, లైంగికతల విషయంలో ప్రపంచంలో మారుతున్న ఆలోచనా ధోరణులకు ఇది ప్రతీక. అందుకే, మన దగ్గరా ఇంత చర్చ జరిగింది. ఆ మాటకొస్తే, భిన్న లైంగికత అనేది అనాదిగా సమాజంలో ఉన్నదే. మన గ్రంథాల్లో ప్రస్తావించినదే. అందుకే, సాక్షాత్తూ సుప్రీమ్ చీఫ్ జస్టిస్ సైతం, ఇదేదో నగరాలకో, ఉన్నత వర్గాలకో పరిమితమైనదనే అపోహను విడనాడాలన్నారు. అందరి లానే వారికీ నాణ్యమైన జీవితాన్ని గడిపే హక్కుందని పేర్కొన్నారు. ఇది గమనంలోకి తీసుకోవాల్సిన అంశం.

స్వలింగ జంటల వివాహాలకు పచ్చజెండా ఊపనప్పటికీ, భిన్నమైన లైంగికత గల ఈ సముదాయం దుర్విచక్షణ, ఎగతాళి, వేధింపుల పాలబడకుండా కాపాడాల్సిన అవసరం తప్పక ఉందని సుప్రీమ్ అభిప్రాయపడింది. అందుకు కేంద్రం, రాష్ట్రాలు తగు చర్యలు చేపట్టాలని కూడా కోర్టు ఆదేశాలిచ్చింది. మరోపక్క స్వలింగ సంబంధాల్లోని జంటలకున్న సమస్యలను పరిశీలించేందుకూ, వారికి దక్కాల్సిన హక్కులను చర్చించేందుకూ ఓ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. పెళ్ళికి చట్టబద్ధత దక్కలేదని నిరాశ కలిగినప్పటికీ, స్వలింగ జంటలకు ఒకింత ఊరటనిచ్చే విషయాలివి. అర్ధనారీశ్వర తత్వాన్ని అనాది నుంచి అర్థం చేసుకొంటూ వస్తున్న భారతీయ సమాజం భిన్న లైంగికతను ఘోరంగా, నేరంగా, నీచంగా చూడడం సరికాదు. ఆ సముదాయం సైతం మన లోని వారేనన్న భావన కలిగించాలి. దీనిపై ప్రజల్లో ప్రభుత్వం చైతన్యం పెంచాలి. శాసన నిర్మాతలు లైంగికతలో అల్పసంఖ్యాక సముదాయమైన వీరికి అవసరమైన చట్టం చేయడంపై ఆలోచించాలి.

భారతీయ సమాజంలో వైవాహిక, కుటుంబ వ్యవస్థలకు ప్రత్యేక స్థానమున్న మాట నిజం. అది అధిక సంఖ్యాకుల మనోభావాలు ముడిపడిన సున్నితమైన అంశమనేదీ కాదనలేం. స్వలింగ జంటల వివాహం, పిల్లల దత్తత, పెంపకం సంక్లిష్ట సమస్యలకు తెర తీస్తుందనే కేంద్ర ప్రభుత్వ భయమూ నిరాధారమని తోసిపుచ్చలేం. కానీ, ఈ పెళ్ళిళ్ళకు గుర్తింపు లేనందున పింఛన్, గ్రాట్యుటీ, వారసత్వ హక్కుల లాంటివి నిరాకరించడం ఎంత వరకు సబబు?

మన దేశంలో 25 లక్షల మందే స్వలింగ సంపర్కులున్నారని ప్రభుత్వం లెక్క చెబుతోంది. కానీ, బురద జల్లుతారనే భయంతో బయటపడిన వారు అనేకులు గనక ఈ లెక్క ఎక్కువే అన్నది ఎల్జీబీటీక్యూ ఉద్యమకారుల మాట. సంఖ్య ఎంతైనప్పటికీ, దేశ పౌరులందరికీ సమాన హక్కులను రాజ్యాంగం ప్రసాదిస్తున్నప్పుడు, కేవలం లైంగికత కారణంగా కొందరిపై దుర్విచక్షణ చూపడం సరికాదు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి, కాలానుగుణంగా పాత చట్టాల్లో మార్పులు చేయాలి. అందరూ సమానమే కానీ, కొందరు మాత్రం తక్కువ సమానమంటే ఒప్పుతుందా?

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు ఆశ్వయుజమాసం, **తిథి:** శు.పంచమి రా.10.28 వరకు తదుపరి షష్ఠి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.8.10 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ప.3.57 నుండి 5.28 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.49 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.28 నుండి 3.15 వరకు, **అమృత ఘడియలు:** ఉ.11.24 నుండి 1.00 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సాధారణ పరిస్థితులు నెలకొనేనా?

విశ్లేషణ



శ్యామ్ శరణ్

అక్టోబర్ 7 నాటి హమాస్ వరుస రాకెట్ దాడులను ఇజ్రాయెల్ తనదైన '9/11'గా అభివర్ణిస్తోంది. ఇరాన్, లెబనాన్ కూడా ఘర్షణ కేంద్రాలుగా మారితే వివాదం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. పాలస్తీనా సమస్యను అరబ్ రాజ్యాలతో సహా అన్ని ప్రభుత్వాలు పక్కన పెట్టేశాయి. ఇప్పుడు ఇదే ప్రాంతీయ, ప్రపంచ రాజకీయాలకు కేంద్రం అవుతుంది. సరిగ్గా హమాస్ సాధించాలనుకున్నది ఇదే. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాల స్థాపన చర్చలను నిలిపివేస్తున్నట్లు సౌదీ అరేబియా ప్రకటించింది. జీ20 శిఖరాగ్ర సమావేశంలో ఇజ్రాయెల్, దాని నౌకాశ్రయం హైఫాను కలుపుకొని ప్రకటించిన 'ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరోప్ ఎకనామిక్ కారిడార్' సందిగ్ధంలో పడే అవకాశం ఉంది.

2007 నుండి గాజా స్ట్రిప్‌ను పాలిస్తున్న పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్, అక్టోబర్ 7న, ఇజ్రాయెల్‌పై వరుస రాకెట్ దాడులను ప్రారంభించింది. ఆపై ఇజ్రాయెల్ దక్షిణ సరిహద్దులో కమాండో దాడులతో, ఇజ్రాయెల్ పౌరులను, విదేశీయులను విచక్షణారహితంగా చంపడమే కాకుండా, ఇజ్రాయెల్ పౌరులను, అనేక మంది ఇజ్రాయెల్ రక్షణ సిబ్బందిని అపహరించుకుపోయింది. సరిహద్దు సమీపంలో సంగీత ఉత్సవాన్ని ఆస్వాదిస్తున్న 250 మంది యువ ఇజ్రాయెలీలను, విదేశీయులను విచక్షణారహితంగా చంపివేశారు. ఈ హమాస్ దాడిని ఇజ్రాయెల్ తనదైన '9/11'గా అభివర్ణిస్తోంది. ఇతర ఇజ్రాయెలీలు అయితే, రెండవ ప్రపంచ యుద్ధంలో హోలోకాస్ట్ అని పిలుస్తున్న మారణకాండలో లక్షలాదిమంది యూదులను హిట్లర్ పాలనలోని జర్మనీలో గ్యాస్ ఛాంబర్‌లకు పంపిన తరహాలో మళ్లీ యూదులను అత్యంత దారుణంగా లక్ష్యంగా చేసుకున్న హత్యాకాండగా అభివర్ణించారు.

మనం ఇప్పుడు 20 లక్షల మందికి పైగా పాలస్తీనియన్లు నివసించే గాజా స్ట్రిప్‌లో ఒక పెద్ద మానవ విషాదం అంచున ఉన్నాము. గాజా ఉత్తర భాగంలో నివసించే ప్రజలను ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి స్ట్రిప్ దక్షిణ భాగం వైపు వెళ్లాలని ఇజ్రాయెల్ రక్షణ దళాలు హెచ్చరించాయి. అయితే, ఇజ్రాయెల్ వైమానిక దాడులు, ఫిరంగి బాంబు దాడులు కొనసాగుతున్నందున, దక్షిణం వైపునకు వెళ్లడానికి కూడా సురక్షితమైన మార్గాలు లేవు. ఈజిప్ట్‌కు వెళ్లే ఏకైక నిష్క్రమణ స్థానం రఫాహ్ చెక్‌పాయింట్ ద్వారా వెళుతుంది. దాన్ని కూడా మూసివేశారు. ఈజిప్ట్ కోరుకునే చివరి విషయం వేలాది పాలస్తీనియన్ల వలసే. ఇజ్రాయెల్ దిగ్బంధనం వల్ల అత్యవసరంగా కావలసిన ఆహారం, నీరు, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఇవన్నీ ఇజ్రాయెల్ ద్వారానే వస్తాయి. ఇప్పటికీ పనిచేస్తున్న ఆసుపత్రులు, క్లినిక్‌లలో వైద్య సామగ్రి అయిపోయింది. అమెరికా జోక్యం నీటి సరఫరా పునఃప్రారంభానికి దారితీసింది కానీ ఇది దక్షిణ గాజాకు మాత్రమే.

గాజాలో పాలస్తీనియన్ల ఈ సామూహిక శిక్ష, హమాస్ నాయకత్వాన్ని నిర్వీర్యం చేసే అవకాశం లేదు. దాని నాయకులు కొందరు ఇప్పటికే ఒమన్‌లో ఆశ్రయం పొందారు. మరికొందరు ఇరాన్ లేదా లెబనాన్‌కు పారిపోయి ఉండవచ్చు. లెబనాన్‌లోని ఇరాన్ అనుకూల ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకు మల్లే, ఇరాన్ హమాస్‌కు మద్దతు ఇస్తోంది. గాజాపై ఇజ్రాయెల్ బాంబుదాడిలో పలువురు బందీలు మరణించినట్లు హమాస్ ఇప్పటికే ప్రకటించింది.

ప్రపంచ స్థాయి నిఘా, సైనిక సామర్థ్యాలు ఉన్నప్పటికీ దాడిని నిరోధించలేకపోయిన బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వంపై ఇజ్రాయెలీలకు ఆగ్రహం ఉంది. అకస్మాత్తుగా, అనేకమంది ఊహించినట్లుగా ఇజ్రాయెల్ అభేద్యంగానూ, సురక్షితంగానూ కనిపించడం లేదు.



ప్రణాళికాబద్ధమైన దాడి నెతన్యాహు వైఫల్యాల నుండి దృష్టిని మళ్లించి, ప్రజలు ద్వేషిస్తున్న శత్రువుకు వ్యతిరేకంగా దేశాన్ని ఏకం చేసే రాజకీయ ప్రయోజనానికి మాత్రం ఉపయోగపడుతుంది. 1967 నుండి 2005 వరకు దక్షిణ గాజాలోని తన ఆవాసాలను ఖాళీ చేసి పాలస్తీనియన్ నేషనల్ అథారిటీ (పీఎన్ఏ)కి పగ్గాలు అప్పగించినట్లుగానే, ఇప్పుడు సైతం గాజాను ఆక్రమించడానికి ఇజ్రాయెల్ విముఖత చూపవచ్చు. కానీ 2007లో హమాస్ గాజా బాధ్యతలు స్వీకరించింది. అప్పటి నుండి పీఎన్ఏకి ఎటువంటి పాత్రా లేదు. గాజా దాని మధ్యధరా తీరంపై ఇజ్రాయెల్ గగనతల నియంత్రణను కొనసాగించింది. గాయపడిన, శత్రు జనాభాతో నిండివున్న గాజాను తాత్కాలికంగా తిరిగి ఆక్రమించడం కూడా ఇజ్రాయెల్ భద్రతను ఎలా మెరుగుపరుస్తుందో చెప్పడం కష్టం.

ఇజ్రాయెల్, కీలకమైన అరబ్ దేశాల మధ్య సంబంధాలను సాధారణీకరించే ధోరణి ఇప్పుడు సవాలును ఎదుర్కొంటోంది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాల స్థాపన, రాయబార కార్యాలయాల మార్పిడికి దారి తీస్తుందని భావిస్తున్న కీలకమైన చర్చలను నిలిపివేస్తున్నట్లు సౌదీ అరేబియా ఇప్పటికే ప్రకటించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో ఇజ్రాయెల్, దాని నౌకాశ్రయం హైఫాను కలుపుకొని ప్రకటించిన 'ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరోప్ ఎకనామిక్ కారిడార్' ఇప్పుడు సందిగ్ధంలో పడే అవకాశం ఉంది.

ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలు అమాయక పాలస్తీనియన్లను చంపడం, తీవ్రంగా గాయపర్చడం అనేది ఇప్పటికే అరబ్ వీధుల్లో ఆందోళన కలిగిస్తోంది. పైగా ఇజ్రాయెల్‌తో సామీప్యతను ప్రదర్శించడం ద్వారా అరబ్ పాలకులు తమ భద్రతకు హాని కలగాలని కోరుకోవడం లేదు. అమెరికా, యూరప్‌లోని గణనీయమైన అరబ్ డయాస్పోరాలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం మరియు ముస్లిమేతర ప్రజలలో కూడా ఆగ్రహావేశాలతో కూడిన ప్రదర్శనలు జరిగాయి.

పాలస్తీనా సమస్యను అరబ్ రాజ్యాలతో సహా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వాలు కూడా పక్కన పెట్టేశాయి. ఇప్పుడు ఇదే ప్రాంతీయ, ప్రపంచ రాజకీయాలకు కేంద్రం అవుతుంది. సరిగ్గా హమాస్ సాధించాలనుకున్నది ఇదే. శాంతి, శ్రేయస్సుతో కూడిన యుగానికి దారి తీస్తూ, ఇజ్రాయెల్‌ను పశ్చిమాసియా రాజకీయ ప్రధాన స్రవంతిలోకి తీసుకురాగల... అమెరికా మద్దతు కలిగిన ప్రాంతీయ ఒడంబడిక వైపు మొగ్గు చూపడం అనేది ఇప్పుడు సమాధి అయిపోయింది. ఇంకా చెప్పాలంటే పాలస్తీనా సమస్య ప్రస్తుతం స్తంభించిపోయింది. ఇది రివర్స్ కావచ్చు కూడా. ఇరాన్, లెబనాన్ కూడా ఘర్షణ కేంద్రాలుగా మారితే వివాదం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. విస్తృత స్థాయి యుద్ధంగా మారితే మహా విపత్తు అవుతుంది.

పౌరుల లక్ష్యాలపై హమాస్ ప్రారంభించిన భయంకరమైన ఉగ్రదాడుల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌కు సంఘీభావం తెలిపారు. అది అప్పుడు సముచితమే. కానీ తదుపరి పరిణామాలకు ఒక కారకం అవసరం. గాజా స్ట్రిప్‌లో హమాస్‌పై జరిగిన దాడిలో పాలస్తీనా పౌరులకు జరిగిన తీవ్ర నష్టాన్ని కూడా అంగీకరించాలి. వారి హక్కులు ఇజ్రాయెల్ ప్రజలకు ఉన్నంత ముఖ్యమైనవి, బలమైనవి కూడా.

మన పశ్చిమ పొరుగు ప్రాంతంలో పరిస్థితి భౌగోళికంగా, రాజకీయపరంగా ప్రమాదభరితంగా మారితే భారతదేశం కూడా నష్టపోతుంది. సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందనే అంచనాతో ఇప్పటికే చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో నివసిస్తున్న, పని చేస్తున్న దాదాపు 80 లక్షలమంది భారతీయుల సంక్షేమం కూడా ప్రమాదంలో పడుతుంది. ఇటీవలి కాలంలో, ఈ ప్రాంతంలో నిర్బంధం, సయోధ్య పట్ల సాధారణ ధోరణిని ఉపయోగించుకున్న భారతదేశం అరబ్ దేశాలతో, ఇజ్రాయెల్‌తో ఏకకాలంలో బలమైన భాగస్వామ్యాలను కొనసాగించగలిగింది. ఐ2యూ2 (ఇండియా–ఇజ్రాయెల్, యూఏఈ–యూఎస్) భాగస్వామ్యం ఆ ధోరణి కొనసాగుతుందనే అంచనాపై ఆధారపడి ఉంది. ఈ ఊహను పునః పరిశీలించవలసి ఉంటుంది.

మనం ఇప్పుడు రష్యా–ఉక్రెయిన్ యుద్ధంతో మాత్రమే కాకుండా పశ్చిమాసియాలో సంభవించే పెను మంటతో కూడా పోరాడవలసి ఉంది. వచ్చే ఏడాది అమెరికాలోనూ, మన దేశంలోనూ ఎన్నికలు జరగనుండగా, పెద్ద ఎత్తున రాజకీయ పరివర్తనలు కూడా జరుగుతున్నాయి. అనిశ్చితి, అనూహ్యత అపూర్వమైన స్థాయికి చేరుకున్నాయి. న్యూఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశం విజయవంతమైన ప్రకాశాన్ని, వాస్తవికత తాలూకు తాజా మోతాదుతో తగ్గించాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త విదేశాంగ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదా పద్ధతి?



నేనొక వికలాంగురాలిని. ముంబయిలోని ఖార్ రిజిస్ట్రార్ ఆఫీసులో అక్టోబర్ 16న పెళ్లి చేసుకున్నాను. ఆఫీసు రెండో అంతస్థులో ఉంది. లిఫ్టు లేదు. సంతకాల కోసం వాళ్లు కిందికి దిగలేదు. నన్ను రెండు అంతస్థుల వరకూ మోసు కెళ్లాల్సి వచ్చింది.

– విరాలీ మోదీ, టెడెక్స్ స్పీకర్

ముందైతే ఎంగేజ్‌మెంట్



నిన్న బాధపడ్డాం. ఇవాళ ఉత్కర్ష్ సక్సేనా (న్యాయవాది), నేను మా హక్కులను నిరాకరించిన అదే కోర్టు దగ్గరికి వెళ్లి మా ఉంగరాలను మార్చుకున్నాం. ఈ వారం న్యాయం జరగకపోవడం గురించినది కాదు, మా నిశ్చితార్థం గురించినది. పోరాడటానికి మరో రోజు వస్తాం.

– అనన్యా కోటియా, పీహెచ్‌డీ విద్యార్థి

అన్నింటికీ మందులా?



కొన్నిసార్లు ఒక ఫిజీషియన్‌గా కష్టమైన విషయం ఏమిటంటే, పేషెంట్‌కు ఏమీ చేయనక్కర్లేదని చెప్పాల్సి రావడం! 'వేచి ఉండండి. వాటికవే మానిపోతాయి'... ఇలా చెప్తే పేషెంట్లు తమ కన్సల్టేషన్ ఫీజుకు తగిన విలువ రాలేదనుకుంటారు. వాస్తవం ఏమిటంటే, కొన్ని జబ్బులకు మందులు అక్కర్లేదు.

– జోయితా, ఫిజీషియన్

అంతా వ్యతిరేకమే!



ఇండియాలోని మా 'క్వీర్' జనానికి దేశ సమైక్యత, మత సామరస్య పురస్కారాలను ఇవ్వాలి. అన్ని మతాల్లోని ఛాందసులను ఏకస్వరంలో మాట్లాడించేలా చేయగలిగే మాంత్రిక శక్తి మా దగ్గరుంది. అది రెయిన్‌బో మ్యాజిక్!

– అభిజిత్ మజుందార్, ప్రొఫెసర్

శాంతి కోసం...



అక్టోబర్ 27 శుక్రవారాన్ని ఉపవాసం, ప్రాయశ్చిత్తం, శాంతి కోసం ప్రార్థన జరిపే రోజుగా ప్రకటించాలని నిర్ణయించాను. వివిధ క్రైస్తవ సమూహాలను, ఇతర మతాల సభ్యులను, ప్రపంచంలో శాంతిని అతి ముఖ్యమైనదిగా తలిచే అందరినీ భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నాను.

– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

మంచి వ్యూహం



ఇరాన్ వ్యూహంలో ఎంత అద్భుతమైన మార్పు! మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా (సౌదీ అరేబియాతో) చక్కని సమన్వయంతో ముందడుగు వేయడం ఇందులో కీలకాంశం. ఇది ఇరాన్‌కు మరింత బలాన్ని పెంచుతుంది. అమెరికాను చర్చలకు దిగేలా ఒత్తిడి చేస్తుంది. (ఇజ్రాయిల్, పాలస్తీనా) ప్రాంతీయ రాజకీయాల్లో తప్పక జరిగే పర్యవసానం.

– ఎం.కె. భద్రకుమార్, మాజీ దౌత్యవేత్త

ఆపేద్దాం!



నేనొక ఇజ్రాయిలీ యూదును. నాకు ఏ హోదా లేదు. కానీ మనుషులం అందరం శాంతిగా బతికే అవకాశం ఉందని నమ్ముతాను. ప్రతి మనిషి జీవితం ఎంతో విలువైనదే. ఈ చిన్న గ్రహంలో మనమందరం ప్రేమతో అనుసంధానితమై ఉన్నాం. గాజాలో సాగుతున్న ఈ యుద్ధం వెంటనే ఆగిపోవాలి.

– అమీ దార్, యాక్టివిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

ఆటను ఆటగానే చూడాలి!

ఇప్పటికే క్రికెట్ ప్రపంచ కప్ సందడి మొదలయింది. ప్రస్తుతం దసరా సెలవులు కూడా రావడంతో ఈ సందడికి మరింత ఊపు వచ్చింది. మన దేశంలో క్రికెట్‌ని ఓ మతంలా చూస్తారు. అంత వరకు బాగానే ఉంటుంది. కానీ ఆ క్రీడను ఆస్వాదించేటప్పుడు మతాన్ని ప్రాతిపదికగా తీసుకోవడమే ఇబ్బందికరం.

ఇండియా, పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే ప్రపంచ వ్యాప్తంగా ఓ ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంటుంది. మీడియా ప్రచారం కూడా ఇందుకు తోడౌతుంది. అభిమానులు తీవ్ర భావోద్వేగాలకు గురౌతుంటారు. ఆటగాళ్లు కూడా తీవ్రమైన ఒత్తిడిలో ఉంటారు. కానీ ఈ మ్యాచ్‌ను కూడా ఓ సాధారణ మ్యాచ్‌గానే చూడాలి. అయితే ఇటీవల ఈ రెండు జట్ల మధ్య అహ్మదాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో కొంత మంది ప్రేక్షకులు పెద్ద ఎత్తున 'జై శ్రీరామ్' అని నినాదాలు చేశారంటూ వార్తలు వచ్చాయి.

తాజాగా పాకిస్తాన్ వికెట్ కీపర్ – బ్యాట్స్‌మన్ మహ్మద్ రిజ్వాన్ వివాదంలో చిక్కుకున్నారు. పాకిస్తాన్ – నెదర్లాండ్స్ మ్యాచ్ సందర్భంగా రిజ్వాన్ మైదానంలో నమాజ్ చేశాడు. ఇప్పుడు ఈ అంశంపై ఐసీసీలో ఫిర్యాదు దాఖలైంది. రిజ్వాన్‌పై సుప్రీంకోర్టు న్యాయవాది వినీత్ జిందాల్ ఐసీసీకి ఫిర్యాదు చేశారు. ఆయన మైదానంలో ప్రార్థన చేయడం ఆట స్ఫూర్తికి విరుద్ధమని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నిజానికి, రిజ్వాన్ గతంలో కూడా అలాగే చేశాడు.

ఏది ఏమైనా ఆటను ఆటగా చూసి ఆనందించాలి. ఆట జరిగేది రెండు జట్ల మధ్యే గానీ, రెండు మతాల మధ్య కాదని గ్రహించాలి. ఆటల్లోకి మతం వంటి సున్నితమైన విషయాలను జొప్పించకూడదు. అది క్రీడాస్ఫూర్తికి విరుద్ధం.

– ఎమ్. రాం ప్రదీప్, తిరువూరు

సమతుల్యత అవసరం

అభిప్రాయం



ఫిరోజ్ ఖాన్

బీఆర్ఎస్ ఎట్టకేలకు తన మేనిఫెస్టోను విడుదల చేసింది. కాంగ్రెస్ ఇప్పటికీ కసరత్తు చేస్తూనే ఉన్నది. మేనిఫెస్టో తయారీలో బీజేపీ కమిటీ నిమగ్నమై ఉంది. అయితే పార్టీల హామీలు చూస్తే హ్రాస్ పాటలా కనిపిస్తున్నాయి. ఒకరు 'మహాలక్ష్మి' పేరుతో నెలకు రూ. 2,500 ఇస్తామంటే మరొకరు 'సౌభాగ్యలక్ష్మి' పేరుతో రూ. 3,000 మహిళలకు జీవన భృతి కింద ఇస్తామంటున్నారు. ఒకరు రూ. 500కే గ్యాస్ అందజేస్తామంటే ఇంకొకరు రూ. 400కే మీ ఇంటికి చేరుస్తామంటున్నారు. దీంతో ఉచితాలు, సబ్సిడీలు, సంక్షేమ పథకాల మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉండాల్సిన అవసరముందనే చర్చ మళ్లీ మొదలైంది.

పార్లమెంట్ సాధారణ ఎన్నికల ముందు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో పార్టీలు విడుదల చేస్తున్న మేనిఫెస్టోలతో ఈ చర్చ మరింత ఎక్కువగా జరుగుతున్నది. అయితే అసమానతలను తగ్గించేందుకు ప్రవేశపెట్టే పథకాలను ఉచితాలుగా చూడవద్దని కొన్ని పార్టీలు వాదిస్తుండగా, ప్రభుత్వ నిధులను ఇష్టమొచ్చినట్లు పంచేయడం సరికాదని మరికొందరు అంటున్నారు. మరోవైపు పెద్ద పెద్ద వ్యాపార సంస్థలకు ప్రభుత్వం పన్ను రాయితీలు, రుణ మాఫీలు ఇస్తున్నప్పుడు... పేదలకు ఇచ్చే సబ్సిడీలను మాత్రమే ఉచిత పథకాలని ఎందుకంటారనే ప్రశ్న సైతం ఉన్నది. దీంతో ఉచితాలకు, సంక్షేమాలకు మధ్య లక్ష్మణరేఖ ఎవరు గీస్తారనే చర్చ ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది.

ఇష్టానుసారంగా హామీలు ఇచ్చిన పార్టీలు అనేక ఎన్నికల్లో ఓటమి చవి చూడడం మనం చూస్తూనే ఉన్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను బేరీజు వేసుకొని ఏ మేరకు పార్టీలు వాటిని



అమలు చేస్తాయో ఓటరు ఆలోచించి నిర్ణయం తీసుకుంటాడనడానికి ఇది నిదర్శనం.

ఏ పార్టీ ఎన్ని రకాల అభిప్రాయాలు వ్యక్తం చేసినా... అన్ని పార్టీలు సంక్షేమం పేరుతో ఉచిత పథకాల వైపే మొగ్గు చూపుతున్నట్టు కనిపిస్తున్నది. తెలంగాణలో ఇప్పటికే కాంగ్రెస్ 'సిక్స్ గ్యారెంటీస్'ను ప్రకటించింది. ఇందులో 'మహాలక్ష్మి', 'చేయూత', 'రైతు భరోసా' పథకాలు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు జమ చేసేవే. బీఆర్ఎస్ ఇప్పుడు ప్రకటించిన, మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 'రైతుబంధు', 'ఆసరా', 'సౌభాగ్యలక్ష్మి' పథకాలు సైతం నేరుగా నగదు బదిలీ రూపంలో అందే ప్రోత్సాహకమే. తెలంగాణలో ప్రస్తుతం బీజేపీ మేనిఫెస్టో రిలీజ్ కాకపోయినా... వివిధ రాష్ట్రాల్లో బీజేపీని చూసినా ఉచిత, సంక్షేమ పథకాలు ఎన్నో అమలు చేస్తున్నట్లు కనిపిస్తున్నది. ఇప్పటికే కేంద్రం రైతుల అకౌంట్లలో నేరుగా డబ్బులు జమ చేస్తున్నది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనేక సబ్సిడీలు అందుతున్నాయి. వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు సైతం ఇలాంటి పథకాలనే అమలు చేసి చూపిస్తున్నాయి.

ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు సైతం అనేక ఉచిత హామీలను ఇస్తున్నాయి. అయితే ఇందులో ఏవి చట్టబద్ధమైన సంక్షేమ పథకాలు? ఏవి ఉచితాలు? అనేది చెప్పడం చాలా కష్టం. అయితే వ్యక్తి ప్రయోజనం కంటే సమాజానికి ప్రయోజనాన్ని చేకూర్చే విద్య, ఆరోగ్యం వంటి ప్రోత్సహించేలా చేపట్టే చర్యలు మంచి ఫలితాలు ఇస్తాయని ఆర్థిక వేత్తలు చెబుతున్న మాట. వ్యక్తి సంక్షేమం కేంద్రంగా మొత్తం సమాజానికి మేలు చేసే పథకాలను పార్టీలు తమ మేనిఫెస్టోల్లో చేర్చి సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను పాటించేందుకు నడుం బిగించడం సర్వదా ఆమోదనీయ మవుతుంది.

వ్యాసకర్త సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
మొబైల్: 96404 66464

భగవద్ధ్యానం!

కావడిలో కుండల వంటివి సుఖదుఃఖాలని జీవితాన్ని తరచి చూసిన వాళ్ళకు అవగతమయ్యే సత్యం. రెండు వైపులా నీటితో నిండిన కుండలు లేకుండా కావడి ఎలాగైతే ఉండడం సాధ్యం కాదో అలాగే ఒకప్పుడు సుఖం మరొకప్పుడు దుఃఖం లేకుండా మానవ జీవితం గడవడం సాధ్యం కాదన్నది కూడా అంతే నిజం. సుఖంలో రోజులు గంటలుగా, గంటలు నిమిషాలుగా గడిచిపోతుంది జీవితం. కష్టంలోనూ, దుఃఖంలోనూ ఒక్కొక్క నిమిషం ఒక్కొక్క గంటలా మారి కాలం నత్త నడక నడుస్తున్నట్లుగా అనిపిస్తుంది. నిజానికి కాలం సుఖంలోనూ, దుఃఖంలోనూ ఏ తేడా లేకుండా ఒకేలా గడుస్తుంది. కాని అనుభవిస్తున్న మనిషికి మాత్రం అప్పుడు ఆ వ్యక్తి మనసున్న స్థితిని బట్టి ఆ రెండింటి మధ్య చాలా తేడా ఉన్నదన్న ఒక మిథ్యా భావనను కలిగిస్తుంది. కాబట్టి మనసు ఉన్న స్థితి అన్ని అనుభవాలకు కారణమని తెలుస్తుంది. తామరపల్లి తిమ్మయ ప్రధాని తన రచనయైన 'శేషధర్మం' కావ్యం ప్రథమాశ్వాసంలో ఈ భావననే ఒక చక్కని కందపద్యంలో తేలికగా అర్థమయ్యే మాటలలో చెప్పాడు.



వినుసుఖదుఃఖంబులకును
మనసే కారణము దాని మాటికి నెటకుం
జననీయక హరియందుం
బనుపఱుపుము కౌతుకంబు పాటిలు నీకున్.

మనుషుల ఆనందానికైనా, దుఃఖానికైనా మనస్సే కారణం. అంటే మనసు చేసే ఆలోచనలు, పొందే అనుభూతులే కారణం. కనుక మనసును అదుపులో ఉంచుకోవడం ద్వారా ఆలోచనలు పరిపరి విధాలుగా వెళ్ళడాన్ని నియంత్రించడం ఆవశ్యకం. అది అంత సులభంగా జరిగే పని కాదు కాబట్టి భగవంతుని ధ్యానంలో మనసు లగ్నం చేయడం మొదలు పెట్టి క్రమంగా అందులో ప్రావీణ్యాన్ని సాధించాలి. సుఖంలో మనసు మహదానందాన్ని అనుభవిస్తుంది. అదే దుఃఖంలో శోక సాగరంలో మునిగిపోయిన నౌకలా తయారవుతుంది. ఈ రెండు రకాల అనుభూతులు అనర్థదాయకాలే! ఆ స్థితి నుండి మనసును బయటికి లాగి స్థిర చిత్తం అనే అమృతమార్గం వైపునకు దారి చూపేది పరమాత్ముని ధ్యానమే కనుక అనంతుడు, అమేయుడు అయిన ఆ పరమేశ్వరుడిని ధ్యానించడంలో మనసును లగ్నం చేస్తే, తప్పక స్వస్థత చేకూరుతుంది అని సారాంశంగా పై పద్యంలో చెప్పబడింది.

– భట్టు వెంకటరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899



ములుగులోని రామాంజాపూర్‌లో నిర్వహించిన విజయభేరి సభకు హాజరైన ప్రజలు



సభా వేదికపై నుంచి అభివాదం చేస్తున్న ప్రియాంక, రాహుల్. చిత్రంలో కొండా సురేఖ, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి, అజారుద్దీన్, మాణిక్‌రావ్ ఠాక్రే, సీతక్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

దొరల తెలంగాణ, ప్రజల తెలంగాణ మధ్య సమరం

▶ మొదటి పేజీ తరువాయి

విజయ భేరి బహిరంగసభలో మాట్లాడారు.

నిరుద్యోగుల ఆత్మహత్యల బాట: రాహుల్

'ఇచ్చిన మాటను నిలబెట్టుకునే క్రమంలో మా అమ్మ సోనియాగాంధీ రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చినా తన రాజనీతిని మరువలేదు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది. కానీ ఇక్కడి ప్రభుత్వం 40 లక్షల మంది నిరుద్యోగులకు మొండిచేయి చూపడంతో వారు ఆత్మహత్యల వైపు పయనించే ప్రమాదం నెలకొంది. ఉద్యోగ ఖాళీలు నింపలేక, కుటుంబ పాలన కోసం పాటుపడే క్రమంలో 18 శాఖలు తమ చేతుల్లో పెట్టుకొని, జనాభాల్లో బీసీలు 50 శాతం ఉంటే ముగ్గురు బీసీలకు మాత్రమే కేబినెట్ మంత్రి పదవులు ఇవ్వడం సామాజిక న్యాయాన్ని విస్మరించారనేందుకు నిదర్శనం. ఉద్యమాలకు నిలయమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో టీచింగ్, నాన్ టీచింగ్ అధ్యాపకులను నింపకుండా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు పెద్దపీట వేసి పేదలకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు దూరదృష్టితో ఐఐటీ, ఐఎంఏ వంటి సంస్థలను నెలకొల్పితే మోదీ సర్కారు బీహెచ్‌ఈఎల్, రైల్వే వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోంది..' అని రాహుల్ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ

'తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ ఉంటుంది. బీజేపీ, బీఆర్ఎస్‌లు మిలాఖత్ అయ్యాయని, అవి ఎంఐఎంతో కలిసి ఉన్నాయనడానికి పార్లమెంటులో బీజేపీ ఏమి కోరుకుంటే బీఆర్ఎస్ దానికి మద్దతు పలకడమే నిదర్శనం. కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు ఆ మూడు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయి. బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్టే. బీఆర్ఎస్ పాలన మోదీ రిమోట్ ద్వారా నడుస్తోంది. విపక్ష నేతలందరిపై కేసులు పెట్టినా.. మీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్ కేసులు లేవు. నన్ను మా నేతలను మాత్రం కేంద్రం వేధిస్తోంది. నా ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసి 24 కేసులు పెట్టారు. అయినా సిద్ధాంతాలతో కూడిన లౌకిక పార్టీ కాంగ్రెస్‌ను ఎవరూ ఏమీ చేయలేరు..' అని రాహుల్ అన్నారు.

ఇందిరమ్మ మాదిరి చేయూతనిస్తాం..

'తెలంగాణలో అధికారంలోకి వచ్చాక హామీలన్నీ అమలు చేస్తాం. ఆరు గ్యారంటీలు తప్పకుండా నెరవేరుస్తాం. ఈ ప్రాంత ఆదివాసీలకు ఇందిరమ్మ మాదిరిగా చేయూతనిస్తాం. అధికారంలోకి రాగానే సమ్మక్క సారక్క జాతరను జాతీయ ఉత్సవంగా ప్రకటిస్తాం. రాష్ట్రంలో పోడు, అసైన్డ్ భూముల విషయంలో అందరికీ న్యాయం చేస్తాం..' అని రాహుల్ హామీ ఇచ్చారు.

సంక్షేమ పాలనకు సోనియమ్మ ఆరు గ్యారంటీలు: రేవంత్‌రెడ్డి

'కల్వకుంట్ల కుటుంబం నుంచి తెలంగాణను విముక్తి కల్పించడానికే రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఇక్కడికి వచ్చారు. తెలంగాణ ప్రజలకు సంక్షేమ పాలన అందించడానికి సోనియమ్మ ఆరు గ్యారంటీలు ప్రకటించారు. ప్రతి ఆడబిడ్డకు ప్రతి నెలా రూ.2,500 అందించడానికి సోనియమ్మ మాట ఇచ్చారు. రూ.500కే సిలిండర్‌ను మీ ఇంటికి తెచ్చే బాధ్యత సోనియమ్మ తీసుకుంది. ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు, ఉపాధి కూలీలకు రూ.12 వేలు కాంగ్రెస్ అందించనుంది. 200 యూనిట్ల వరకు ప్రతిఇంటికీ ఉచితంగా విద్యుత్ అందించనున్నాం. కల్యాణలక్ష్మి పేరుతో పెళ్లి చేసుకునే ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం అందించనుంది..' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చెప్పారు.

నియంత పాలనకు చరమ గీతం పాడుదాం: భట్టి విక్రమార్క

'రాజుల నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో నియంత కేసీఆర్ పాలనకు వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడుదాం. తెలంగాణ సంపద, వనరులు ప్రజలకు చెందాలని సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేరలేదు. సోనియా గాంధీ తీసుకొచ్చిన అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి..' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పార్టీ నేతలు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కుందూరు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, డి.శ్రీధర్‌రాబు, మధు యాష్కీగౌడ్, మల్లు రవి, జగ్గారెడ్డి, భూపాలపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప వయా హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: రాహుల్, ప్రియాంకా గాంధీలు బుధవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పలువురు వారికి స్వాగతం పలికారు. రాహుల్, ప్రియాంకా వారితో కొద్దిసేపు కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా టీపీసీసీ నేత జి.నిరంజన్ గురువారం చార్మినార్ వద్ద నిర్వహించనున్న రాజీవ్ గాంధీ సద్భావన దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను అందజేశారు. అనంతరం వారు హెలికాప్టర్‌లో రామప్పకు బయలుదేరి వెళ్లారు.



రామప్ప శిల్ప సంపదకు ఫిదా

వెంకటాపురం(ఎం) : రామప్ప ఆలయ శిల్ప సంపదకు రాహుల్, ప్రియాంకా ఫిదా అయ్యారు. పూజలు చేసిన తర్వాత వారు ఆలయాన్ని పరిశీలించారు. ఏ సంవత్సరంలో నిర్మించారు? రామప్ప అనే శిల్పి ఒక్కడే నిర్మించాడా? ఎన్నేళ్ల పాటు నిర్మించారు? అంటూ గైడ్ విజయ్‌ని ఆరా తీశారు. శిల్పాలను చూసి ముగ్ధులైన ప్రియాంకాగాంధీ నంది విగ్రహాన్ని ప్రత్యేకంగా ఫొటోలు తీసుకున్నారు. నంది విగ్రహం వద్ద వారు ఫొటోలు దిగారు.

రామప్ప ఆలయంలో పూజలు చేస్తున్న రాహుల్, ప్రియాంకా గాంధీ

లూటీలు చేస్తూ దండుకుంటున్నారు: ప్రియాంకా గాంధీ

'రాష్ట్రంలో అధికారం చేపట్టిన కేసీఆర్ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చకపోగా.. ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియాలతో లూటీలు చేస్తూ దండుకుంటున్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల పట్ల ఏమాత్రం శ్రద్ధ లేని ప్రభుత్వం ప్రజలను సామాజిక న్యాయానికి దూరం చేసింది. భూదాన్ భూములకు రక్షణ లేకుండా ధరణి పోర్టల్‌తో స్కామ్‌లు చేస్తూ రియల్ ఎస్టేట్ చేస్తోంది. బంగారు తెలంగాణ పేరిట ప్రజల్ని మోసం చేస్తూ లక్షల కోట్లు దండుకుంటూ 50 శాతం బీసీలకు ఉన్న 27 శాతం రిజర్వేషన్‌ను ఆచరణలో 23కి తీసుకువచ్చారు. దళితులకు మూడు ఎకరాల భూమి, ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారు. కాళేశ్వరం పేరిట లక్ష కోట్లు దండుకున్నారు. ధరణి పోర్టల్ పెద్ద స్కామ్. డబుల్‌బెడ్ రూమ్‌లు ఇవ్వలేదు. రూ.లక్ష రుణమాఫీ చేయలేదు..' అని ప్రియాంకా ధ్వజమెత్తారు. కర్ణాటక, రాజస్తాన్, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఇచ్చిన హామీలు నెరవేర్చామని, రాజస్థాన్‌లో ఉచితంగా వైద్యం హామీ కింద రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే భరిస్తోందని గుర్తు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో వరి ధాన్యానికి రూ.2,500 గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని చెప్పారు.

నేడు పెద్దపల్లిలో రాహుల్ పర్యటన

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ సాక్షి, పెద్దపల్లి: రాహుల్‌గాంధీ బస్సుయాత్ర రెండవ రోజు గురువారం పెద్దపల్లి జిల్లాలో కొనసాగనుంది. ఉదయం మంథనిలో రోడ్‌షోలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు రామగిరి మండలంలో సింగరేణి గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో సింగరేణి కార్మికులతో సమావేశమవుతారు. సాయంత్రం పెద్దపల్లిలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడతారు. తర్వాత బహిరంగ సభలో పాల్గొంటారు. రాత్రి 7 గంటలకు కరీంనగర్ చేరుకొని 8 గంటల వరకు పాదయాత్ర చేస్తారు. రాత్రికి కరీంనగర్‌లోనే బస చేయనున్నారు.



Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

చిత్రంలో చూపించిన ఉత్పత్తులు మార్కెట్ లో లభించే అసలు ఉత్పత్తి కంటే వేరుగా ఉండవచ్చు. ఉత్పత్తిలో చూపించబడిన యాక్సెసరీస్ ప్రామాణిక సామగ్రిలో భాగంగా లేవు.

Honda Exclusive Authorized Dealerships: HIMAYAT NAGAR: Autofin Honda - 9985550099, 9908055755; NAMPALLY: Autofin Honda - 9985550099; 9701022300; UPPAL: Autofin Honda - 9985550099, 9989129090; DOMALGUDA: Autofin Honda - 9985550099, 8886629908; M.G. ROAD: Fortune Honda - 27570000, 9948888084; MALKAJGIRI: Fortune Honda - 27249166, 9948831000; SAINIKPURI: Fortune Honda - 27114200, 9948888085; KUSHAIGUDA: Fortune Honda - 65816112, 9948888767; NEW BHOIGUDA: Fortune Honda - 04029888801, 9948888051; W. MAREDPALLY: Fortune Honda - 29709044, 99488 88079; DAMMAIGUDA: Fortune Honda - 9948888048; SP ROAD: Fortune Honda - 48541878, 9948877736; KUKATPALLY: JSP Honda - 18005727177, 9959251133; MADINAGUDA: JSP Honda - 9959251188; CHINTAL: JSP Honda - 23084477, 9959891100; BALKAMPET: JSP Honda - 9959045592; MIYAPUR: JSP Honda - 9959891133; GANDIMAISAMMA: Ojasvi Honda - 9000003316; SOMAJIGUDA: Pratul Honda - 66732233, 7036532323; ERRAGADDA: Pratul Honda - 23801312, 9959532323; MALAKPET: Aadi Honda - 44178888/77/99, 9399999408; NAGOLE: Aadi Honda - 9399999402; MOOSARAMBAGH: Aadi Honda - 900030445; KOTHAPET: Aadi Honda - 9533120625; SANTOSH NAGAR: Aadi Honda - 9397999304, 8019798113; VANSTHALIPURAM: Deccan Honda - 8340866669, 8340866660; B N REDDY NAGAR: Deccan Honda - 04035164961, 04035164962; TADBUND: Raam Honda - 9100091054; BALANAGAR: Raam Honda - 9100211168; TIRUMALAGIRI: Raam Honda - 8886645057; ALWAL: Raam Honda - 9100091052; MEDCHAL: Sowmya Honda - 9951044400; TOLICHOWKI: Orange Honda - 9160188880; MASAB TANK: Orange Honda - 9581797921; BAHADURPURA: Maximus Honda - 7670820146/147/148/149, 9705806488; IBRAHIMPATNAM: Maximus Honda - 9293946999; ATTAPUR: Dwaraka Honda - 24001221, 8977001221; SHAMSHABAD: Dwaraka Honda - 9000633877; KONDAPUR: Vaishnaoi Honda - 9908822933, 9618277911; GACHIBOWLI: Vaishnaoi Honda - 8886604419, 8886604420; VIKARABAD: 8886720099, 8886940099; MADHAPUR: 7799345543, 7799765765; HABSIGUDA: Ride Honda - 7207022299, 9885418834; GHATESKAR: Ride Honda - 9885014931; MEDIPALLY: Ride Honda - 9885014935; KOMPALLY: Raam Honda - 9100771605; CHANDRAYANGUTTA: Maximus Honda - 8501026666, 24446477; NARSAPUR: A1 Honda - 9440202875; KOTHUR: Sun Honda - 08548-256161, 9000245092; TURKYAMJAL: Sri Sai Honda - 08415-234848, 9391334848; TUKKUGUDA: Dwarka Honda - 7730888843; MEDAK RC PURAM: Harmony Honda - 23180000, 9491025000; SANGAREDDY: VenkataSaai Honda - 9603755559; GAJWEL: VenkataSaai Honda -9133925559; SIDDIPET: Harmony Honda - 9491025048; ZAHEERABAD: Harmony Honda - 9491025020; SADASIVPET: Sree Krishna Honda - 9885921659; MEDAK: Sri Venkateshwara Honda - 9032003412, 08452-221999; TOOPRAN: VenkataSaai Honda - 9121095559; JOGIPET: VenkataSaai Honda - 9121395559.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

మలాలా యూసఫ్‌జాయ్ రూ.2.5 కోట్ల విరాళం



లండన్: గాజా ఆసుపత్రిలో జరిగిన బాంబు పేలుడు ఘటనలో ఏకంగా 500 మందికిపైగా జనం మృతిచెందడం పట్ల ప్రపంచ వ్యాప్తంగా సానుభూతి వెల్లువెత్తుతోంది. ఈ మారణకాండను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. పెద్ద సంఖ్యలో చిన్నారులు బలి కావడం పట్ల పాకిస్తాన్ సాహస బాలిక, నోబెల్ శాంతి బహుమతి విజేత మలాలా యూసఫ్‌జాయ్ చలించిపోయారు. ఈ మేరకు బుధవారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. గాజాలోని అల్–అహ్లీ ఆసుపత్రిలో బాంబు పేలుడు ఘటనను మీడియాలో చూసి భయాందోళనకు గురయ్యానని చెప్పారు. ఈ ఘాతుకాన్ని ఖండిస్తున్నానని తెలిపారు. వెంటనే కాల్పుల విరమణ పాటించాలని, గాజాకు నిత్యావసరాలు, ఆహారం, నీరు సరఫరా చేయాలని ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని మలాలా కోరారు. ఈ విపత్కర సమయంలో గాజాలో పాలస్తీనియన్ల సంక్షేమం కోసం కృషి మూడు స్వచ్ఛంద సంస్థలకు 3 లక్షల డాలర్ల (రూ.2.5 కోట్లు) విరాళం ఇవ్వబోతున్నానని మలాలా ప్రకటించారు. ఇజ్రాయెల్, పాలస్తీనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా శాంతి కోసం పోరాడుతున్నవారితో తాను కూడా గొంతు కలుపుతున్నానని వ్యాఖ్యానించారు. గాజా జనాభాలో సగం మంది 18 ఏళ్లలోపు వారేనని అన్నారు.

దాడి ఘటనపై మోదీ దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ: గాజా ఆసుపత్రిలో బాంబు పేలుడులో పెద్ద సంఖ్యలో జనం మరణించడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణలో సాధారణ ప్రజలు బలి కావడం దురదృష్టకరమని వాపోయారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇప్పటికైనా గాజాలో హింసకు తెర పడాలని ఆకాంక్షించారు. ఆసుపత్రిలో బాంబు పేలుడుకు బాధ్యులైన వారిని తప్పనిసరిగా శిక్షించాలని నరేంద్ర మోదీ డిమాండ్ చేశారు. బాధితుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఐరాసలో వీగిపోయిన తీర్మానం

ఐరాస: గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందించేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో బుధవారం బ్రెజిల్ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానం వీగిపోయింది. ఇజ్రాయెల్ మిత్రదేశం అమెరికా ఈ తీర్మానాన్ని వీటో చేసింది. ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కు గురించి ఈ తీర్మానంలో ప్రస్తావించకపోవడం తమను అసంతృప్తికి గురి చేసిందని అమెరికా వెల్లడించింది. ముసాయిదా తీర్మానానికి అనుకూలంగా 12 దేశాలు ఓటు వేశాయి. రష్యా, బ్రిటన్ గైర్హాజరయ్యాయి. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన అమెరికా వీటో చేయడంతో తీర్మానం ఆమోదం పొందలేదు.

ఆ కిరాతకం మీదే..



అహ్లీ ఆసుపత్రిలో పేలుడులో బలైన పాలస్తీనియన్ల మృతదేహాలు

అల్–అహ్లీ ఆసుపత్రిలో పేలుడుపై ఇజ్రాయెల్–హమాస్ పరస్పర నిందలు

మిలిటెంట్ల రాకెట్ గురితప్పడం వల్లే ఈ దారుణం

- ఇజ్రాయెల్ సైన్యం స్పష్టీకరణ.. ఖండించిన హమాస్
- ముమ్మాటికీ ఇజ్రాయెల్ బాధ్యత వహించాలని స్పష్టీకరణ
- ఆసుపత్రిలో పేలుడు ఘటనలో 471 మంది మృతి
- ఇజ్రాయెల్‌లో అమెరికా అధ్యక్షుడు బైడెన్ పర్యటన

గాజా స్ట్రిప్/టెల్ అవీవ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ: గాజా సిటీలోని అల్–అహ్లీ ఆసుపత్రిలో పేలుడు ఘటనపై ఇజ్రాయెల్, హమాస్ పరస్పరం నిందలు మోపుకుంటున్నాయి. దాదాపు 500 మందిని బలిగొన్న కిరాతకులు మీరంటే మీరేనని వాదులాటకు దిగాయి. ఇస్లామిక్ జిహాద్ మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్ గురితప్పడంతో ఈ దుర్ఘటన జరిగిందని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ, ముమ్మాటికీ ఇజ్రాయెల్ సైన్యమే ఈ ఘాతుకానికి ఒడిగట్టిందని హమాస్ ఆరోపించింది. అల్–అహ్లీ ఆసుపత్రి ప్రాంగణంలో హృదయవిదారక వాతావరణం నెలకొంది. క్షతగాత్రులను ఎక్కడికి తరలించాలో తెలియడం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే గాజాలో ఆసుపత్రులన్నీ బాధితులతో నిండిపోయానని గుర్తుచేస్తున్నారు. ఇక్కడ వైద్య సదుపాయాలు లేకపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందంటున్నారు. మరోవైపు ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం బుధవారం 12వ రోజుకు చేరింది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలో ఇప్పటివరకు 3,478 మంది మరణించారని, 12,000 మందికిపైగా క్షతగాత్రులుగా మారారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. మరో 1,300 మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు భావిస్తున్నామని, వారు ప్రాణాలతో బయటపడతారన్న నమ్మకం లేదని వెల్లడించింది. హమాస్ రాకెట్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా జనం ప్రాణాలు కోల్పోయారని స్థానిక అధికారులు పేర్కొన్నారు. దాదాపు 200 మంది బందీలు ఇప్పటికీ హమాస్ అధీనంలోనే ఉన్నారు. వారిని విడిపించేందుకు ఇజ్రాయెల్ సాగిస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలితాన్ని ఇవ్వడం లేదు. ఇరుపక్షాలు మెట్టు దిగిరావడం లేదు. దాంతో బందీల పరిస్థితి ఏమిటన్నది ఆందోళనకరంగా మారింది. గత 12 రోజుల్లో హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై 450 రాకెట్లు ప్రయోగించారని అంచనా. ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ గాజాపై వైమానిక దాడులు కొనసాగించింది.

భయంకరమైన ఊచకోత: హమాస్

అల్–అహ్లీ హాస్పిటల్‌లో పేలుడుకు తాము కారణం కాదని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగారీ చెప్పారు. ఆ పేలుడుతో తమకు సంబంధం లేదన్నారు. పేలుడు జరిగిన సమయంలో తాము ఆ ప్రాంతంపై అసలు ఎలాంటి దాడులు చేయలేదని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం 6.59 గంటల సమయంలో సమీపంలోని ఓ శ్మశాన వాటిక నుంచి పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ అయిన ఇస్లామిక్ జిహాద్ సభ్యులు రాకెట్‌ను ప్రయోగించినట్లు తమ రాడార్ గుర్తించిందని తెలిపారు. ఈ రాకెట్ గురితప్పి, ఆసుపత్రి బయట పార్కింగ్ ప్రాంతంలో పేలిందని వెల్లడించారు. ఆసుపత్రిలో పేలుడు ఘటనను 'భయంకరమైన ఊచకోత'గా హమాస్ అభివర్ణించింది. ఈ దురాగతానికి ఇజ్రాయెల్ సైన్యమే కారణమని పేర్కొంది. ఈ మారణకాండకు బాధ్యత వహించకుండా ఇజ్రాయెల్ తప్పించుకోవాలని కుట్ర పన్నుతోందని ఆరోపించింది. అల్–అహ్లీ ఆసుపత్రిని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ కొన్ని రోజుల క్రితమే ఆదేశించిందని గుర్తుచేసింది. ఆసుపత్రిలో పేలుడులో 500 మంది చనిపోయారని గాజా ఆరోగ్య శాఖ మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. బుధవారం ఆ సంఖ్యను 471గా సవరించింది.

బైడెన్‌తో సమావేశాలు రద్దు

గాజా ఆసుపత్రిలో పేలుడు ఘటనకు నిరసనగా జోర్డాన్ కఠిన నిర్ణయం తీసుకుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో జరగాల్సిన సమావేశాన్ని జోర్డాన్ రాజు అబ్దుల్లా–2 రద్దు చేసుకున్నారు. పాలస్తీనా నేత మొహమ్మద్ అబ్బాస్, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సీసీ కూడా ఇదే బాటలో నడిచారు. బైడెన్‌తో తాము భేటీ కావడం లేదని తేల్చిచెప్పారు. దాంతో బైడెన్ తన పర్యటనను కేవలం ఇజ్రాయెల్‌కే పరిమితం చేసుకుంటున్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మధ్య ప్రాచ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోందని జోర్డాన్ విదేశాంగ మంత్రి సఫాదీ చెప్పారు.

హమాస్ లావాదేవీలపై ఆంక్షలు

ఇజ్రాయెల్‌పై దాడికి దిగి, వెయ్యి మందికి పైగా జనాన్ని బలి తీసుకున్న మిలిటెంట్ సంస్థ హమాస్‌పై అగ్రరాజ్యం అమెరికా కఠిన చర్యలు ప్రారంభించింది. 10 మంది హమాస్ మిలిటెంట్ల బృందం ఆర్థిక లావాదేవీలపై ఆంక్షలు విధిస్తున్నట్లు బుధవారం అమెరికా ప్రకటించింది. అలాగే హమాస్ ఆర్థిక నెట్‌వర్క్‌పైనా ఆంక్షలు ఉంటాయని పేర్కొంది. గాజా, సూడాన్, తుర్కియే, అల్జీరియా, ఖతార్‌లో ఈ ఆంక్షలు అమలవుతాయని వెల్లడించింది. ఈ ఆంక్షల వల్ల విదేశాల నుంచి హమాస్‌కు నిధులు అందకుండా కట్టడి చేసినట్లు అవుతుందని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ జానెట్ చెప్పారు. ఇరాన్ ప్రభుత్వం హమాస్ మిలిటెంట్లకు అండగా నిలుస్తూ, భారీ ఎత్తున ఆర్థిక సాయం అందిస్తోంది. అమెరికా ఆంక్షల కారణంగా ఇకపై నిధులు ఇవ్వడం సులభం కాదు. వివిధ దేశాల్లో హమాస్ సభ్యుల బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలపై అమెరికా ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆయా ఖాతాల్లోకి డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఆ పేలుడుకు కారణం ఇజ్రాయెల్ కాదు: బైడెన్

గాజా హాస్పిటల్‌లో భీకర పేలుడుకు ఇజ్రాయెల్ ఎంతమాత్రం కారణం కాదని, 'మరో బృందం' ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు కనిపిస్తోందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. ఆయన బుధవారం ఇజ్రాయెల్‌లో టెల్ అవీవ్‌కు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో బైడెన్‌కు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం, తాజా పరిణామాలు, గాజా ప్రజలకు అందించాల్సిన మానవతా సాయంపై చర్చించుకున్నారు. అల్–అహ్లీ ఆసుపత్రిలో పేలుడు ఉదంతం ప్రస్తావనకు వచ్చింది. ఇస్లామిక్ జిహాద్ సభ్యులు ప్రయోగించిన రాకెట్ మిస్‌ఫైర్ కావడం వల్లే ఈ పేలుడు జరిగిందన్న ఇజ్రాయెల్ వాదనతో బైడెన్ ఏకీభవించారు. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌కు సంఘీభావంగా ఆయన ఇక్కడ పర్యటిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రజల ధైర్యసాహసాలు, అంకితభావం, శౌర్యాన్ని గౌరవిస్తూ ఇజ్రాయెల్‌లో పర్యటిస్తుండడాన్ని గర్వకారణంగా భావిస్తున్నానంటూ బైడెన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇజ్రాయెల్ ప్రజల దుఃఖాన్ని అమెరికన్లు సైతం పంచుకున్నారని చెప్పారు. ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ మరింత విస్తరించకూడదన్నదే తన ఉద్దేశమని తెలిపారు. ఈజిప్టు నుంచి మానవతా సాయాన్ని గాజాలోకి అనుమతించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని వివరించారు.



జో బైడెన్‌కు స్వాగతం పలుకుతున్న బెంజమిన్ నెతన్యాహూ

గాజా, వెస్ట్‌బ్యాంక్‌కు 100 మిలియన్ డాలర్ల సాయం: బైడెన్

టెల్ అవీవ్: గాజా, వెస్ట్‌బ్యాంక్‌కు 100 మిలియన్ డాలర్ల (రూ.832.87 కోట్లు) మానవతా సాయం అందిస్తామని అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ప్రకటన బుధవారం ప్రకటించారు. గాజా ప్రజలకు ఇప్పుడు ఆహారం, నీరు, ఔషధాలు, వసతి చాలా అవసరమని అన్నారు. గాజాకు ఇతర దేశాల నుంచి మానవతా సాయం చేరడానికి అంగీకరించాలని ఇజ్రాయెల్ కేబినెట్‌ను కోరానని 'ఎక్స్'లో పోస్టు చేశారు. తాము అందించే 100 మిలియన్ డాలర్ల సాయం హమాస్‌కు, ఉగ్రవాద సంస్థలకు చేరకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, బాధిత పాలస్తీనియన్లకు మాత్రమే అందేలా తగిన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇజ్రాయెల్‌కు తమ మద్దతు ఉంటుందని బైడెన్ పునరుద్ఘాటించారు.

ఇజ్రాయెల్‌పై నిరసనల వెల్లువ



యెమెన్ రాజధాని సనాలో..



లెబనాన్ రాజధాని బీరుట్‌లో..



బీరుట్‌లో..



తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో..



టునీషియాలో..



ఇరాన్‌లోని టెహ్రాన్‌లో

జనాన్ని దోచుకుంటున్న అదానీ



పత్రికలో వచ్చిన కథనాన్ని చూపుతున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ మీద కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మరోసారి ఆరోపణలు ఎక్కుపెట్టారు. బొగ్గు దిగుమతులను విపరీతంగా పెంచి చూపడం ద్వారా ప్రజల నుంచి అదానీ గ్రూప్ ఏకంగా రూ.12 వేల కోట్లు దోచుకుందని బుధవారం ఆరోపించారు. ఈ మేరకు పలు మీడియా రిపోర్టులను విలేకరుల ముందు ప్రదర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై తక్షణం విచారణకు ఆదేశించి తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాలని సవాల్ విసిరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గి కాంగ్రెస్ అధికారంలోకి ఈ ఉదంతంపై సమగ్ర విచారణకు ఆదేశిస్తుందని ప్రకటించారు. దీనిపై మోదీకి మౌనమెందుకని ప్రశ్నించారు. విచారణకు ఆదేశించి తన విశ్వసనీయతను నిరూపించుకోవచ్చు కదా అని నిలదీశారు. 'అదానీ ఇండొనేసియాలో కొనుగోలుచేసిన బొగ్గు ధర భారత్‌కు వచ్చేసరికి రెట్టింపు అవుతోంది! ఈ అడ్డగోలు పెంపు కారణంగా భారత్‌లో కరెంట్ చార్జీలు పెరిగాయి. వినియోగదారుల జేబుకు చిల్లు పడుతోంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై సబ్సిడీ భారం పెరిగింది' అని రాహుల్ ఆరోపించారు. ఇలాంటివి ఇంకే దేశంలో జరిగినా ప్రభుత్వాలే పడిపోయేవని ఆయన వ్యాఖ్యానించారు. కానీ మన దగ్గర ఇంత జరిగినా కనీస చర్యలు లేవని ఆరోపించారు. 'ఒకే ఒక్క వ్యక్తి చేస్తున్న ఈ దారుణ దోపిడీని ప్రధాని చూసీచూడనట్టు పోతున్నారు. ఆయనను పదేపదే కాపాడుతున్నారు' అని రాహుల్ మండిపడ్డారు.

గాంధీలది అవినీతి కుటుంబం: బీజేపీ

గాంధీల కుటుంబమే అవినీతిలో కూరుకుపోయిందని బీజేపీ విమర్శించింది. వారిపై అవినీతి కేసులున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ అన్నారు. అదానీ అంశం సుప్రీంకోర్టులో ఉన్నా రాహుల్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే ఆయనకు కోర్టు మీద గౌరవం లేదని స్పష్టమవుతోందన్నారు. 'రాహులే నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్ మీద ఉన్నారు. వారిది ప్రపంచంలోకెల్లా అత్యంత అవినీతిమయమైన కుటుంబం' అంటూ మండిపడ్డారు.

ఏడు దేశాలకు బాస్మతీయేతర బియ్యం ఎగుమతులు

న్యూఢిల్లీ: బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని మరో ఏడు దేశాలకు ఎగుమతి చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. నేపాల్, మలేషియా, ఫిలిప్పైన్స్, సీషెల్స్, కామెరూన్, ఐవొరీ కోస్ట్, రిపబ్లిక్ ఆఫ్ గినియా దేశాలకు బాస్మతీయేతర బియ్యాన్ని వివిధ పరిమాణాల్లో ఎగుమతి చేయవచ్చని సూచించింది. నేషనల్ కో–ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్, ది డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్‌ల ద్వారా మాత్రమే బియ్యం ఎగుమతులకు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏడు దేశాలకు 10,34,800 టన్నుల బాస్మతీయేతర తెల్ల బియ్యాన్ని ఎగుమతి చేయవచ్చని పేర్కొంది. నేపాల్‌కు 95,000 టన్నులు, కామెరూన్‌కు 1,90,000 టన్నులు, ఐవొరీ కోస్ట్‌కు 1,42,000, రిపబ్లిక్ ఆఫ్ గినియాకు 1,42,000, మలేషియాకు 1,70,000, ఫిలిప్పైన్స్‌కు 2,95,000 టన్నుల తెల్లబియ్యం ఎగుమతులకు అనుమతి మంజూరు చేసింది. యూఏఈ, సింగపూర్ దేశాలకు కూడా బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

మళ్లీ అణు పరీక్షల బాటలో రష్యా!

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం ఇప్పటికే దీర్ఘకాలిక పోరుగా మారిపోయిన నేపథ్యంలో ఆ దేశానికి పాశ్చాత్య దేశాల సాయానికి అడ్డుకట్ట వేసేందుకు అవసరమైతే అణు పరీక్షలు జరిపేందుకు రష్యా సిద్ధమవుతోందా? తాజా పరిణామాలను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. అంతర్జాతీయ సమగ్ర అణు పరీక్షల నిషేధ ఒప్పందానికి ఆమోదాన్ని వెనక్కు తీసుకునేందుకు ఉద్దేశించిన బిల్లుకు రష్యా పార్లమెంట్ డ్యూమా దిగువ సభ తుది ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన సమావేశంలో చట్ట సభ సభ్యులంతా ఏకగ్రీవంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇక ఆ బిల్లు వచ్చే వారం ఎగువ సభ అయిన ఫెడరేషన్ కౌన్సిల్ ముందుకు వెళ్లనుంది. 2000 నాటి ఈ ఒప్పందం నుంచి తప్పుకుంటామని పుతిన్ ఇటీవలే ప్రకటించడం తెల్సిందే. 1996లో తెరపైకి వచ్చిన ఈ ఒప్పందం ఏ దేశమూ ప్రపంచంలో ఎక్కడా అణు దాడులు చేయకూడదు. అయితే ఈ ఒప్పందం పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. రష్యా మాత్రమే దీనికి పూర్తి ఆమోదం తెలిపింది. అమెరికా, భారత్, పాకిస్థాన్, ఉ.కొరియా తదితర దేశాలేవీ దీనికి ఆమోదం తెలపలేదు. రష్యా వీలైనంత త్వరగా మళ్లీ అణు పరీక్షలకు దిగి సత్తా చాటాలని ఆ దేశ రాజకీయ వర్గాల నుంచి పుతిన్‌పై ఒత్తిడి పెరిగిపోతోంది.

జర్నలిస్టు సౌమ్య హత్య కేసులో నలుగురూ దోషులే

- తీర్పు వెలువరించిన ఢిల్లీ కోర్టు
- సహకరించిన ఐదో వ్యక్తినీ దోషిగా తేల్చిన కోర్టు

న్యూఢిల్లీ: ప్రముఖ టీవీ మహిళా పాత్రికేయురాలు సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసు 15 ఏళ్ల తర్వాత ఓ కొలిక్కి వచ్చింది. ఈ సంచలనాత్మక కేసులో ఒక వ్యవస్థీకృత నేరగాళ్ల బృందానికి చెందిన నలుగురిని దోషులుగా తేలుస్తూ ఢిల్లీ కోర్టు తీర్పుచెప్పింది. ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. 2008 సెప్టెంబర్ 30వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన ఈ హత్య దేశమంతటా సంచలనం సృష్టించింది. ప్రముఖ ఇంగ్లిష్ వార్తా చానల్‌లో పని చేస్తున్న సౌమ్య 30వ తేదీన తెల్లవారుజామున ఆఫీస్ పని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా నెల్సన్ మండేలా మార్గ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. దారిదోపిడీ యత్నమే హత్యకు దారి తీసిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మాలిక్, అజయ్ కుమార్‌లను హత్య, దోపిడీ అభియోగాల కింద దోషులుగా నిర్ధారిస్తూ అదనపు సెషన్స్ జడ్జి రవీంద్ర కుమార్ పాండే తీర్పు వెలువరించారు. దోచుకున్న సొత్తును తీసుకోవడంతో పాటు హంతకులకు సాయం చేసిన అభియోగాల్లో ఐదో నిందితుడు అజయ్‌సేథీనీ కోర్టు దోషిగా నిర్ధారించింది. ఈ ఐదుగురు దోషులకు ఈనెల 26వ తేదీన శిక్షలు ఖరారు చేయనున్నారు. కిటకిటలాడిన కోర్టు గదిలో జడ్జి తీర్పు చదివి వినిపించారు. నిందితులంతా దోపిడీకి పాల్పడే ఉద్దేశంతోనే సౌమ్యను హత్య చేసినట్టు బలమైన ఆధారాలతో రుజువైందని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. ఐపీసీ సెక్షన్లు 302, 34 కింద ఈ ఐదుగురినీ దోషులుగా ప్రకటించారు.

వీరికి జీవిత ఖైదు పడాలి: తల్లి

దోషులందరికీ జీవిత ఖైదు విధించాలని సౌమ్య తల్లి మాధవి డిమాండ్ చేశారు. తమ కుటుంబం అనుభవించిన క్షోభను వాళ్లూ అనుభవించి తీరాలన్నారు. తీర్పు అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నిందితులంతా 2009 నుంచీ పోలీసు కస్టడీలోనే ఉన్నారు. జిగీశా ఘోష్ అనే ఐటీ ఉద్యోగి హత్యకు వాడిన ఆయుధాన్ని రికవర్ చేయడంతో సౌమ్య కేసును ఛేదించేందుకు మార్గం సుగమం అయిందని పోలీసులు వెల్లడించారు.

'ఎక్స్'లో పోస్ట్ పెట్టాలంటే డబ్బులు కట్టాలి

వాషింగ్టన్: మైక్రోబ్లాగింగ్ సైట్ 'ఎక్స్'(ట్విట్టర్) తన వినియోగదారులకు చేదువార్త చెప్పింది. 'నాట్ ఎ బాట్' అనే కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. దీనిప్రకారం.. 'ఎక్స్'లో కొత్త యూజర్లు పోస్ట్‌లు చేయాలన్నా, వేరొకరి ట్వీట్‌ను రీట్వీట్ చేయాలన్నా, రిప్లై ఇవ్వాలన్నా, లైక్ కొట్టాలన్నా, షేర్ చేయాలన్నా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సబ్‌స్క్రిప్షన్ ఫీజు కింద ఏడాదికి ఒక డాలర్ చొప్పున 'ఎక్స్' యాజమాన్యం వసూలు చేయనుంది.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు 4 శాతం డీఏ

- రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్
- గోధుమ మద్దతు ధర రూ.150 పెంపు
- చక్కెర ఎగుమతులపై నిషేధం పొడిగింపు
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: పండుగ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు. ఉద్యోగులకు డీఏ, పెన్షనర్లకు డీఆర్‌ను 4 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగులకు డీఏ వారి మూల వేతనంలో 46 శాతానికి చేరింది. అలాగే నాన్ గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనాన్ని బోనస్‌గా ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తర్వాత మీడియా సమావేశంలో వెల్లడించారు. డీఏ, డీఆర్ పెంపుతో 48.67 లక్షల మంది కేంద్ర ప్రభుత్వోద్యోగులు, 67.95 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందుతారని ఆయన తెలిపారు. వీటితో ఖజానాపై రూ.2,857 కోట్ల భారం పడనుంది. డీఏ పెంపు 2023 జూలై 1 నుంచి వర్తిస్తుంది. గత మార్చి, 2022 సెప్టెంబర్‌లో డీఏ, డీఆర్ 4 శాతం మేరకు పెరిగాయి. ఇక బోనస్ పెంపుతో లోకో పైలట్లు, గార్డులు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్ మెన్, ఇతర గ్రూప్– సి సిబ్బంది సహా 11.07 లక్షల మంది రైల్వే ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. దీని ద్వారా రైల్వేలపై రూ.1,969 కోట్ల ఆర్థిక భారం పడనుందని ఠాకూర్ తెలిపారు. మరోవైపు చక్కెర ఎగుమతులపై నిషేధాన్ని అక్టోబర్ నెలాఖరును దాటి నిరవధికంగా కేంద్రం పొడిగించింది. భారత్ ప్రపంచంలో అతి పెద్ద చక్కెర తయారీదారు. రెండో అతి పెద్ద ఎగుమతిదారు. 2024–25 రబీ మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి గోధుమలకు మద్దతు ధరను మరో రూ.150 మేర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,125గా ఉంది. దీన్ని రూ.2,275కు పెంచినట్లుగా కేంద్రం ప్రకటించింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ స్థాయిలో మద్దతు ధరను పెంచడం ఇదే తొలిసారి. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో గోధుమలు సహా బార్లీ, ఎర్రపప్పు, శనగలు, కుసుమ, ఆవాల మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎర్రపప్పు (మసూర్) ధర రూ.425 మేర పెంచడంతో క్వింటాల్ ధర రూ.6,425కి చేరింది. ఆవాలకు కనీస మద్దతు ధరను రూ.200 పెంచడంతో అది రూ.5,650కి చేరుకుంది. కుసుమలు క్వింటాల్ రూ.5,650గా ఉండగా, రూ.150 చొప్పున పెంచడంతో రూ.5,800లకు చేరింది. బార్లీ మద్దతు ధరను రూ.115 మేర పెంచడంతో ధర 1,735 నుంచి రూ.1,850కి చేరింది. శనగల కనీస మద్దతు ధరను రూ.150 మేర పెంచారు. దీని ధర క్వింటాల్‌కు రూ.5,335 నుంచి రూ.5,440కి చేరింది.

మరింత సహకారం

- పుతిన్, జిన్‌పింగ్ నిర్ణయం
- ద్వైపాక్షిక అంశాలపై చర్చలు



జిన్‌పింగ్‌తో సమావేశమైన రష్యా అధినేత పుతిన్

తైపే: విదేశీ విధానంతో పాటు పలు అంశాల్లో మధ్య మరింత సమన్వయంతో ముందుకెళ్లాలని, అన్ని విషయాల్లోనూ పరస్పరం సహకరించుకోవాలని చైనా, రష్యా నిర్ణయించాయి. చైనా ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టు పదో వార్షికోత్సవంలో పాల్గొనేందుకు చైనాకు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం ఉదయం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. బీఆర్ఐలో భాగంగా ఆసియా, మధ్యప్రాచ్యంతో పాటు పలు ఇతర చోట్ల ఎన్నో దేశాల్లో చైనా భారీ నౌకాశ్రయాలు, జాతీయరహదారులు, విద్యుత్కేంద్రాల వంటివి నిర్మిస్తోంది. దీంతో శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలు చైనాకు భారీగా రుణపడిపోయాయి. తద్వారా ఆయా దేశాలలో తన పట్టు పెంచుకోవడమే ఈ ప్రాజెక్టు వెనుక చైనా అసలు ఉద్దేశమని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు కొన్నేళ్లుగా హెచ్చరిస్తూనే ఉన్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగంలో మితిమీరిన పెట్టుబడులు తదితరాల కారణంగా చైనా ఆర్థిక వ్యవస్థ సైతం నేలచూపులు చూస్తోంది. ఈ కఠిన పరిస్థితుల్లో ఇరు దేశాల విదేశీ విధానంలో మరింత సన్నిహిత సమన్వయం అవసరమని పుతిన్ ద్వైపాక్షిక భేటీ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ద్వైపాక్షిక వర్తకం తిరిగి పట్టాలకెక్కిందని, ఈ ఏడాది రికార్డు స్థాయిలో ఏకంగా 200 బిలియన్ డాలర్లను దాటనుందని పుతిన్ వివరించారు. అతి గోప్యమైన పలు అంశాలు చర్చకు వచ్చినట్లు పుతిన్ తెలిపారు. చర్చలు చాలా ఫలప్రదంగా జరిగాయన్నారు. బీఆర్ఎఫ్ ఫోరం భేటీకి పుతిన్ రావడం వరుసగా ఇది మూడో సారని పింగ్ అన్నారు. తన సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు రష్యా చేసే అన్ని ప్రయత్నాలకూ చైనా మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రష్యా చమురు, గ్యాస్ ఉత్పత్తులకు చైనా ప్రధాన వినియోగదారు అన్నది తెలిసిందే. తద్వారా ఉక్రెయిన్ యుద్ధంతో చితికిపోతున్న రష్యా ఆర్థిక వ్యవస్థకు చైనా ఊపిరులూదుతోంది. ముఖ్యంగా అమెరికా, పాశ్చాత్య దేశాల వరుస కఠిన ఆంక్షల నేపథ్యంలో రష్యాను చైనా ఎంతగానో ఆదుకుంటోంది. ప్రతిగా చైనా విదేశీ విధానాలన్నింటికీ రష్యా కొంతకాలంగా మద్దతిస్తూ వస్తోంది. స్వయంపాలిత తైవాన్‌పై అనుసరిస్తున్న అణచివేత విధానాలకు వత్తాసు పలుకుతోంది. ఈ నేపథ్యంలో విదేశీ విధానాల్లో బంధాన్ని మరింత దృఢం చేసుకుంటామంటూ పుతిన్, జిన్‌పింగ్ చేసిన ప్రకటన ఆందోళన పెంచేదేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆజం ఖాన్‌కు ఏడేళ్ల జైలు

- భార్య, కుమారునికి కూడా
- తప్పుడు బర్త్ సర్టిఫికేట్ కేసులో శిక్ష

రాంపూర్(యూపీ): తప్పుడు బర్త్ సర్టిఫికేట్ల కేసులో సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్ తో పాటు ఆయన భార్య తజీన్ ఫాతిమా, కుమారుడు అబ్దుల్లా ఆజమ్‌లకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు జడ్జి శోభిత్ బన్సల్ బుధవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఆ వెంటనే కోర్టు గదిలోనే ముగ్గురినీ పోలీసులు జ్యుడీషియల్ కస్టడీకి తీసుకున్నారు. తర్వాత రాంపూర్ జిల్లా జైలుకు తరలించారు. అబ్దుల్లాకు రెండు బర్త్ సర్టిఫికేట్లు ఉన్నాయంటూ బీజేపీ ఎమ్మెల్యే ఆకాశ్ సక్సేనా 2019లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు సర్టిఫికేట్ పొందేందుకు తల్లిదండ్రులిద్దరూ అతనికి సాయం చేశారని పేర్కొన్నారు. వారు ముగ్గురు ఐపీసీ సెక్షన్లు 420, 467, 468, 471, 472, 120బి కింద శిక్షార్హులని జడ్జి పేర్కొన్నారు. జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.50 వేల జరిమానా విధించారు. 2017లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అబ్దుల్లాకు వయసు చాలకపోవడంతో దాన్ని ఎక్కువ చేసి చూపుతూ లక్నో నుంచి తప్పుడు బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నారని సక్సేనా తెలిపారు. ఆ ఎన్నికల్లో అబ్దుల్లా ఎమ్మెల్యేగా గెలిచారు. 2022 ఎన్నికల్లోనూ ఆయన మళ్లీ నెగ్గారు. ప్రభుత్వోద్యోగిపై చేయి చేసుకున్న కేసులో గత ఫిబ్రవరిలో మొరాదాబాద్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. దాంతో అబ్దుల్లా శాసన సభ్యత్వం రద్దయింది. విద్వేష ప్రసంగాల కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడటంతో 2019లో ఆజాం ఖాన్ శాసన సభ్యత్వం రద్దవడం తెలిసిందే. ఆయన రికార్డు స్థాయిలో ఏకంగా 10సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యునిగా చేశారు.

సంక్షేమం భళా.. మౌలికం ఎలా ?



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార సాధనే లక్ష్యంగా అన్ని రాజకీయ పక్షాలు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నాయి. ప్రధానంగా సంక్షేమాన్నే నమ్ముకుని ఎన్నికల హామీలిస్తున్నాయి. ప్రచారంలో కానీ, పార్టీ ప్రణాళికల్లో కానీ సంక్షేమ ఆధారిత అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. అధికార భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), కాంగ్రెస్‌తో పాటు బీఎస్పీ కూడా ఇదే బాటలో నడుస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ మాత్రం ఇంతవరకు మేనిఫెస్టో విడుదల చేయలేదు. ఇక బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) సంక్షేమ సూత్రాన్నే ప్రధానంగా అనుసరించినా.. అభివృద్ధి, ఉపాధి అంశాలకు కూడా చోటిస్తూ తన ఎన్నికల ప్రణాళిక విడుదల చేసింది. అయితే దేశాభివృద్ధికి కీలకమైన రెండు ప్రధానమైన అంశాలకు సంబంధించి ఏ పార్టీ కూడా స్పష్టమైన హామీలు ఇవ్వడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కీలకమైన విద్య, వైద్యానికి సంబంధించి తమ విధానమేమిటో? బడ్జెట్‌లో ఏ మేరకు నిధులు పెంచుతారన్న అంశాలను ఎక్కడా చెప్పడం లేదు. ప్రస్తుత బీఆర్ఎస్ ప్రభుత్వం కానీ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కానీ విద్య, వైద్యంపై చేసిన వ్యయం చాలా తక్కువగా ఉండటం గమనార్హం. కాగా అతి ప్రధానమైన మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

అధికారమే లక్ష్యంగా రాజకీయ పార్టీల అడుగులు

- ప్రజా సంక్షేమ పథకాలకే ప్రాధాన్యం
- ఎన్నికల ప్రణాళికల్లో ఆయా అంశాలకే చోటు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీలది అదే దారి
- కీలకమైన రెండు అంశాలను విస్మరిస్తున్నాయనే విమర్శలు
- విద్య, వైద్యాన్ని పట్టించుకోవడం లేదు
- ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి లేదు!

సంక్షేమం సరే..

సంక్షేమ పథకాలను ఎవరూ తప్పుబట్టడం లేదని, అదే సమయంలో సుస్థిర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు దోహదపడే కార్యక్రమాలపై పార్టీలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విద్య, వైద్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు, చేస్తున్న వ్యయం పరిశీలిస్తే ఇది స్పష్టంగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కూడా వ్యయం చేయడం లేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. విద్యపై వ్యయం ఎంత పెరిగితే.. భవిష్యత్‌కు అంత పెట్టుబడి అనే అంశాన్ని పార్టీలు విస్మరిస్తున్నాయని అంటున్నారు. అలాగే రహదారుల అభివృద్ధి, ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, యూనివర్సిటీలు, పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాల గురించి ప్రధాన పార్టీలు పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తుండటం గమనార్హం.

ఎన్నికల హామీలు ఇలా..

కాంగ్రెస్: ఆరు గ్యారంటీల పేరిట పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహిస్తోంది. వివిధ రకాల డిక్లరేషన్లు ప్రకటిస్తోంది. మరిన్ని సంక్షేమ పథకాలపై కూడా ఆ పార్టీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి మహాలక్ష్మి పేరిట ప్రతి మహిళకు రూ. 2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద ఏటా ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరిపంట బోనస్ రూ.500, అన్ని కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రూ.5 లక్షల ఆర్థిక సాయం, విద్యార్థులకు రూ.5 లక్షల వరకు వడ్డీ రహిత ఆర్థిక సహాయం, మహిళలకు రూ.4,000 పింఛను.

బీఆర్ఎస్: ప్రధానంగా రైతుబంధు పెంపు, పెన్షన్ల పెంపు, రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ, తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఇంటికి రైతు బీమా తరహాలోనే రూ.5 లక్షల జీవితబీమా, అర్హులైన మహిళలకు నెలకు రూ.3 వేల భృతి, రూ.400కే సిలిండర్, ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితి రూ.15 లక్షలకు పెంపు, పేదలకు ఇళ్ల స్థలాలు, అగ్రవర్ణ పేదలకు రెసిడెన్షియల్ స్కూళ్లు, అసైన్డ్ భూములపై ఇక హక్కుదారులకే పూర్తి అధికారం.

బీఎస్పీ: ఐదేళ్లలో యువతకు 10 లక్షల ఉద్యోగాలు. భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరా భూమి, మహిళా సంఘాలకు ఏటా లక్ష రూపాయలు, ఉచిత వాషింగ్ మిషన్లు, వృద్ధులకు వసతి గృహం, ఉచిత వైద్యం, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు తోడ్పాటు, మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్, ప్రతి మండలం నుంచి 100 మంది విద్యార్థులకు విదేశీ విద్య, పల్లె, పట్టణాల్లోని వారికి 150 రోజుల ఉపాధి, రూ.15 లక్షల వరకు ఆరోగ్య బీమా, ఆరోగ్యానికి రూ.25 వేల కోట్ల బడ్జెట్, రూ.5 వేల కోట్లతో గల్ఫ్ కార్మికుల సంక్షేమ నిధి, 600 సబ్సిడీ క్యాంటీన్లు, ఇల్లు లేని వారికి 550 చ.గజాల స్థలం, ఇల్లు కట్టుకునే వారికి రూ.6 లక్షల ఆర్థిక సాయం.

ఉదాహరణకు గత మూడేళ్లలో విద్య, వైద్యానికి బడ్జెట్ కేటాయింపులు పరిశీలిస్తే..

విద్య:

2021-22లో వాస్తవ వ్యయం	8%
2022-23లో బడ్జెట్ అంచనా	7.3%
2022-23లో సవరించిన బడ్జెట్	8%
2023-24లో బడ్జెట్ అంచనాలు	7.06%

వైద్యం:

2021-22లో వాస్తవ వ్యయం	4.2%
2022-23లో బడ్జెట్ అంచనా	5%
2022-23లో సవరించిన అంచనా	5.5%
2023-24లో బడ్జెట్ అంచనా	5%

నెగ్గడానికి షార్ట్‌కట్ మార్గాలు

సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలే అట్టడుగు వర్గాల ప్రజల నిజమైన అభివృద్ధికి దోహదపడతాయి. సంక్షేమ పథకాలు ఇవ్వాల్సిందే.. కానీ అవి వారికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలి. పార్టీల మేనిఫెస్టోలు చూస్తుంటే విద్య, వైద్యం, యువత, ఉపాధికి సంబంధించిన అంశాలను అవి పట్టించుకోవడం లేదు. కేవలం డబ్బు పంపిణీ చేయడం ద్వారా ఎన్నికల్లో గెలవాలన్న తపనే రాజకీయ నాయకుల్లో కనిపిస్తోంది. ఇది మంచిది కాదు. ఇప్పుడు ఇరవై ముప్పయ్ కోట్లు పెడితే తప్ప ఎన్నికల్లో నిలబడలేని పరిస్థితి ఉంది. ఎన్నికల్లో గెలిచాక అవినీతితో పెద్ద ఎత్తున సంపాదించాలనే దృష్టి ఉంటుంది తప్ప, అభివృద్ధి చేయాలనే తపన ఎందుకు ఉంటుంది? - ఆకునూరి మురళి, రిటైర్డ్ ఐఏఎస్

2004లో బలపడిన హస్తం



2004 శాసనసభ ఎన్నికలలో ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ విజయం సాధించింది. కాంగ్రెస్‌కి 185 సీట్లు రాగా టీడీపీకి కేవలం 47 సీట్లే వచ్చాయి. టీఆర్ఎస్‌కు 26, సీపీఎంకు తొమ్మిది, సీపీఐకి ఆరు స్థానాలు లభించగా, బీజేపీ రెండు సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్, టీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ కలిసి పొత్తు పెట్టుకుని పోటీ చేయడం విశేషం. జనతా రెండు, సమాజ్‌వాదీ పార్టీ ఒకటి, బీఎస్పీ ఒకటి, ఎంఐఎం. నలుగురు, ఇండిపెండెంట్లు పదకొండు మంది గెలిచారు. జనతా, సమాజవాది పార్టీ టికెట్లపై గెలిచినవారు కూడా కాంగ్రెస్ వారే. కాంగ్రెస్ నుంచి అవకాశం రాకపోవడంతో వారు ఆ టికెట్లపై పోటీ చేసి తదుపరి కాంగ్రెస్‌లో చేరిపోయారు. తెలంగాణలో 107 సీట్లకు గాను కాంగ్రెస్‌కి 48, టీడీపీకి 11, టీఆర్ఎస్ 26, , సీపీఎం ఆరు, , సీపీఐ నాలుగు, బీజేపీ ఒకచోట గెలిచాయి.జనతా రెండు, సమాజ్‌వాది ఒకటి, మజ్లిస్ నాలుగు గెలుచుకోగా స్వతంత్రులు నలుగురు గెలిచారు.

మీకు తెలుసా ?

2009లోనూ మళ్లీ హస్తమే

ఉమ్మడి ఏపీలో చివరిసారిగా 2009లో ఎన్నికలు జరిగాయి. ఈసారి టీడీపీ, టీఆర్ఎస్, వామపక్షాలు మహాకూటమిగా పోటీచేసినా, కాంగ్రెస్ మళ్లీ విజయం సాధించింది. వైఎస్ రెండోసారి సీఎం అయ్యారు. కాంగ్రెస్‌కి 156, టీడీపీకి 92, ప్రజారాజ్యం పార్టీకి 18, టీఆర్ఎస్‌కు పది, ఎంఐఎంకు ఏడు, సీపీఐకు నాలుగు, బీజేపీకి రెండు, సీపీఎంకి ఒకటి, లోక్‌సత్తాకి ఒక సీటు రాగా స్వతంత్రులు ముగ్గురు నెగ్గారు. తెలంగాణలో డీలిమిటేషన్‌తో సీట్లు 107 నుంచి 119కి పెరిగాయి. కాంగ్రెస్‌కు 50 సీట్లు, టీడీపీకి 39, టీఆర్ఎస్‌కు పది, ఎంఐఎంకు ఏడు, సీపీఐకి నాలుగు, బీజేపీకి రెండు, పీఆర్పీకి రెండు, సీపీఎంకి ఒకటి, లోక్‌సత్తాకి ఒకటి రాగా, స్వతంత్రులు ముగ్గురు గెలిచారు.

గాసిప్ టైమ్

పారాచూట్ నేతలతో తిప్పలు తప్పవా?

కమలనాథుల కలవరం

సాక్షి, హైదరాబాద్: లీడర్లలో 'పారాచూట్' నేతలు వేరయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సరిగ్గా ఎన్నికల సమయంలో ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి చేరడం లేక ఎన్ఆర్ఐలు సడన్‌గా వచ్చేసి టికెట్లు పట్టేయడం వంటివి కొన్నేళ్లుగా అన్ని పార్టీల నేతలకూ అనుభవమే. మిగతా పార్టీలతో పోల్చితే ఈ సంప్రదాయం, ఆనవాయితీ బీజేపీలోనే ఒకింత ఎక్కువ అని ఆ పార్టీ నాయకులు వాపోతున్నారు. అభ్యర్థుల జాబితా ఖరారులో జాప్యం, పోటీకి సిద్ధంగా ఉండాలన్న కనీస సంకేతాలు నేటికీ రాకపోవడంతో కమలనాథుల్లో ఆయారాంలపై అనుమానాలు పెరుగుతున్నాయట. ఇందుకు తగ్గట్టుగానే.. ప్రత్యర్థి పార్టీల్లో టికెట్లు రాని నేతలు ఎవరైనా పార్టీలోకి రాకపోతారా అని పార్టీ పెద్దలు ఎదురుచూడడం పార్టీ పరిస్థితికి అద్దం పడుతుందన్న వ్యాఖ్యలు మరోవైపు వినిపిస్తున్నాయి. గత మూడు, నాలుగు ఎన్నికల నుంచి చూసినా చివరి నిమిషంలో ఏదో ఒక పేరు చెప్పి పార్టీలో చేరి బీఫారమ్ తీసుకుని పోవడం, ఎన్నికలు ముగిసిన తర్వాత కొందరు, ఫలితాలు వచ్చాక మరికొందరు మళ్లీ కనిపించకపోవడం వంటివి అనుభవమే అంటున్నారు కమలదళ నేతలు. కనీసం ఈసారైనా పారాచూట్ నేతల బెడద తప్పితే పార్టీకి ఏళ్లుగా కట్టుబడి ఉన్న శ్రేణులకు నైతికస్థైర్యం కల్పించినట్లవుతుందని అంటున్నారు.

పాప్‌కార్న్

గండ్ర వర్సెస్ గండ్ర

భూపాలపల్లి సెగ్మెంట్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి నియోజకవర్గంలో పోటీ చేస్తున్న రెండు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఇద్దరి ఇంటి పేర్లు ఒకే విధంగా ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నది గండ్ర వెంకటరమణారెడ్డి కాగా, కాంగ్రెస్ పార్టీ నుంచి గండ్ర సత్యనారాయణరావు బరిలో నిలిచారు. ఇద్దరి ఇంటి పేర్లు ఒకటే అయినప్పటికీ ఒకరు రెడ్డి, మరొకరు వెలమ సామాజిక వర్గానికి చెందిన వారు. ఇద్దరి ఇంటి పేరు ఒకే విధంగా ఉండటంతో బ్యాలెట్‌లో ఓటర్లు కొంత అయోమయానికి గురయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇద్దరు ప్రత్యర్థులుగా పోటీ చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం.



గండ్ర వెంకటరమణారెడ్డి



గండ్ర సత్యనారాయణరావు



పీపుల్స్ మేనిఫెస్టో

గ్రేటర్ హైదరాబాద్

రాష్ట్రంలోని మొత్తం ఓటర్లు 3,17,32,727 మంది. వీరిలో గ్రేటర్‌ను ఆనుకొని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఓటర్లు 1,04,90,621 మంది. అంటే దాదాపు మూడోవంతు మంది ఇక్కడే ఉన్నారు. వృత్తి, ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారూ ఎందరో ఉన్నారు. నగర ప్రజల మేనిఫెస్టోను అమలు చేయడమంటే రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను అమలు చేసినట్లే.

– సాక్షి, హైదరాబాద్

రవాణా.. అతిపెద్ద సమస్య

నగరంలోని ప్రజలే కాక ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తున్నవారు ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య రవాణా. జిల్లాల నుంచి నగర శివార్లలోకి రెండు గంటలలోపే చేరుకుంటున్నప్పటికీ, అక్కడి నుంచి నగరంలోని గమ్యస్థానాలకు చేరుకునేందుకు రెండున్నర గంటలు పడుతోంది. ఇందుకు పరిష్కారంగా ఇస్నాపూర్ నుంచి షాద్‌నగర్ వరకు, యాదాద్రి నుంచి చౌటుప్పల్ వరకు.. నగరం నలువైపులా ఎటునుంచి ఎటు వెళ్లేందుకైనా మెట్రో రైలు కావాలంటున్నారు. అందరికీ అందుబాటు ధరల్లో ప్రజారవాణా పెరగాలి. ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు నిర్మించినా ట్రాఫిక్ ఇక్కట్లు తీరలేదు. ట్రాఫిక్ జామ్‌లు తప్పేలా లింక్‌రోడ్లు పెరగాలి. అన్ని రద్దీ ప్రాంతాల్లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలుండాలి.

వరద ముంపు తప్పాలి

విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో వానొస్తే నాలాల్లో మరణాలు తప్పడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి నాలాలన్నింటినీ ఆధునీకరించాలి. నాలాల మరణాలు తప్పేలా పటిష్ట చర్యలు చేపట్టాలి. ప్రయాణ దూరాభారం తగ్గించేందుకు మూసీపై 14 వంతెనలు అందుబాటులోకి రావాలి.

అపరిమిత ఇంటర్నెట్..

మొబైల్ లేనిదే చేయి విరిగినట్లుగా భావిస్తున్న రోజుల్లో ప్రతి ప్రాంతంలో అన్ని వేళలా ఉచిత ఇంటర్నెట్ ఉంటే ఎంతో మేలంటున్నారు. ప్రజలకు ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసే సదుపాయం ఉన్నా, ఇంటర్నెట్‌కు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండరాదని, అందులోనూ అంతరాయాలు ఉండొద్దని బలంగా కోరుకుంటున్నారు. గమ్యస్థానాలకు చేరుకునేందుకు, ఆయా ప్రాంతాల్లో రద్దీ తెలుసుకునేందుకు సింగిల్‌యాప్ లాంటిది కావాలని కోరుకుంటున్నవారెందరో ఉన్నారు.

ఉద్యోగాలు.. సొంతిళ్లు.. ఆరోగ్య బీమా

పేదలందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లతోపాటు సొంతిళ్లు లేనివారికి నెలనెలా ఈఎంఐలతో గృహ సదుపాయం కల్పించాలని నగర ప్రజలు కోరుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ లేదా కనీసం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని అలవెన్సులు, సకాలంలో ఉద్యోగాల భర్తీ, పేదలకు ఉచిత వైద్యంతోపాటు అవసరమైన పక్షంలో శస్త్రచికిత్సలకు ఉపకరించేలా ప్రభుత్వమే ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలంటున్నారు.

24 గంటలు స్వచ్ఛమైన నీరు

కరెంటు కష్టాలు తీరినప్పటికీ నగరంలో నీటి ఇబ్బందులున్నాయి. నిర్ణీత వేళల్లో కాకుండా 24 గంటలు ఎప్పుడు నల్లా తిప్పినా తాగునీరొచ్చే సదుపాయం ఉండాలంటున్నారు ప్రజలు.

Interview

..భూమార్గం పట్టేద్దాం!

భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్



మేకల కళ్యాణ్ చక్రవర్తి

'తెలంగాణలో భూమి అనేది చాలా ప్రధానమైన అంశం. ప్రపంచంలోని ఎక్కడా లేని భూపోరాటాలు ఇక్కడే జరిగినా 75 ఏళ్ల తర్వాత కూడా భూసమస్యలు అసంపూర్తి పనిగానే మిగిలిపోయాయి. అసంపూర్ణమైన భూసంస్కరణలే ఇందుకు కారణం. ప్రభుత్వాలు చేసే పనుల కారణంగా పేదల భూములకు భద్రత కల్పించడం మాట అటుంచితే పేదల భూములు లాక్కుంటున్నారని, ఉన్న కాసిన్ని భూములు పేదల చేతుల నుంచి పోతున్నాయని ఐక్యరాజ్యసమితి చెప్పింది. ఇదీ అసలు సమస్య. ప్రజలకున్న అసలు సమస్యలే కదా ఎన్నికల ఎజెండా కావాలి. ప్రజల ప్రతి సమస్యా ఎజెండా అయితే ఆ సమస్యలు తీరుస్తామని రాజకీయ పార్టీలు చెప్పాలి..' అని భూచట్టాల నిపుణులు, నల్సార్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎం.సునీల్‌కుమార్ అన్నారు. తెలంగాణలో ధరణి ఒక్కటే భూ సమస్య కాదని పేర్కొన్నారు. ప్రజలు కోరుకుంటున్న భూవిధానాలను తీసుకురావడం ఎన్నికల ఎజెండా అయినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయంటున్నారు.

భూ సంబంధిత సమస్యలు ఎన్నికల ఎజెండా కావాలి

భూచట్టాల నిపుణుడు ఎం.సునీల్‌కుమార్

75-80 ఏళ్ల నాటి పరిస్థితే ఇప్పటికీ..

భూమిని ప్రజల కోణంలో చూడాలి. భూమి లేని వారికి భూమి ఇవ్వడం, భూమి ఉన్న వారి హక్కులకు భద్రత ఉన్నప్పుడే ఆస్తి సంపదగా మారుతుంది. అయితే ఈ రెండింటి విషయంలో 75-80 ఏళ్ల నాటి పరిస్థితే ఇప్పటికీ ఉంది. భూమి లేని గ్రామీణ కుటుంబాలు తెలంగాణలో 56 శాతం ఉన్నాయని లెక్కలు చెపుతున్నాయి. భూములున్న కుటుంబాల విషయంలో ఊరికో 200 సమస్యలున్నాయి. ఈ సమస్యలు ఎన్నికల ఎజెండా కావాలి. దురదృష్టవశాత్తూ అలా జరగడం లేదు. గత మూడు ఎన్నికలను పరిశీలిస్తే.. 2014 ఎన్నికల్లో పార్టీల మేనిఫెస్టోల్లో భూమి ప్రస్తావన ఉంది. 2018లో కొందరే ప్రస్తావించారు. కానీ ఈసారి భూమి అంశం చర్చకే రావడం లేదు. ధరణిని రద్దు చేస్తామని ఒకరు అంటుంటే, అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తామని బీఆర్ఎస్ అంటోంది. తెలంగాణలో భూసమస్య అంటే ధరణి ఒక్కటేనా? కీలకమైన భూసర్వే ఏ పార్టీ మేనిఫెస్టోలో అయినా ఉందా? అంటే మెల్లగా భూమి అనేది ఎన్నికల ఎజెండా కాకుండా మాయమైపోతోందన్న మాట.

సమస్యలు కొనసాగితేనే పార్టీలకు ఉపయోగం

రాజకీయ పార్టీలు ఎన్నికల్లో భూమిని ఎజెండాగా చేయాలనుకోవడం లేదనే చెప్పాలి. ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కానీ, ఉద్దేశపూర్వకంగా కానీ, లేదంటే పరిష్కరించలేక పోవడం వల్ల కానీ భూమి అంశాన్ని పార్టీలు చేపట్టలేకపోతున్నాయి. భూమి సమస్యను యథాతథంగా కొనసాగించాలన్న ఆలోచన కూడా రాజకీయ పార్టీలకు ఉండొచ్చు. భూములకు సంబంధించిన సమస్యలు ఉంటేనే కదా రాజకీయ పార్టీలకు ఉపయోగం.

ప్రతి గుంట భూమిని సర్వే చేయాలి

తెలంగాణలో భూముల సమగ్ర సర్వే చేయాలి. ఇందుకు రూ.700–800 కోట్ల వరకు ఖర్చవుతుంది. తెలంగాణలో ప్రతి గుంట భూమిని సమగ్రంగా సర్వే చేసి కొత్త రికార్డులను తయారు చేస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. కానీ సర్వే చేస్తామని ఎవరైనా చెప్తున్నారా? భూ చట్టాల్లో సమగ్ర మార్పు రావాలి. ఆర్ఓఆర్, పీఓటీ, కౌలు చట్టాలు మార్చాలి. ఏ పార్టీ అయినా భూ చట్టాల్లో మార్పు తెస్తామని ప్రకటిస్తోందా? రెవెన్యూ కోడ్ తెస్తామని చెప్తోందా? భూమి హక్కులకు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చే టైటిల్ గ్యారంటీ చట్టం తెస్తామని ఏ పార్టీ అయినా చెపుతోందా? భూమి లేని పేదలకు భూములిస్తామని ఎవరైనా అన్నారా? తెలంగాణలో 10 లక్షల మందికి పైగా ఉన్న కౌలు రైతులను గుర్తిస్తామని ఎవరైనా చెపుతున్నారా? సమగ్ర చట్టం లేకుండా కౌలుదారులను ఎలా గుర్తిస్తారు? ఎలా డబ్బులిస్తారు? భూపరిపాలన మెరుగుపరుస్తామని ఎవరైనా అంటున్నారా? ఇవి ప్రజలు చేసే డిమాండ్లే.

కంప్యూటర్ రికార్డు తప్పనిసరి


పేరేదైనా సరే.. భూమికి కంప్యూటర్ రికార్డు ఉండి తీరాలి. తెలంగాణలో భూమి కంప్యూటర్ రికార్డులు బ్రహ్మాండంగా ఉన్నాయమని అధికారపక్షం చెపుతోంది. ప్రతిపక్షమేమో చెండాలంగా ఉందని అంటోంది. వీళ్లు రద్దు చేస్తామంటారు. వాళ్లు యథాతథంగా కొనసాగిస్తామంటున్నారు. ఇద్దరూ చెబుతున్నదీ తప్పే. రద్దు సమస్యకు పరిష్కారం కాదు. అసలు కంప్యూటర్ రికార్డు అయితే ఉండాలి కదా? ఏదో ఒక రికార్డుండాలి. కొత్త రికార్డు ఎలా తెస్తారు? అనేది చెప్పాలి కదా? ఏం చేస్తారనే పరిష్కారం చెప్పకుండా రద్దు సమంజసం కాదు. అంతా బాగుందని చెప్పడం సరైంది కాదు. అంటే ఈ రెండు పక్షాలు ప్రజలేం కోరుకునేదానివైపు వెళ్లడం లేదన్నది అర్థమవుతోంది.

కంప్యూటరీకరణ అవసరమా?

భూమికి కాగితాలిచ్చే ప్రక్రియ ప్రపంచమంతా జరుగుతోంది. ఎందుకంటే భూమి ఉన్నా.. ఆ భూమికి సరైన కాగితాలున్న వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా 30 శాతమేనట. అంటే రికార్డులు లేని వారే ఎక్కువ ఉన్నారు. ఈ రికార్డులను కల్పించడంలో భాగంగా జరిగే ప్రక్రియనే ఫార్మలైజేషన్ ఆఫ్ ల్యాండ్ రైట్స్ అంటారు. అంటే భూములకు రికార్డులు రూపొందించాలి. వాటిని కంప్యూటరీకరించాలి. అమ్మకాలు, కొనుగోళ్లు సులభంగా జరగాలి. వీటి వల్ల భూమి హక్కులకు భద్రత ఏర్పడుతుంది. పేదలకు కూడా భూములు కొనుగోలు చేయగలిగిన ధైర్యం వస్తుంది.

భూవినియోగ విధానం ఉండాలి

భూమి విధానం, భూమి వినియోగ విధానాలు ప్రతి రాష్ట్రానికి ఉండాలి. ఎన్నికల సమయంలోనే ఇవి చర్చకు రావాలి. ఉచితాలు అనేవి తాత్కాలిక లబ్ధి చేకూర్చేవి. అందువల్ల రాజకీయ పార్టీల హామీలు భూమి చుట్టూ తిరగాలి. స్థిరాస్తి కల్పనపై అవి దృష్టి సారించాలి. గుంట భూమి ఉంటే ఎన్ని సమస్యలో.. అది కూడా లేని వారి పరిస్థితేంటో అందరికీ తెలిసిందే. భూములివ్వడం, ఉన్న భూములను కాపాడడం చుట్టూ ఎన్నికల ఎజెండా తిరిగితేనే మెరుగైన ఫలితాలు వస్తాయి.



డిస్ట్రిక్ట్ స్కాన్

నువ్వా నేనా...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్.. కాంగ్రెస్ మధ్యే పోటీ ● మునుగోడులో మినహా బీజేపీ నామమాత్రపు పోరే

చింతకింది గణేశ్

దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ఉద్ధండుల పురిటిగడ్డ నల్లగొండ. అణువణువునా చైతన్యం.. అన్యాయంపై పిడికిలెత్తిన పోరాటం ఈ జిల్లా సొంతం. ఆ పోరాట పటిమ స్ఫూర్తిగానే వామపక్ష రాజకీయాలకు పెట్టని కోటగా నిలిచింది నల్లగొండ. 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఎర్రజెండాకు పట్టం కట్టిన జిల్లా ప్రజలు తరువాతి కాలంలో టీడీపీ, వామపక్ష కూటమికి, ఆ తర్వాత కాంగ్రెస్‌కు అధిక స్థానాలను ఇచ్చి అండగా నిలవగా, తెలంగాణ రాష్ట్రంలో అధిక స్థానాలను కట్టబెట్టి టీఆర్‌ఎస్‌ను ఆదరించారు. ఇలా కాలానుగుణంగా ఎప్పటికప్పుడు విలక్షణ తీర్పు ఇస్తున్నారు.

స్వరాష్ట్రంలో క్రమంగా బీఆర్‌ఎస్ పరం

తెలంగాణ ఉద్యమ సమయం నుంచి జిల్లా ఓటర్లలో భిన్నమైన మార్పు వచ్చింది. తెలంగాణ తెచ్చిన పార్టీగా టీఆర్‌ఎస్‌ను, ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్‌ను 2014 ఎన్నికల్లో రెండింటినీ ఆదరించిన జిల్లా ఓటర్లు ఆ తర్వాత అభివృద్ధి వైపు మళ్లారు. 2014 ఎన్నికల్లో జిల్లాలోని 12 స్థానాల్లో కాంగ్రెస్‌ను ఐదు స్థానాల్లో, టీఆర్‌ఎస్‌ను ఆరు స్థానాల్లో, సీపీఐని ఒక స్థానంలో గెలిపించారు. 2018 ఎన్నికల్లో జిల్లాలోని 12 స్థానాలకు గాను 9 స్థానాల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించారు. నకిరేకల్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన లింగయ్య టీఆర్‌ఎస్‌లో చేరారు. అదే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాజీనామా చేసి ఎంపీగా వెళ్లారు. దీంతో అక్కడ వచ్చిన ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి గెలుపొందారు. మునుగోడులోనూ రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో అక్కడ జరిగిన ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ నుంచి ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. ఇలా 12 స్థానాలు గులాబీ ఖాతాలోకి వెళ్లాయి.

ప్రాతినిధ్యం కోసం కమ్యూనిస్టులు : కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న జిల్లాలో ఇప్పుడు ఆ పార్టీలు ప్రాతినిధ్యం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2004 ఎన్నికల్లో చెరో రెండు స్థానాలను గెలుచుకున్న సీపీఐ, సీపీఎం పార్టీలు క్రమంగా చతికిలపడ్డాయి. 2009కి వచ్చేసరికి కేవలం రెండింటికే పరిమితం అయ్యాయి. 2014లో దేవరకొండలో సీపీఐ గెలుపొందినా 2018 వచ్చేసరికి దానినీ కోల్పోయారు.

బీజేపీ.. జిల్లాలోని మునుగోడు నియోజకవర్గంపైనే ఎక్కువ ఆశలు పెట్టుకుంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ ఎన్నికల్లో గెలుస్తారన్న ధీమాతో ఉంది

జిల్లాలోని 12 స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ అన్నింటిని దక్కించుకొని పట్టు నిలుపుకోవాలని శతవిధాలుగా ప్రయత్నం చేస్తోంది. కానీ పార్టీకి అసంతృప్తుల రూపంలో తంటాలు తప్పేలా లేవు. నల్లగొండ, కోదాడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో సొంత పార్టీ నుంచే తంటాలు మొదలయ్యాయి. కోదాడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అసంతృప్తులు, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థులను వ్యతిరేకిస్తున్న వారు ఇంకా తమ వర్గాలతో ప్రత్యేక భేటీలు కొనసాగిస్తూనే ఉన్నారు. జిల్లా కేంద్రాలైన నల్లగొండ, సూర్యాపేట నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నుంచి బయటకు వెళ్లిన అసంతృప్తులు పోటీలో నిలిచే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అసంతృప్తులను చల్లార్చి, తమ పట్టు నిలుపుకోవడం బీఆర్‌ఎస్‌కు కత్తిమీద సామువంటిదే.

ఈ దఫా బీఆర్‌ఎస్ పట్టు నిలిచేనా?

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈసారి ప్రధాన పోటీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉండనుంది.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వచ్చేనా..

పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ పార్టీ తహతహలాడుతోంది. 1999 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ కూటమి విజయం సాధించి రాష్ట్రంలో అధికారం చేపడితే, జిల్లాలో ఆ మాత్రం కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. ఆ తర్వాత 2004, 2009లో కూడా సగం కంటే ఎక్కువ స్థానాలతో జిల్లాలో తమ పట్టును నిలుపుకున్న కాంగ్రెస్ 2014 వచ్చే సరికి డీలా పడి 5 స్థానాలకే పరిమితమైంది. 2018లో మూడు స్థానాలను గెలుచుకున్నా ఒక చోట ఎమ్మెల్యే పార్టీ మార్పుతో, రెండు చోట్ల ఉప ఎన్నికల్లో పూర్తిగా ప్రాతినిధ్యం కోల్పోయింది. 1999 నాటి పూర్వ వైభవాన్ని ఈ ఎన్నికల్లో సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డే ప్రయత్నం చేస్తోంది.


ప్రచారం
నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్, కేసీఆర్ ఫొటోలు, వివిధ పథకాలతో కూడిన డిజిటల్ స్క్రీన్ల ద్వారా ఓట్ ఫర్ కార్ అంటూ వినూత్న ప్రచారానికి తెరలేపారు.


పరిశీలన
మద్యం, డబ్బు, ఇతరత్రా పంపిణీ, అభ్యర్థుల ప్రచార వ్యయంపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్ ప్రచార రథాలను అధికారులు ఫొటో, వీడియో రికార్డు చేశారు.

ఎన్నికలూ... పంచ్ డైలాగులు!

మా రాంబాబుగాడు సినిమాలు తెగ చూస్తుంటాడు. చూడ్డమేకాదు..ప్రతిదీ సినిమాటిక్‌గానే ఆలోచిస్తుంటాడు. ఈమధ్య పార్టీల నేతలూ, రాజకీయ నాయకుల ప్రసంగాలూ, సవాళ్లూ, వాగ్దానాలు..ఇవన్నీ కూడా వాడికి మూవీ డైలాగుల్లాగానే వినిపిస్తున్నాయట. అదెలాగంటే...

....

కారు పార్టీ అధినేత ఎప్పుడూ యాంగ్రీ యంగ్‌మ్యానే కదా. యమ డ్యాషింగ్‌గా మాట్లాడతాడు. గతంలో తెలంగాణ సెంటిమెంటు పండించిన నేత. ఎప్పుడూ పంచ్ డైలాగులు చెప్పే ఆయన అకస్మాత్తుగా సెంటిమెంటు పండిస్తే.. ఆ డైలాగు ఇలా ఉంటదంట.

"అరె ఎవడ్రా అక్కడా... అరెయ్ తెలంగాణ ఓటర్ర్ర్..అరెయ్ మనం గెలవకపోతే.. ఏమన్నా జరగకూడనిది జరిగి మనం ఓడిపోతే ద మోస్ట్ ఎఫెక్టెడ్ ఎంటిటీ ఒకటుంటది. అది ఈ స్టేటు. నా తెలంగాణ స్టేటు. ఇది నా స్టేటు. ఇది నా స్టేటు"

ఆ సెంటిమెంటు కాస్తా కొడుకునూ కదిలించింది. తన తండ్రి ఇంతగా ఇదమిద్ధమైపోవడంతో కొడుకులోనూ సెంటిమెంటూ, యాంగ్రీనెస్సూ ఏకకాలంలో పెల్లుబికాయి.

"అలా ఎప్పటికీ జరగదు నాన్నా. మనమే గెలుస్తాం నాన్నా. తప్పక గెలుస్తాం" అంటూ నాన్న వైపు తిరిగి చెప్పి క్రోధంగా ఇటువైపు మళ్లి.. "అరెయ్... వెళ్లి ఆ ప్రత్యర్థి పార్టీలకు చెప్పండి. ఇప్పుడు కొడుకొచ్చాడు. ఇన్నాళ్లూ ఓ లెక్క... ఇప్పట్నుంచీ ఓ లెక్క"

....

కాంగ్రెస్ పార్టీ వాళ్లు తమ మేనిఫెస్టో ప్రకటించారు. ఐదొందలకు సిలెండరు అన్నారు. పెన్షన్ నాలుగు వేలన్నారు. ఇంతలో బీఆర్‌ఎస్..గ్యాసుకు నాలుగొందలూ, పెన్షన్ ఐదు వేలన్నారంటూ ప్రకటించగా కాంగ్రెస్ వారు గగ్గోలు పెట్టారు. "అవన్నీ మా వాగ్దానాలు. గ్యాసులో కాస్త తగ్గించి, పెన్షన్‌లో కాస్త పెంచారంటూ ఆక్రోశించారు. అది చూసి ఓటర్లు కాస్తా... కొద్దిగా పుష్ప మూవీ స్టైల్లో కూల్‌గా...

"అరెరే... వాళ్ల మేనిఫెస్టో ఓ వారం-పది రోజులు లేటయ్యిందేమోలే మంగళం" అంటూ ఊరడించారు ఓటర్లు.

కాసేపటికి ఉక్రోశం తగ్గింది. అప్పుడో రంకె పెట్టి... "ఇన్నాళ్లూ పవరుకేద్దాం, ఓటు కేద్దాం. ఇకపై కుదరదు. వాళ్లు పోతే వీళ్లూ, వీళ్లు పోతే వాళ్లూ, కారు పోతే పువ్వూ అంటూ ఎవరైనా వచ్చారో!!.... ఈసారి ఖాయంగా గెలిచేస్తాం" అంటూ పొలికేక పెట్టారు కాంగ్రెస్‌వాళ్లు.

....

"మీరంతా గెలవాలంటే వ్యూహాలు పన్నాలీ, ఎత్తుగడలు వేయాలి. మేనిఫెస్టోలివ్వాలీ, వాగ్దానాలు చెయ్యాలి. మేము ఇవన్నీ చేయక్కర్లేదురా... అలా గుడికెళ్లొస్తే చాలు" అంటున్నారు పువ్వు పార్టీవారు.

....

కలలూ, అందులోని పంచులూ... వీటిని తట్టుకోలేక తన ఫ్రెండు దగ్గర గోడు వెళ్లబోసుకున్నాడు రాంబాబుగాడు.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

"నువ్వు చెబుతున్నావుగానీ ఒరేయ్.. వాళ్లు ఇలాంటి డైలాగులు చెబుతారంటావా?" డౌటు పడ్డాడు ఫ్రెండు.

"ఎందుకు చెప్పరూ? మొన్నటికి మొన్న కేసీఆర్‌గారు నిండు ప్రచారసభలో హరీశ్‌రావును పట్టుకుని 'ఇది ఆరడుగుల బుల్లెట్టూ. మీకప్పగిస్తున్నా' అనలేదా? అదేంటోరా..ఇలా చట్టుక్కున నిద్రపట్టిందా..అలా పుటుక్కున కల్లోకి వచ్చేస్తున్నాయా 'స్వాపు' డైలాగులు ! ఏం చేయమంటావ్ రా... నన్ను?" అడిగాడు.

"ఓ పని చెయ్... ఈ నెల్రోజులూ ఆ సినిమాలు చూడడమన్నా వదిలెయ్. లేదా... వీళ్ల డైలాగు వినడమన్నా మానెయ్"

"మనం మందన్నా మానేస్తామేమోగానీ..మూవీలూ, పాలిటిక్సూ మానేస్తామా..రా? అందునా ఈ టైములో" బుగులుపడ్డాడు రాంబాబుగాడు.


పంచతంత్రం

రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో గెలుపు కాంగ్రెస్‌దే


- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా
- రెండు రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపికపై సీఈసీ భేటీ

న్యూఢిల్లీ: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ మళ్లీ విజయం సాధిస్తుందని, మధ్యప్రదేశ్‌లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాల్లోపార్టీ అభ్యర్థుల ఎంపికపై చర్చించడానికి ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) బుధవారం ఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో సీనియర్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కమల్‌నాథ్, రణదీప్ సూర్జేవాలా, రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్, గౌరవ్ గొగోయ్ తదితరులు పాల్గొన్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై వేర్వేరుగా చర్చించారు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థుల బలాబలాలు, గెలుపు అవకాశాలపై సంప్రదింపులు జరిపారు. అభిప్రాయాలు పంచుకున్నారు. సర్వేల నివేదికలను సైతం పరిశీలించినట్లు సమాచారం. సీఈసీ సమావేశం అనంతరం ఖర్గే 'ఎక్స్'లో పోస్టు చేశారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం గత ఐదేళ్లుగా సుపరిపాలన అందిస్తోందని, ప్రజలు మళ్లీ తమ పార్టీకే పట్టం కడతారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు కాంగ్రెస్‌ను మళ్లీ ఆశీర్వదిస్తారన్న విశ్వాసం ఉందన్నారు. మధ్యప్రదేశ్‌లో ప్రతి ఐదేళ్లకోసారి అధికారం చేతులు మారడం ఆనవాయితీగా వస్తోంది. దానిప్రకారం ఈ ఎన్నికల్లో తమ పార్టీని విజయం వరిస్తుందని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. రాజస్తాన్‌లో నవంబర్ 17, రాజస్తాన్‌లో నవంబర్ 25న అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.


కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో రాహుల్ గాంధీ, ఖర్గే

ఛత్తీస్‌గఢ్‌లో హోరాహోరీ పోరు

మళ్లీ గెలుపుపై అధికార కాంగ్రెస్ పార్టీ ధీమా | **ప్రజలు తమనే ఆదరిస్తారంటున్న బీజేపీ నేతలు** | **కింగ్‌మేకర్‌గా మారాలని చిన్న పార్టీల వ్యూహాలు**



ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ హోరాహోరీగా పోరాడుతున్నాయి. మళ్లీ నెగ్గాలన్న కృతనిశ్చయంతో ఉన్న కాంగ్రెస్ వ్యూహాలకు పదును పెడుతోంది. గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఉన్న జనాదరణే తమ పార్టీని మళ్లీ గెలిపిస్తుందని కాంగ్రెస్ నేతలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. కంచుకోట ఛత్తీస్‌గఢ్ తమ చేజారిపోయే ప్రసక్తే లేదని అంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పీఠం దక్కించుకోవాలన్న పట్టుదలతో బీజేపీ నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. భూపేశ్ బఘేల్ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, వారంతా తమనే ఆదరిస్తారని బీజేపీ నేతలు చెబుతున్నారు. ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీతో సహా ఇతర చిన్నాచితక పార్టీలు సైతం అదృష్టం పరీక్షించుకుంటున్నాయి. రాష్ట్రంలో 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. కొన్ని సీట్లయినా గెలుచుకొని కింగ్‌మేకర్ కావాలని చిన్న పార్టీలు ఆరాటపడుతున్నాయి.

కాంగ్రెస్ అవినీతే బీజేపీ అస్త్రం

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్‌కు 15 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 2018లో అధికారం లభించింది. విపక్ష బీజేపీ మొదట్లో బలహీనంగా ఉన్నట్లు కనిపించినా ఎన్నికలు సమీపించేకొద్దీ బలం పుంజుకుంటోంది. అధికార కాంగ్రెస్‌కు సవాలు విసురుతోంది. ప్రభుత్వ పథకాల అమల్లో అవినీతి, కుంభకోణాలు, బుజ్జగింపు రాజకీయాలు, మత మార్పిడులను ప్రధానంగా తెరపైకి తీసుకొస్తూ బఘేల్ ప్రభుత్వాన్ని ఇరుకునపెడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధిస్తుందని ఏడాది క్రితం వరకూ బల్లగుద్ది మరీ చెప్పిన విశ్లేషకులు ఇప్పుడు ఆ సాహసం చేయలేకపోతున్నారు. బీజేపీకి విజయావకాశాలు మెరుగయ్యాయని పరోక్షంగా అంగీకరిస్తున్నారు. బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచార వ్యూహం మార్చారు. కాంగ్రెస్ అవినీతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నారు. మరోవైపు కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎన్నో విజయాలు సాధించిందంటూ ప్రజలకు తెలియజేస్తున్నారు. మోదీకి లభిస్తున్న జనాదరణ ఎన్నికల్లో ఓట్లుగా మారి తమకు లబ్ధి చేకూరుస్తుందని బీజేపీ నాయకులు విశ్వసిస్తున్నారు.

మోదీ, షా మంత్రాంగం

ఛత్తీస్‌గఢ్‌పై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. మోదీ గత మూడు నెలల్లో నాలుగు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. అమిత్ షా తరచుగా ఛత్తీస్‌గఢ్‌లో పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న అవినీతిని ఎండగడుతున్నారు. తాము అధికారంలోకి రాగానే బఘేల్ ప్రభుత్వ అవినీతిపై విచారణ జరిపిస్తామని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. రాష్ట్ర బీజేపీ నేతల మధ్య విభేదాలను పరిష్కరించి, గెలుపు దిశగా నడిపించడానికి మోదీ, షా ప్రాధాన్యం ఇస్తున్నారు.

జనాభాలో 32 శాతం గిరిజనులే

రాష్ట్రంలో ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుంది. గత ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఈ ఎన్నికల్లో కొన్ని సీట్లు గెలిచి, అసెంబ్లీలో అడుగు పెడతామని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. అసెంబ్లీలో తమ ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉంటుందని చెబుతున్నారు. ఎన్నికల్లో సర్వ ఆదివాసీ పార్టీ, గోండ్వానా గణతంత్ర పార్టీ కూడా పోటీ పడుతున్నాయి. రాష్ట్ర జనాభాలో 32 శాత మంది గిరిజనులు ఉన్నారు. వారి ఓట్లపై అన్ని పార్టీలు ఆశలు పెట్టుకున్నాయి. రాష్ట్రంలో మొత్తం 90 అసెంబ్లీ సీట్లకు గాను 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకంగా 68 సీట్లు గెలుచుకొని జయకేతనం ఎగురవేసింది. బీజేపీకి కేవలం 15 సీట్లు లభించాయి. మాజీ సీఎం అజిత్ జోగి స్థాపించిన జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్(జే)కు ఐదు సీట్లు దక్కాయి. బీఎస్పీ రెండు స్థానాలు గెలుచుకుంది. ఈసారి ఎన్నికల్లో 75 సీట్లను తన ఖాతాలో వేసుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఫేస్ లేకుండా పోటీ

- ఎన్నికల రాష్ట్రాల్లో బీజేపీ కొత్త ప్రయోగం
- ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే బరిలోకి
- నేతల సిగపట్లు, అంతర్గత పోరు భయంతోనే
- ప్రతికూలంగా మారవచ్చంటున్న పరిశీలకులు

ఎంత ప్రయత్నించినా దక్షిణాదిన అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటకను కాంగ్రెస్‌కు చేజార్చుకోవడం బీజేపీకి గట్టి షాకే ఇచ్చింది. మరికొద్ది నెలల్లో కీలకమైన లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్, రాజస్తాన్‌తో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. కాకపోతే అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం భయం. మరో పెద్ద రాష్ట్రమైన రాజస్తాన్‌లో వసుంధర రాజె తదితర ముఖ్య నేతల మధ్య కీచులాటలు. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ ఇంటి పోరు. వీటన్నింటినీ ఎదుర్కొంటూ కాంగ్రెస్‌ను సమర్థంగా ఢీకొట్టేందుకు అన్ని మార్గాలనూ కమలదళం అన్వేషిస్తోంది. అందులో భాగంగా ఏ రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరినీ ముందస్తుగా ప్రకటించకుండా జాగ్రత్త పడుతోంది. తద్వారా ముఖ్య నేతల పరస్పర కుమ్ములాటలను అదుపు చేయడంతో పాటు కీలక సమయంలో వారెవరూ సహాయ నిరాకరణ చేయకుండా చూడవచ్చని భావిస్తోంది.



రాజస్థాన్‌లోనూ రచ్చే

రాజస్తాన్‌లో మాజీ సీఎం వసుంధరా రాజె సింధియాకు, సీనియర్ నేతలు అర్జున్‌రామ్ మేఘ్వాల్ తదితరులకు ఉప్పూనిప్పుగా ఉంటోంది. సింధియా వర్గపు నేత కైలాశ్ మేఘ్వాల్ తాజాగా అర్జున్‌రామ్‌పై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. దాంతో అధిష్టానం ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ పాలిత రాజస్తాన్‌లో ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్‌పై వ్యతిరేకత పరాకాష్టకు చేరిందన్నది బీజేపీ అధిష్టానం అంచనా వేస్తోంది. అవినీతి, అసమర్థత తదితర కారణాలతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, ఈ పరిస్థితిని పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తోంది. తమ నేతల మధ్య పోరు ఇందుకు అడ్డంకిగా మారకూడదని పట్టుదలగా ఉంది. అందుకే ఢిల్లీ పెద్దలు నిత్యం రాష్ట్ర నేతలతో సంప్రదింపులు జరుపుతూ వారు కట్టుదాటకుండా చూసే ప్రయత్నాల్లో పడ్డారు.

మధ్యప్రదేశ్‌లో ఎన్ని క్యాంప్‌లో !

మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు వి.డి.శర్మ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సీనియర్ నేత కైలాశ్ విజయవర్గీయ... ఇలా సీనియర్లంతా తలో వర్గంగా విడిపోయి కుమ్ములాటల్లో యమా బిజీగా ఉన్నారు. దాంతో కేవలం ప్రధాని నరేంద్ర మోదీ ఛరిష్మానే ప్రధానంగా నమ్ముకుని సాగాల్సిన పరిస్థితి! ఈ పరిస్థితుల్లో చౌహాన్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం నేతల విభేదాలను చేజేతులా పెంచడమే అవుతుందని అధిష్టానం నిర్ణయానికి వచ్చింది. పైగా ప్రభుత్వ వ్యతిరేకత దృష్ట్యా చూసుకున్నా అది చేటు చేసేదేనని అభిప్రాయపడుతోంది. అందుకే ముఖ్యమంత్రి అభ్యర్థి మాటెత్తకుండానే ప్రచార పర్వాన్ని ముగించే పనిలో పడింది. ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటికీ బీజేపీకి అతి పెద్ద నేతగా మాజీ సీఎం రమణ్‌సింగ్ ఉన్నా ఆయనపైనా పార్టీలో వ్యతిరేకత నానాటికీ పెరుగుతోంది. మాజీ మంత్రి బ్రిజ్‌మోహన్ అగర్వాల్, ఎమ్మెల్యే అజయ్ చంద్రాకర్, సీనియర్ నేత నంద్‌కుమార్ సాయ్ లాంటివాళ్లు ఆయన నాయకత్వం పట్ల అసంతృప్తి సెగలు కక్కుతున్నారు. అసలే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశాలున్నాయన్న అంచనాల మధ్య ఈ తలనొప్పులు బీజేపీ అధిష్టానాన్ని మరింత చికాకు పెడుతున్నాయి. అందుకే ఈసారి ముఖ్యమంత్రి అభ్యర్థి అంటూ ఎవరినీ ముందస్తుగా ప్రకటించబోమని బీజేపీ ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి దగ్గుబాటి పురందేశ్వరి ఇటీవల రాష్ట్ర పర్యటనలో ప్రకటించారు. ఇలా సీఎం అభ్యర్థిని ప్రకటించకపోవడం వల్ల వర్గ పోరును అదుపు చేయడం వంటి ప్రయోజనాలు దక్కే మాటెలా ఉన్నా నష్టాలు జరిగే ఆస్కారమూ ఉందన్న భావన వ్యక్తమవుతోంది. బాధ్యతనంతా భుజాలపై వేసుకుని రాష్ట్ర పార్టీ యంత్రాంగం మొత్తాన్నీ ఒక్కతాటిపై నడిపే నాయకుడంటూ లేకపోతే మొదటికే మోసం వచ్చే ప్రమాదముందన్న అభిప్రాయం బీజేపీలోనే కొందరు నేతల్లో వ్యక్తమవుతోంది. కర్ణాటకలో యడ్యూరప్పను పక్కన పెట్టి అంతా అధిష్టానమే అన్నట్టుగా వ్యవహరించి భంగపడ్డ వైనాన్ని వారు గుర్తు చేస్తున్నారు

- సాక్షి, నేషనల్ డెస్క్

బట్టలు చింపే నేతలకు అధికారం దక్కదు

కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి

గ్వాలియర్: ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్లు రాకపోతే బట్టలు చించేయాలని చెప్పే నాయకులకు మధ్యప్రదేశ్ ప్రజలు అధికారం అప్పగించబోరని కేంద్ర మంత్రి, బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియా తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం దక్కడం కలలో మాట అని అన్నారు. దిగ్విజయ్ సింగ్ బట్టలు చించేయాలంటూ మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై సింధియా బుధవారం స్పందించారు. కాంగ్రెస్ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ మేనిఫెస్టో చాంతాడంత పొడవు ఉందని, అందులో ఒక్క హామీ కూడా నెరవేరదని అన్నారు. కాంగ్రెస్ నేతలకు బట్టలు చింపడం మాత్రమే తెలుసని ఎద్దేవా చేశారు. అనుచితంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులకు అధికారం అప్పగిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని ప్రజలను సింధియా అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమలో తాము తన్నుకోవడం తప్ప ప్రజలకు చేసేదేమీ ఉండదని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల

రాయ్‌పూర్: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఛత్తీస్‌గఢ్‌లో బరిలో దిగనున్న తమ అభ్యర్థుల రెండో జాబితాను కాంగ్రెస్ పార్టీ విడుదలచేసింది. ఆదివారం 30 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లు ప్రకటించగా బుధవారం 53 స్థానాలకు అభ్యర్థుల పేర్లను విడుదలచేసింది. భత్‌గావ్ నుంచి పరాస్‌నాథ్ రాజ్‌వాడే, కట్‌ఘోరా నుంచి పురుషోత్తం కన్వర్, బెల్తారా నుంచి విజయ్ కేసర్‌వాణి, అకల్‌తారా నియోజకవర్గం నుంచి రాఘవేంద్ర సింగ్, బిల్హా నుంచి సియారామ్ కౌశిక్ బరిలో నిలుస్తున్నారు. 14 ఎస్టీ , ఆరు ఎస్సీ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. ఆదివారం విడుదలైన అభ్యర్థుల జాబితా ప్రకారం ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ భఘేల్.. పటాన్ నియోజకవర్గం నుంచి పోటీచేయనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నవంబర్ 7న తొలి దఫా, నవంబర్ 17న రెండో దఫాలో పోలింగ్ ఉంటుంది.

సాక్షి
హైదరాబాద్

గురువారం, 19, అక్టోబర్, 2023



కాంగ్రెస్‌లోకి నిహారిక గౌడ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేటర్ నిహారికగౌడ్ బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మేడ్చల్‌లో మల్లారెడ్డికి బుద్ధి చెబుతామన్నారు.



బీఆర్‌ఎస్‌లోకి రాగిడి

మేడ్చల్: ఉప్పల్ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో రాగిడి లక్ష్మారెడ్డి సీఎం కేసీఆర్ సమక్షంలో మేడ్చల్ సభలో తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు.

డ్రోన్ల వినియోగం శుభపరిణామం



వ్యవసాయ పనులలో డ్రోన్ల వినియోగం శుభ పరిణామమని, కూలీల కొరత వల్ల అధునాతన సాంకేతికత, యాంత్రీకరణ వైపు వెళ్లక తప్పదని నాబార్డ్ తెలంగాణ రీజియన్ సీజీఎం సుశీల చింతల అన్నారు.

-10లో





ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, చిత్రంలో మంత్రి మల్లారెడ్డి (ఇన్‌సెట్‌లో) కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు

శివారు అభివృద్ధికి బడ్జెట్

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పనులు చేస్తాం

- గ్రేటర్ నగరంలో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చాం
- వచ్చే అయిదేళ్లలో మరో లక్ష గృహాలు నిర్మిస్తాం
- మేడ్చల్‌కు మల్లారెడ్డి సరైన అభ్యర్థి
- బీఆర్‌ఎస్ విజయానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలి
- ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి మేడ్చల్ జిల్లా/మేడ్చల్: నగర శివారులోని మేడ్చల్ జిల్లా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. బుధవారం మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ ప్రజలు చైతన్యవంతులని పేర్కొన్నారు. ఉపాధి కోసం దేశంలోని పలు ప్రాంతాల నుంచి వలస వచ్చినవారు.. శివారులో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, .గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దీంతో నగర శివారు ప్రాంతాలైన మేడ్చల్, ఎల్‌బీనగర్, ఉప్పల్, కుత్బుల్లాపూర్ తదితర నియోజకవర్గాలు మినీభారత్‌లా మారినట్లు చెప్పారు. ప్రతీ సంవత్సరం ఓటర్లు పెరుగుతున్నారని, జనాభాకు తగ్గట్లుగా వసతుల కల్పన కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అన్ని మౌలిక సదుపాయాలు కలిపిస్తామన్నారు. రూ.350 కోట్లు వెచ్చించి మేడ్చల్‌కు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇచ్చామన్నారు. మేడ్చల్ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత అయిదేళ్లలో నగర ప్రజల కోసం లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చామని.. రాబోయే అయిదేళ్లలో మరో లక్ష డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. శివారుతో పాటు నగరంలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధిపరిచి హైదరాబాద్‌ను గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని కేసీఆర్ ఉద్ఘాటించారు.

అజం ఉన్న నాయకుడు.. మల్లారెడ్డి

మంత్రి మల్లారెడ్డి అన్ని విధాలా అజం (బలం) ఉన్న నాయకుడని సీఎం కేసీఆర్ అన్నారు. 5 ఏళ్ల క్రితం మల్లారెడ్డి ఎంపీగా పోటీ చేస్తారా? ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? అన్న విషయం తేలకముందే అనుకోని పరిస్థితిలో మేడ్చల్ నుంచి బీఆర్‌ఎస్ తరఫున బరిలో దింపామన్నారు. ఆయన ఎమ్మెల్యే కాకముందే మేడారం సమ్మక్క సారక్కను మొక్కి తాను మంత్రి కావాలని కోరుకున్నానని తనకు చెప్పారని.. దేవుడి కృపతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారని గుర్తు చేశారు. ఆరు లక్షల మంది ఓటర్లున్న మేడ్చల్ నియోజకవర్గానికి మంత్రి మల్లారెడ్డి సరైన అభ్యర్థి అని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు నెల రోజుల పాటు సీరియస్‌గా పని చేసి బీఆర్‌ఎస్ విజయం కోసం పని చేయాలని ఆయన కోరారు. మంత్రి మల్లారెడ్డి కోరిన విధంగా అన్ని పనులూ చేస్తామని చెప్పారు.



కేసీఆర్‌కు హారతి ఇస్తున్న మహిళలు

20 నిమిషాల్లో ముగిసిన కేసీఆర్ ప్రసంగం

సాక్షి, మేడ్చల్‌జిల్లా: మేడ్చల్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ 20 నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించారు. సాయంత్రం 5.30 గంటలకు సభ ప్రాంగణం వద్ద గాలిలో చక్కర్లు కొట్టిన సీఎం హెలికాప్టర్ 5.39 నిమిషాలకు సభ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అయ్యింది. మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కేసీఆర్‌కు స్వాగతం పలకగా అనంతరం సాయంత్రం 5.45 నిమిషాలకు ప్రచార రథంలో సభా వేదిక వద్దకు సీఎం చేరుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సీఎం సలహాదారు దేశపతి శ్రీనివాస్ వచ్చారు. సభా ప్రాంగణానికి వచ్చింది మొదలు కేసీఆర్ కొంత అలసటగా కనిపించారు. సీఎం సభ సందర్భంగా మధ్యాహ్నం 2 గంటల నుంచే సభా ప్రాంగణానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలకు సీఎం ప్రసంగంలో జోష్ కనిపించకపోవడంతో కొంత నిరాశకు గురయ్యారు.

అత్యంత నివాసయోగ్య నగరంగా హైదరాబాద్

యూఎన్‌ఎఫ్‌ఏఓ సదస్సులో మేయర్ విజయలక్ష్మి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్య నగరంగా మారిందని మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు హైదరాబాద్‌లో ఐటీ సంస్థల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నాయన్నారు. బుధవారం వాషింగ్టన్ డీసీలో జరిగిన యునైటెడ్ నేషన్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ (యూఎన్‌ఎఫ్ఏఓ) ఈవెంట్‌లో ప్రత్యేక వక్తగా ఆమె పాల్గొని ప్రసంగించారు. 'తెలంగాణకు హరితహారం' విజయ గాథను వివరించారు. హైదరాబాద్ నగరంలో రోడ్ల వెంబడి, సెంట్రల్ మీడియన్లలో విస్తృతంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున పచ్చదనం పెంపొందించడంతో పాటు ట్రీ పార్కులు, పంచతత్వ పార్కులు, మేజర్ పార్కుల అభివృద్ధి, కాలనీ పార్కులలో విరివిగా మొక్కలు నాటడం, ప్రతి ఇంటికి ఉచితంగా మొక్కల పంపిణీ, ఫ్లైఓవర్ల కింద గార్డెన్‌లు, ఫ్లైఓవర్ల పిల్లర్లకు వర్టికల్ గార్డెన్‌ల ఏర్పాటు వంటి వాటితో హైదరాబాద్‌ను పచ్చని, పర్యావరణ అనుకూల నగరంగా మార్చడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రాంతాలకు స్ఫూర్తిదాయకమైన నగరంగా మార్చినట్లు పేర్కొన్నారు. పచ్చదనం పెంపునకు చేసిన వివిధ కార్యక్రమాల వల్ల వాతావరణ మార్పుల ప్రతికూల ప్రభావాలను తగ్గించేందుకు దోహదపడిందన్నారు. పర్యావరణమార్పు, పర్యావరణ క్షీణత యొక్క సవాళ్లను పరిష్కరించడంలో సామూహిక ప్రపంచ చర్య యొక్క ప్రాముఖ్యతను ఈ సందర్భంగా మేయర్ వివరించారు.

జంపింగ్.. జపాంగ్!

- సొంత పార్టీలో టికెట్ దక్కకపోవడంతో ఇతర పార్టీల్లోకి..
- రోజురోజుకూ పెరుగుతున్న నేతలు
- చేరికలతో సమీకరణాల్లో ఊహించని మలుపులు
- అయోమయానికి గురవుతున్న నగర ప్రజలు

అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఆయా పార్టీల్లోని నేతల తీరు మారుతోంది. సొంత పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో కొందరు పార్టీలు మారుతున్నారు. ఉన్న పార్టీ ద్రోహం చేసిందని, తమకు కాదని వేరే వారికి టికెట్ ఇచ్చినందున వారిని ఓడించేందుకైనా సరేనని మరికొందరు వైరి పార్టీలో చేరుతుండటం షరామామూలుగా మారింది. ఇందుకు ఉదాహరణలివీ.. - సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్ నగరాన్ని ఆనుకొని ఉన్న జిల్లాలనే పరిగణనలోకి తీసుకుంటే తనకు, తన కుమారుడికీ టికెట్లు కావాలని డిమాండ్ చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారి తన అభీష్టాన్ని నెరవేర్చుకున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకే టిక్కెట్ అనే ఫార్ములా మేరకు తొలుత మైనంపల్లికే బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించినప్పటికీ ఆయన పార్టీని వీడారు. దీంతో మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖరరెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ ఖాయమైనట్లు చెబుతున్నారు. దీంతో బీఆర్‌ఎస్ నుంచి మామా అల్లుళ్లిద్దరూ మేడ్చల్ నుంచి ఒకరు, మల్కాజిగిరి నుంచి మరొకరు పోటీ చేయనున్నారు.


మళ్లీ మల్లారెడ్డికేనా?

- మేడ్చల్ టికెట్‌ను మళ్లీ మల్లారెడ్డికే కేటాయించడంతో బీఆర్‌ఎస్ నుంచి ఆ సీటును ఆశించిన మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్‌గా ఉన్న ఆయన కొడుకు శరత్ చంద్రారెడ్డి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. జిల్లాలో కేసీఆర్ సభ జరిగిన బుధవారమే వారు పార్టీ మారడం చర్చనీయాంశమైంది.



భంగపాటుకు గురై..

- ఇదే తరహాలో ఎల్‌బీనగర్ టికెట్ ఆశించిన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ బీఆర్‌ఎస్ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. అదే క్రమంలో గ్రేటర్ శివారుల్లో పటాన్‌చెరు నుంచి బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన నీలం మధు ముదిరాజ్ బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. అయితే ఇతర పార్టీల్లో చేరకుండా ఇండిపెండెంట్‌గానే పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.
- ఉప్పల్ టికెట్ ఆశించి భంగపడిన రాగిడి లక్ష్మారెడ్డి కాంగ్రెస్‌ను వీడి కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదే నియోజకవర్గాన్ని ఆశించిన సోమశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీలో ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్‌గా ఉన్న ఆయన భార్య శిరీషారెడ్డి సైతం కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు.
- శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ టికెట్ ఆశించిన మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ అది దక్కకపోవడంతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనతో పాటు హఫీజ్‌పేట కార్పొరేటర్‌గా ఉన్న ఆయన భార్య పూజిత సైతం బీఆర్‌ఎస్‌నుంచి కాంగ్రెస్‌లో చేరారు.
- శివారుల్లోని మరో నియోజకవర్గం షాద్‌నగర్ నుంచి టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ వైపు మళ్లారు.



వీరందరికంటే ముందే బీజేపీ నుంచి అంబర్‌పేట టికెట్ ఆశించిన వెంకట్‌రెడ్డి.. సీటు తనకు రాదని తెలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్‌గా ఉన్న ఆయన భార్య పద్మావెంకట్‌రెడ్డి సైతం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోవడం తెలిసిందే. డివిజన్, నియోజకవర్గాల్లో చెప్పుకోదగ్గ బలం ఉన్న వీరి పార్టీ మార్పు వల్ల ఎంతో కొంత ప్రభావం ఉండనుందని చెబుతున్నారు. ప్రజలు మాత్రం ఎవరు ఏరోజు ఏ పార్టీలో ఉంటున్నారో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

ఐదేళ్లుగా అసమ్మతి రాగం

మేడ్చల్: మేడ్చల్ నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సుధీర్‌రెడ్డికి 2018 ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వలేదు. ఆ ఎన్నికల్లో సీటు దక్కించుకుని గెలిచిన మల్లారెడ్డిని మంత్రి పదవి సైతం వరించింది. పార్టీలోని వారందరినీ ఆయన తన వైపు తిప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో మల్లారెడ్డి, సుధీర్‌రెడ్డిలకు ఒకరంటే ఒకరికి పడకుండా పోయింది. బహిరంగంగా విమర్శించుకున్నారు. అయినప్పటికీ సుధీర్‌రెడ్డి తన కుమారుడి భవిష్యత్ కోసం పార్టీ పెద్దల సముదాయింపులతో అయిదేళ్లుగా ఓపిక పడుతూ వచ్చారు. తాజాగా తనకు టికెట్ రాదని తేలిపోవడం, మంత్రి మల్లారెడ్డి ప్రతిష్టాత్మకంగా మేడ్చల్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ నిర్వహిస్తున్నప్పటికీ, తనను కనీసం పిలవకపోవడం, అధిష్టానం నుంచి సైతం ఎలాంటి సమాచారం లేకపోవడంతో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి మల్లారెడ్డి తన అసమ్మతి నాయకులను పార్టీ నుంచి వెళ్లేలా చేసి బీఆర్‌ఎస్‌లో తనకు తిరుగులేని విధంగా చేసుకుంటున్నారు. మరోవైపు ఎన్నికలలో తనకు తిరుగులేదనే భావనతో ఉన్న మంత్రికి తమ సత్తా చూపాలని భావిస్తున్న సీనియర్ నాయకులంతా కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు.

ఇది మా 'గ్యారంటీ'

- ఇంటింటి అవగాహనలో కాంగ్రెస్ అభ్యర్థులు
- చేరికలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం
- మరోవైపు అసమ్మతి నేతలకు బుజ్జగింపులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఇది 'మా గ్యారంటీ' అంటూ ఇంటింటి ప్రచారంలో బిజీగా మారారు. అధికారమే లక్ష్యంగా అడుగులేస్తున్న కాంగ్రెస్‌కు ఆరు గ్యారంటీ పథకాలు జీవధారగా మారాయి. గత నెల రోజులుగా నుంచే క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కార్యక్రమం కొనసాగుతోంది. తాజాగా ఆ పార్టీ అసెంబ్లీ స్థానాలకు తొలి జాబితా ప్రకటించడంతో అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. నగరంలోని 24 అసెంబ్లీ స్థానాలకు గాను 14 మంది అభ్యర్థిత్వాలు ఖరారు కాగా మరో 10 స్థానాలకు దసరా పండుగ తర్వాత ప్రకటించే అవకాశాలున్నాయి. తొలి విడతలో అభ్యర్థిత్వాలు ఖరారైన ముషీరాబాద్, సనత్‌నగర్, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్ తదితర అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారం ముమ్మరం సాగుతోంది. ఉదయం ఏడు గంటల నుంచే అభ్యర్థులు ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.

కలిసివస్తున్న చేరికలు

ఇతర పార్టీల నుంచి వస్తున్న నేతలతో కాంగ్రెస్‌కు కలిసి వస్తోంది. బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలు కాంగ్రెస్‌కు వలస కడుతున్నారు. పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా తాజాగా మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరికొందరు ముఖ్య నేతలు పార్టీ చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నేతలను బుజ్జగిస్తూ భవిష్యత్‌పై భరోసా కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా.. ఇతర పార్టీల నుంచి వలసలు పెరుగుతుండటంతో ఎన్నికల బరిలోకి దిగే అభ్యర్థులకు మరింత బలం చేకూరుతోంది.



ముషీరాబాద్‌లో ఆరు గ్యారంటీ పథకాలపై ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్

రిజిస్ట్రేషన్లు తగ్గాయ్!

- గ్రేటర్ రియల్టీపై ఎన్నికల ప్రభావం
- నెల రోజుల్లో 5 శాతం క్షీణత
- గత నెల 6,185 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: స్థిరాస్తి రంగంపై ఎన్నికల ప్రభావం పడింది. రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికలకు శంఖారావం పూరించడంతో.. గృహ కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లపై సందిగ్ధంలో పడ్డారు. దీంతో అంతకుముందు నెలతో పోలిస్తే సెప్టెంబరులో గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు తగ్గుముఖం పట్టాయి. గత నెలలో గ్రేటర్‌లో రూ.3,378 కోట్ల విలువ చేసే 6,185 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. నెల రోజుల వ్యవధిలో ప్రాపర్టీ విలువలో 2 శాతం, రిజిస్ట్రేషన్లలో 5 శాతం క్షీణత నమోదైందని నైట్‌ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. గ్రేటర్‌లో ఆగస్టులో రూ.3,461 కోట్ల విలువ చేసే 6,493 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి.

ఖరీదైన ఇళ్లకే గిరాకీ..

విలాసవంతమైన గృహాలపైనే కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గత నెలలో జరిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న ఖరీదైన ఇళ్ల వాటా 9 శాతంగా ఉంది. గతేడాది సెప్టెంబరులో ఈ గృహాల వాటా 8 శాతం. రూ.25 లక్షలు నుంచి రూ.50 లక్షలు మధ్య ధర ఉండే మధ్యస్థాయి ఇళ్ల వాటా గత సెప్టెంబరులో 55 శాతం కాగా.. ఇప్పుడది 51 శాతానికి తగ్గాయి. రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య ధర ఉండే ప్రాపర్టీల వాటా ఏడాదిలో 13 శాతం నుంచి 17 శాతానికి పెరిగాయి.



6.4 శాతం పెరిగిన ధరలు..

గ్రేటర్‌లో జిల్లాల వారీగా చూస్తే ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లలో హైదరాబాద్ వాటా 14 శాతం కాగా మేడ్చల్-మల్కాజిగిరి 45 శాతం, రంగారెడ్డి వాటా 41 శాతంగా ఉంది. గత నెలలోని రిజిస్ట్రేషన్లలో ఈ ప్రాపర్టీల వాటా 9 శాతంగా ఉంది. 1,000 నుంచి 2,000 చ.అ. మధ్య విస్తీర్ణం ఉన్న ఇళ్ల వాటా 71 శాతంగా ఉంది. ఏడాది కాలంతో పోలిస్తే గ్రేటర్‌లో ప్రాపర్టీ ధరలు సగటున 6.4 శాతం మేర పెరిగాయి.

బంజారాహిల్స్‌లో రూ.7.78 కోట్ల ప్రాపర్టీ..

గ్రేటర్‌లో గత నెల జరిగిన రిజిస్ట్రేషన్లలో టాప్-5లో నాలుగు ప్రాపర్టీలు బంజారాహిల్స్‌లోనే ఉండటం గమనార్హం. ఒకటి రాయదుర్గం నుంచి ఉంది. రూ.7.78 కోట్ల అత్యధిక మార్కెట్ విలువతో 3 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన రెండు ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్స్ జరిగాయి. రాయదుర్గంలో రూ.7 కోట్లు, బంజారాహిల్స్‌లో రూ.5.37 కోట్ల విలువ చేసే మరో రెండు గృహాల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.







పల్లెకు పోదాం చలో చలో..

పండగ సందడి మొదలైంది. సద్దుల బతుకమ్మ, దసరా కోసం నగరవాసులు సొంతూళ్లకు పయనమవుతున్నారు. బుధవారం పలు బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ ఇలా కనిపించింది.





నాంపల్లిలోని కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్ ప్రాంగణంలో బుధవారం బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

సోషల్ మీడియాపై స్పెషల్ ఫోకస్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల వేళ..సోషల్ మీడియాపై హైదరాబాద్ పోలీసులు స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా సైబర్‌క్రైమ్ ఠాణాలో సోషల్ మీడియా పర్యవేక్షణ కోసం సోషల్ మీడియా మానిటరింగ్ వింగ్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో నియమ నిబంధనలను ఉల్లంఘించి సోషల్‌మీడియాలో ప్రచారం చేసినా, అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటారు. నేడు ఎన్నికలలో ఆయా రాజకీయ పార్టీలకు ప్రధాన ఆయుధంగా సోషల్ మీడియా తయారయ్యింది. ఎన్నికల్లో ఒక్కో పార్టీకి చెందిన వారు ఒక్కో సోషల్ మీడియా బృందాన్ని ఏర్పాటు చేసుకోగా, ఆయా పార్టీల అభ్యర్థులు సైతం తమకంటూ ప్రత్యేక సోషల్‌మీడియా ఉండాలని వ్యక్తిగత సోషల్‌మీడియా టీమ్‌లను నియమించుకుంటున్నారు. ఒక పార్టీపై మరో పార్టీ ఆరోపణలు చేయడం, ఒక అభ్యర్థిపై మరో అభ్యర్థి ఆరోపణలు చేయడం చేస్తున్నారు. ఇలాంటి ఆరోపణల నేపథ్యంలో వ్యక్తిత్వాలను, మనోభావాలను దెబ్బతీసే విధంగా విమర్శలు ఉంటాయి. అలాంటివి శాంతి భద్రతలకు సమస్యలుగా మారే అవకాశాలుంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకున్న అధికారులు సోషల్‌మీడియాపై దృష్టి సారించారు.

హెచ్‌సీఏలో అవకతవకలపై ఫిర్యాదు

ఉప్పల్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో భారీ కుంభకోణం జరిగిందని, వాటిని వెలికి తీసి దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హెచ్‌సీఏ సీఈఓ సునిల్ కంటే ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఉప్పల్ సి.ఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌సీఏ కమిటీలో మహమ్మద్ అజారుద్దీన్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ప్రతి కొనుగోలులో భారీగా అవకతవకలు జరిగాయని, వాటి మీద విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అండర్–19 క్రీడాకారుల ఎంపిక విషయంలో తప్పుడు అఫిడవిట్, తప్పుడు వయసు ధృవపత్రాల సమర్పించినట్లు తెలిసిందని, దీనిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్థంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

వ్యవసాయ పనుల్లో డ్రోన్ల వినియోగం శుభపరిణామం

నాబార్డ్ సీజీఎం సుశీల చింతల



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సుశీల

ఏజీ వర్సిటీ: వ్యవసాయ పనులలో డ్రోన్ల వినియోగం శుభ పరిణామమని, కూలీల కొరత వల్ల అధునాతన టెక్నాలజీలు, యాంత్రీకరణ వైపు వెళ్లక తప్పదని నాబార్డ్ తెలంగాణ రీజియన్ సీజీఎం సుశీల చింతల అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 'నేరుగా నాటే వరి పంటలో డ్రోన్ ఆధారిత సేవల పనులు, అభివృద్ధి' అన్న అంశంపై ఒకరోజు సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుక్కి దున్నడం నుంచి పంటకోత వరకు డ్రోన్ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, వరి పంటలో డ్రోన్ ఆధారిత సేవల రూపకల్పన ప్రాజెక్టులో తాము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై రైతులు, యువతలో శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. ఇటువంటి కార్యక్రమాలకు తోడ్పాటును అందించడంలో నాబార్డ్ ముందంజలో ఉంటుందని సుశీల వెల్లడించారు. రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ, డ్రోన్లను వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు వేసుకోవచ్చని, తద్వారా సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ రామ్‌గోపాల్ వర్మ, పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబీకులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

అల్వాల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ప్రజాగాయకుడు గద్దర్ కుటుంబంలో ఒకరికి అసెంబ్లీ సీటు ఇవ్వాలని గద్దర్ అభిమాన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సీఎల్ యాదగిరి మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గద్దర్ ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. సీఎల్‌పీ నాయకుడు భట్టి విక్రమార్క చేపట్టిన తెలంగాణ పాదయాత్రకు 'పీపుల్స్ మార్చ్' అని పేరు పెట్టింది గద్దరేనని పేర్కొన్నారు. అనేక చోట్ల ఆ పాదయాత్రకు గద్దర్ దళ సభ్యులతో సంఘీభావం తెలుపుతూ తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. గద్దర్ సేవల్ని గుర్తుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ వారు ఆయన కుటుంబంలో ఒకరికి సీటు కేటాయించాలని కోరారు.

డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు



పట్టుబడ్డ నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

కుత్బుల్లాపూర్: ప్రమాదకర నార్కోటిక్ డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మేడ్చల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ టాస్క్‌ఫోర్స్ టీమ్ అదుపులోకి తీసుకుంది. వారి నుంచి రూ.2.5 లక్షలు విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కైత్లాపూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో బుధవారం విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహించగా అటుగా నెంబర్ ప్లేట్‌లేని బైక్‌పై వచ్చిన కాకినాడకు చెందిన ఇమాన్యుయేల్ (23), మోహన్(25) కదలికలు అనుమానాస్పదంగా కనిపించాయి. దీంతో వారి బైక్‌ను ఆపి తనిఖీలు చేయగా..17 గ్రాముల ఎండీఎంఏ, 49 గ్రాముల చరస్, 80 నైట్రోసన్ టాబ్లెట్‌లు లభ్యమయ్యాయి. వీటి విలువ రూ.2.5 లక్షలు ఉంటుందని, నిందితులు గత కొంత కాలంగా ప్రమాదకర డ్రగ్స్‌ను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని విజయ భాస్కర్ తెలిపారు. వారి వద్ద నుండి డ్రగ్స్‌తో పాటు బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణకు బాలానగర్ పోలీసులకు అప్పగించారు.

బ్యాంకులో బంగారం, నగదు అపహరణ

కొద్ది గంటల్లోనే దొంగను పట్టుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో నిందితుడు

హయత్‌నగర్: బ్యాంకులో ఏమరుపాటుగా ఉన్న వ్యక్తి నుంచి బంగారం, నగదును అపహరించిన సంఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీసీపీ సాయిశ్రీ తెలిపిన వివరాల ప్రకారం..మన్సూరాబాద్ సహారా ఎస్టేట్‌కు చెందిన బి.శంకర్ 53 గ్రాముల బంగారు గొలుసు, 83 గ్రాముల బంగారు కడియం తాకట్టు పెట్టేందుకు, రూ.50 వేల నగదు బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు ఓ సంచిలో వేసుకుని హయత్‌నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు వచ్చాడు. బంగారాన్ని తూకానికి ఇచ్చి మరో కౌంటర్‌లోని వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో ఓ దొంగ హఠాత్తుగా సంచిని లాక్కొని పారిపోయాడు. దీంతో షాక్‌కు గురైన బాధితుడు తేరుకుని..పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేసు నమోదు చేసిన హయత్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరుకు చెందిన సిరిగిడి ప్రకాష్ (36) దురలవాట్లకు బానిసై అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడు. కొంత కాలంగా అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం మునగనూరులో ఉంటున్నాడు. బుధవారం హయత్‌నగర్‌లో ఓ జ్యువెలరీ షాపు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో బంగారం, నగదును అపహరించింది తానే అని ఒప్పుకున్నాడు. ఈ మేరకు పోలీసులు అతని వద్ద 136 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకుని నిందితున్ని రిమాండ్‌కు తరలించారు.

పండుగ వేళ..బాంటియా ఫర్నిచర్ బంపర్ ఆఫర్లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత పండుగల నేపథ్యంలో బాంటియా ఫర్నిచర్ సంస్థ వినియోగదారుల కోసం బంపర్ ఆఫర్లను ప్రటించింది. ఈ సందర్భంగా సంస్థ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. పండగ సీజన్ సేల్స్ ఆఫర్‌లో భాగంగా అన్ని రకాల ఫర్నిచర్ కొనుగోలుపై 63 శాతం రాయితీని ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్ జంట నగరాల్లోని 15 స్టోర్లలో అందుబాటులో ఉంటుందన్నారు. అంతేకాకుండా రూ.99,999 విలువైన కొనుగోళ్లపై యాక్టివా, రూ.69,999 విలువైన కొనుగోళ్లపై 2 క్యారెట్ల వజ్రాన్ని, రూ.39,999 విలువై కొనుగోళ్లపై స్మార్ట్ టీవీని ఉచితంగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కస్టమర్లు కేవలం ఒక రూపాయి డౌన్ పేమెంట్‌తో 36 నెలల వరకు ఈఎమ్‌ఐతో వివిధ రకాల ఫర్నిచర్‌ను కొనుగోలు చేయవచ్చని తెలిపారు.



తనిఖీల్లో రూ.20 లక్షలు నగదు పట్టివేత



పట్టుబడ్డ నగదుతో ఏసీపీ మహ్మద్ జావిద్

విజయనగర్‌కాలనీ: టపాచబుత్ర పీఎస్ పరిధిలో బుధవారం రాత్రి పోలీసుల తనిఖీలో రూ.20 లక్షలు నగదు పట్టుకున్నారు. ఫిల్మ్‌నగర్‌కు చెందిన మహబూబ్ అలీ కారులో రూ.20 లక్షలు తీసుకు వెళుతుండగా కార్వాన్ రామ్‌సింగ్‌పుర వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుకున్నారు. సరైన వివరాలు తెలుపకపోవడంతో కుల్సుంపుర పోలీస్ డివిజన్ ఏసీపీ మహ్మద్ జావిద్ ఆధ్వర్యంలో కార్వాన్ రిటర్నింగ్ అధికారికి నగదును అప్పజెప్పారు. తనిఖీల్లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఐ అంబేద్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

AUTO FINANCE

- We give Private Finance on your own Car. Vehicle in good condition spot cash contact for more details Ph: 9052766444 [HA-31118]

Services

BUSINESS SERVICE

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788377]

BUSINESS OFFER

- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41395]

OLD AGE HOME

- వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd. సంప్ర: 9949520296, 7981467036. [H-189498]

HOME NEEDS

PEST CONTROL

- వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ వ్యారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందుస్థాన్ పెస్ట్ కంట్రోల్. సంప్ర : 7981533849, 9490179238. [HA-732]

PERSONAL CARE

CHANGE OF NAME

- D కనక దుర్గాదేవి D/o. రామారావు, R/o. నిజాంపేట్, హైదరాబాద్, నా పేరును "గరగ దుర్గా దేవి"గా మార్చాను. [HA-06236]

- I, Ramesh Kumar R/o SR 3 SF, The Aga Khan Academy, Ranga reddy district-501510 Telangana have changed my minor son's name from Milan to Milan Kumar [UA-36864]

- I, Balakrishna Reddy Basireddy alias B Balakrishna Reddy S/o Kondareddy Basireddy, residing at 1-60/30/63/136, Anjaiah Nagar, Gachibowli, K.v. Ranga Reddy, Telangana - 500032, have changed my name and shall hereafter be known as Tirumalakrishna Reddy Basireddy. [DA-9175]

- I, Anil Kumar S/o, Hari Persad Bhatnagar R/o Flat No. 501 5th Floor, Street No. 4 Cbit Colony, Chaitanya Bharathi Hitech Height,attapur, K.v. Rangareddy, Telangana, 500048 have changed my name to Anil Kumar Bhatnagar. [DA-29724]

- I, Shazadi Begum W/o Abdul Mannan Late, R/o. H. No. 7-2-49/5/10/A, D N M Colony, Hyderabad, T.S., changed my name as Shaizadee Begum (affidavit no. U 471369 dt. 17-10-2023 [H-193318]

Wanted

- రిసెప్షనిస్ట్, టెలికాలర్లు-హోం బేస్డ్ DTP డాటా ఎంట్రీ, వీడియో ఎడిటింగ్, యాంకర్లు, హెల్పర్స్, డ్రైవర్లు, కలెక్షన్ బాయ్స్, సూ॥వైజర్, ఇంగ్లీష్ టీచర్లు, మజీ॥ 10-16K, ఫ్రీ రూం మీల్స్ @9505261777 [H-788338]

- లాండ్రీ సర్వీస్‌లో ఇస్త్రీ / Ironing చేయుటకు మనుషులు కావలెను. టిఫిన్ + మధ్యాహ్న భోజనం + జీతం-21,000/- ఫోన్ : 8897754655 [HA-189613]

- ఉప్పల్ డిపో వద్ద మా ఫార్మా కంపెనీకి అనుభవం గల క్లర్క్ విత్ కంప్యూటర్ ఆపరేటర్, టూరింగ్ చేయగల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫోన్ : 7989823219 [HA-793367]

- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీతం: 18K. Ph: 9640400073/9848571888 [H-189342]

- హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో Sales Manగా, Housekeeping & Office Boyగా పనిచేయుటకు ఆడవారు మగవారు కావలెను సంప్ర: Ph: 9390596974 [HA-11797]

- హయత్‌నగర్ లోని రెడ్డి మెస్‌లో పని చేయడానికి కుకింగ్ మాస్టర్స్ & హెల్పర్స్ కావలెను. మంచి జీతం మరియు టిఫిన్, భోజనం+వసతి కల్పించబడును. ఫోన్ : 9347171036 [HA-793413]

- రామకృష్ణ గ్రూపు (AP NO-1) VJA, HYD. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను, భోజనం+వసతి+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52828, 92814 52833 [B-1068147]

- ప్రముఖ విద్యాసంస్థకు హైదరాబాదు ఉప్పల్ నందు పనిచేయుటకు రిసెప్షనిస్ట్, టీచర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం+ ఇన్సెంటివ్ ఇవ్వబడును. సంప్రదించండి. సెల్ : 8880118899 [G-4740]

- Wanted Technicians ITI Fitters, Helpers and Office Boys at Madhapur Contact: 7997795444 [H-193228]

- Waves Water Purifiers Requires Service Technicians & Sales Executives for Field Work, Fixed Sal + inc + Allowances + PF+ESI Ph: 040 27892388/ 2011/ 6281547216 [H-793416]

- Profound Infra Real Estate Company Required 50 No's- Sales & Marketing Executives. Attractive Salary+ Incentives. @Kondapur. Ph:9390807711 [HA-733]

- Wanted Female Hostel Incharges, Age Limit 21 to 35 Years, Salary: Negotiable. Place of Work: Master Minds College. Dilshuknagar, Hyderabad. Contact: 91000 69434 [G-4751]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

గోషామహల్‌లో విజయం నాదే

- అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేసినా ఓడిస్తా
- ఎమ్మెల్యే రాజాసింగ్ ధీమా



అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేసినా తానే విజయం సాధిస్తానని ఎమ్మెల్యే రాజాసింగ్ ధీమా వ్యక్తం చేశారు. ముస్లింలను ఒవైసీ మతం పేరుతో ఓట్లు దండుకొని మోసం చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ మొదటి జాబితాలో తనపేరు తప్పక ఉంటుందన్నారు. గోషామహల్‌లో రెండుసార్లు విజయం సాధించిన తాను ఈసారి కూడా ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొడతాన్నారు. గోషామహల్ నుంచి ఒవైసీ పోటీకి దిగినా చిత్తుగా ఓడిస్తానన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించినట్లు.. గోషామహల్‌లో మజ్లిస్ పార్టీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టడం లేదని రాజాసింగ్ ప్రశ్నించారు.

వైద్య ఆవిష్కరణలపై సదస్సు ముగింపు



సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ రాష్ట్ర చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 9వ వార్షిక సదస్సు ముగిసింది. 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఆంకోఇమేజింగ్' అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన 400 మందికి పైగా రేడియాలజిస్టులు హాజరయ్యారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై ప్రారంభించిన ఈ సదస్సులో అమెరికా నుంచి మోఫిట్ కేన్సర్ సెంటర్‌కు చెందిన ఐదుగురు సభ్యుల బృందం పాల్గొని పలు అత్యాధునిక అంశాలపై వర్క్‌షాప్‌లు, క్విజ్ తదితర కార్యక్రమాలు నిర్వహించింది. జంట నగరాలకు చెందిన పలువురు వైద్య రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీలో నిర్లక్ష్యం.. ముగ్గురికి నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: స్పష్టమైన ఓటరు జాబితా తయారీలో నిర్లక్ష్యం వహించిన కారణంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని 225, 219 పోలింగ్ స్టేషన్ల బీఎల్ఓ, సూపర్ వైజర్, రిసోర్స్ పర్సన్‌లపై క్రమశిక్షణ చర్యల కోసం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. షిఫ్టింగ్ ఓటర్ల పరిశీలనలో నిర్లక్ష్యం వహించిన ఈ ముగ్గురికి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఈఆర్ఓ, డిప్యూటీ కమిషనర్ షోకాజ్ నోటీస్ జారీచేశారు. 24 గంటల్లో సంజాయిషీ సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని ఈఆర్ఓ ఆదేశాలు జారీ చేశారు.

బీఆర్ఎస్ వెంటే ఆరె కటికలు

పంజగుట్ట: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ పార్టీ కూడా ఆరె కటికలను ఆదుకోలేదని, తెలంగాణ వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరె కటికల ఆత్మగౌరవ భవనానికి కోకాపేటలో ఎకరం స్థలం, కోటి రూపాయల నిధులు కేటాయించారని అఖిల భారత ఆరె కటిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ హంగోలేకర్ అన్నారు. ఇందుకు కృతజ్ఞతగా ఆరెకటికలు అందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆరె కటిక ట్రస్ట్ చైర్మన్ జి.నర్సింగ్ రావు, అఖిల భారత అన్నదాన సత్రం శ్రీశైలం చైర్మన్ డి.శ్రీనివాస్, పలు ఆరె కటిక సంఘాల ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి బీసీ బంధులో కూడా తమకు అవకాశం కల్పించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏ పార్టీ కూడా తమకులానికి టిక్కెట్ ఇవ్వలేదని, తెలంగాణ ఉద్యమం సమయం నుండి టీఆర్ఎస్‌లో ఉంటూ పార్టీకి ఎంతో సేవ చేసిన సంతోష్ కుమార్‌కు నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా టిక్కెట్ ఇవ్వాలని ఆరె కటిక సంఘాల ప్రతినిధులు ఐక్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయనకు టికెట్ ఇస్తే తమ కులస్థులం అందరం కలిసి గడపగడపకూ తిరిగి గెలిపించుకుంటామన్నారు. టికెట్ ఇవ్వకున్నా బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు అరుణ్‌కుమార్, మహేందర్, గోగికర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ (4106)
డి.నం. 5-9-76, 2వ & 3వ అంతస్తులు, ప్రభాత్ టవర్స్, SBI అమరావతి LHO ఎదురుగా, చాపెల్ రోడ్, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్-500001. ఇ-మెయిల్: team1samb.sec@sbi.co.in

అధీకృత అధికారి వివరాలు: పేరు: శ్రీ కె.వి. మల్లిక్ SAMB/SEC/KVM:
ఇ-మెయిల్ ID: team1samb.sec@sbi.co.in, మొబైల్: 7997211609

చర మరియు స్థిరాస్తుల కోసం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 6(2) మరియు రూల్ 8(6) తో చదువబడే విధంగా సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద చర మరియు స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టిన/ ఛార్జ్‌చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తులు అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్ (4106), 5-9-76, 2వ & 3వ అంతస్తులు, ప్రభాత్ టవర్స్, SBI అమరావతి LHO ఎదురుగా, చాపెల్ రోడ్, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్-500001 సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే నిర్మాణాత్మకంగా/ లాంఛనప్రాయంగా స్వాధీనంలోకి తీసుకోబడినవని అవి రుణగ్రహీత: మెసర్స్ కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహించువారు మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ అమిత్ హృదయ్‌నాథ్ చతుర్వేది వారి నుంచి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయి ఉన్న మొత్తం 30.09.2023 నాటికి రూ. 69,11,49,264.18 (అరవై తొమ్మిది కోట్ల పదకొండు లక్షల నలభై తొమ్మిది వేల రెండు వందల అరవై నాలుగు రూపాయల పద్దెనిమిది పైసలు మాత్రమే) + 01.10.2023 నుంచి వర్తింపుతో కాంట్రాక్చువల్ రేటు వంతున దానిపై వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు (డిమాండ్‌నోటీసు జారీ చేసిన తర్వాత రుణగ్రహీత/గ్యారంటార్లు/ వేలం బిడ్డర్లు, కంపెనీచే చెల్లించబడిన మరియు ఆస్తుల వేలం అమ్మకం ద్వారా రాబట్టుకోబడిన ఏదేని మొత్తం ఇదివరకే లెక్కలోకి తీసుకోబడినవి) మరియు వ్యయాలతో పాటు తనఖాపెట్టబడిన సెక్యూరిటీలకు సంబంధించి మొత్తం బకాయిలు/ రుణ బకాయిలు/ చెల్లించవలసిన మొత్తాలను రాబట్టుకునేందుకు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే", "ఉన్నవి ఉన్నట్లుగా" మరియు "అక్కడ ఏమున్నవో అవే" ప్రాతిపదికపై 08.11.2023న విక్రయించబడతాయని సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు) ఇందుమూలంగా నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

దిగువ తెలిపిన ప్రతి ఆస్తి కోసం రిజర్వు ధర, తేదీ మరియు సమయం:

చరాస్తులు: ఆస్తి నం.1: ప.గో. జిల్లా, కొవ్వూరు మండలం, ఐ.పంగిడి పంచాయతీ, దాచెర్ల సర్వే నం.152, 177 ఫ్యాక్టరీ భూమి (ఎ.29.80 సెంట్లు) వద్ద మెసర్స్ కరుటూరి సెరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ప్లాంట్ మరియు మెషినరీ. ప్లాంట్ మరియు మెషినరీ సంక్షిప్తంగా దిగువ వివరించిన విధంగా ఉన్నాయి: 1. గ్లేజ్డ్ పోర్సిలైన్ టైల్స్ మరియు సింగిల్ ఫైర్డ్ గ్లేజ్డ్ డెకరేటెడ్ వాల్‌టైల్స్ రోజుకు/ 8500 చ.మీ.ల ఉత్పత్తి కోసం ఫాస్ట్ సింగిల్ ఫైరింగ్ ప్లాంట్, 2. ఎలక్ట్రానిక్ వేయింగ్ 36m³ కెపాసిటీతో బ్యాచ్ హోపర్, 3. రబ్బర్ లైనింగ్ పార్టిషిప్‌మెంట్ 5 నంబర్లు, 5MT బాల్‌మిల్ 2 నంబర్లతో బాల్‌మిల్, 4. 10T చెయిన్ కోల్ స్టో, స్ప్రే డ్రైయర్, బెల్ట్ కన్వెయర్స్ సిస్టమ్, 5. 40TPH సిరామిక్ పవర్ హ్యాండింగ్ సిస్టమ్. 6. బ్యాగ్ ఫిల్టర్ మరియు ఫ్యాబ్రికేటెడ్ న్యూమాటిక్ స్లైడ్‌గేట్ మరియు వెట్‌స్క్రబ్బర్, 7. కూలింగ్ టవర్, హీట్ ఎక్స్ఛేంజర్ సిలోస్ 8 నంబర్లు, గ్లేజ్ స్టోరేజ్ ట్యాంక్స్ 8 నంబర్లు, వాటర్ లైన్స్ వాల్వులతో సహా, 8. మౌల్డ్ సెట్స్, ఉపయోగించని ఇంక్‌జెట్ ప్రింటర్, 9. డ్రై స్క్వేరింగ్ మరియు చాంఫరింగ్ లైన్, 10. స్క్వేరింగ్ మరియు చాంఫరింగ్ లైన్ మరియు గ్లేజ్డ్ పాలిషింగ్ లైన్, 11. గ్లేజ్ నానో మరియు వ్యాక్సింగ్ పాలిషింగ్ లైన్ మెషిన్, 12. రబ్బర్‌లైనింగ్ 1 నంబరుతో బాల్‌మిల్ 40T, 13. క్వార్ట్జ్ టైల్స్ ప్లాంట్, 14. ల్యాబ్ ఎక్విప్‌మెంట్, 15. ఎస్సే ఎలక్ట్రానిక్ వేబ్రిడ్జి, 16. ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్, 17. స్ప్లిట్ ఎయిర్ కండీషనర్స్, 18. ఎయిర్ కంప్రెషర్ 1010 KVA DG సెట్, 19. 50 KVA DG సెట్, 20. ఓల్ట్ యాంప్ ట్రాన్స్‌ఫార్మర్స్ 3000 KVA, 21. 33 KV ఎలక్ట్రికల్ లైన్ చార్జర్స్, 22. ఇతర మిసిలేనియస్ మెషినరీ మొదలైనవి, 23. వెహికల్స్ ఫోర్క్ లిఫ్ట్-1, ట్రాక్టర్స్-2, ఫ్రంట్ ఎండ్ లోడర్-1, జీప్ బొలెరో. మినీ బస్-టూరిస్టర్,

వేలం తేదీ, సమయం: 08.11.2023న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం.లు, రిజర్వు ధర: రూ.13,13,00,000/-
బయానా: రూ.1,31,30,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ.2,00,000/-

స్థిరాస్తులు: ఆస్తి నం.2: పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర.) కొవ్వూరు మండలం, పంగిడి పంచాయతీ, దాచెర్ల గ్రామంలోని R.S.Nos. 177 & 152 (పాత R.S.Nos 4A & 4B) లలో భవనములు మరియు వాటిపై ఇతర నిర్మాణాలతో సహా ఎ.29.80 సెంట్ల (12.059 హెక్టార్లు) విస్తీర్ణంతో మెసర్స్ కరుటూరి సిరామిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరున గల ఫ్యాక్టరీ భూమి మరియు భవనం యావత్తు మరియు సరిహద్దులు: తూర్పు: వుంత, దక్షిణం: R.S.Nos. 146 & 178 లలో కంచుమర్తి ప్రజలకు చెందిన భూమి. పశ్చిమం: R.S.Nos. 148, 150 & 151 లలో కంచుమర్తి ప్రజలకు చెందిన భూమి. ఉత్తరం: R.S.Nos 169 లో కోనేరు మరియు ఇతరుల భూమికి వెళ్ళేదారి (డాక్యుమెంట్ నం. 2678/2010 తేది: 09-07-2010 మరియు SRO కొవ్వూరు వద్ద నమోదు కాబడినది).

వేలం తేది, సమయం: 08.11.2023న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం.లు, రిజర్వు ధర: రూ.20,00,00,000/-
బయానా: రూ.2,00,00,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ.2,00,000/-

గమనిక: ఆస్తి నం.2 యొక్క అమ్మకం నిర్ధారణ ఆస్తి నం.1 అమ్మకం నిర్ధారణకు లోబడి ఉంటుంది.

ఆస్తి నం.3: తూర్పు గోదావరి జిల్లా (ఆం.ప్ర.), రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధులు రాజమండ్రి క్రింద లలితానగర్, హరిపురం వద్ద గల వార్డు నం.10, R.S.No. 34 లోని డోర్ నం.23-16-44 తో ప్లాట్ నం.140-B, TP No.24/72 కలిగిన రెండు భాగాలు కలిగిన (పార్ట్-ఎ 250 చ.గ. లేదా 209.02 చ.మీ. మరియు పార్ట్-బి 350 చ.గ. లేదా 292.63 చ.మీ.) 600 చ.గ.ల విస్తీర్ణంతో శ్రీ అమిత్ చతుర్వేది తండ్రి స్వర్గీయ శ్రీ హృదయ్‌నాథ్ చతుర్వేదికి చెందిన నివాస ఆస్తి (గ్రౌండ్ ఫ్లోర్ + ఒకటవ అంతస్తు) యావత్తు మరియు సరిహద్దులు: పార్ట్-ఎ: 250 చ.గ. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.140-ఎ కు చెందిన సైట్ (56'.3"). దక్షిణం: కొనుగోలుదారుకు చెందిన సైట్ (40'.0"). పశ్చిమం: ప్లాట్ నం.141 కు చెందిన సైట్ (40'.0"). ఉత్తరం: కో-ఆపరేటివ్ మార్కెటింగ్ యార్డ్ (56'.3"). పార్ట్-బి: 350 చ.గ. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.140-ఎ కు చెందిన సైట్ (78'.9"). దక్షిణం: రోడ్ (40'.0"). పశ్చిమం: ప్లాట్ నం.141 కు చెందిన సైట్ (78'.9"). ఉత్తరం: విక్రయదారుకు చెందిన ఈ ప్లాట్‌లో మిగతా సైట్ (పార్ట్-1) (40').
(డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ ఆఫీసర్, రాజమండ్రి వద్ద నమోదైన స్వర్గీయ శ్రీ హృదయ్‌నాథ్ చతుర్వేది, రిజిస్టర్డ్ విల్ డీడ్ నం.179/2008 తేది: 04-06-2008 ప్రకారం డాక్యుమెంట్ నం.2235/1991 తేది: 08-04-1991 మరియు 7092/90 తేది: 05-10-1990.)

వేలం తేది, సమయం: 08.11.2023న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం.లు, రిజర్వు ధర: రూ.2,65,00,000/-
బయానా: రూ.26,50,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ.1,00,000/-

ఆస్తి నం.4: ఎ) తూర్పు గోదావరి జిల్లా (ఆం.ప్ర.), రాజమండ్రి, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లలితానగర్, హరిపురం వద్ద గల డోర్ నం.23-16-1/1 తో R.S.No. 34, T.P.No. 20/63 లో ప్లాట్ నం.129 మరియు 130 కలిగిన 240 చ.గ. లేదా 200.66 చ.మీ. విస్తీర్ణంతో శ్రీ అమిత్ చతుర్వేది తండ్రి స్వర్గీయ శ్రీ హృదయ్‌నాథ్ చతుర్వేదికి చెందిన నివాస ఆస్తి యావత్తు మరియు సరిహద్దులు: తూర్పు: C.T.R.I. కు చెందిన ఆస్తి (27'0"), దక్షిణం: విక్రయదారుని తల్లి ఆస్తి (80'.0"), పశ్చిమం: రోడ్ (27'.0"), ఉత్తరం: విక్రయదారుని మిగిలిన ఆస్తి (80'.0"). (డాక్యుమెంట్ నం.2442/2011 తేది: 28-04-2011 మరియు D.R.O. రాజమండ్రి వద్ద నమోదు కాబడినది).
బి) తూర్పు గోదావరి జిల్లా (ఆం.ప్ర.), రాజమండ్రి, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లలితానగర్, హరిపురం వద్ద గల డోర్ నం.23-16-1/1, R.S.No. 34 లో ప్లాట్ నం.129 మరియు 130 కలిగిన 353.33 చ.గ. లేదా 295.41 చ.మీ. విస్తీర్ణంతో శ్రీమతి రుచిత చతుర్వేది భర్త శ్రీ అమిత్ చతుర్వేదికి చెందిన నివాస ఆస్తి యావత్తు మరియు సరిహద్దులు: తూర్పు: C.T.R.I. కు చెందిన ఆస్తి (39'.6"), దక్షిణం: శ్రీ అమిత్ చతుర్వేదికి చెందిన ఆస్తి (80'.0"), పశ్చిమం: రోడ్ (40'.0"), ఉత్తరం: రోడ్ (80'.0"). (డాక్యుమెంట్ నం. 2496/2012 తేది: 23-04-2012 మరియు D.R.O. రాజమండ్రి వద్ద నమోదు కాబడినది)

వేలం తేది, సమయం: 08.11.2023న ఉ.11.00 గం. నుండి సా.4.00 గం.లు, రిజర్వు ధర: రూ.2,63,00,000/-
బయానా: రూ.26,30,000/-, బిడ్ పెంపుదల మొత్తం: రూ.1,00,000/-

బయానా చెల్లింపు: కాగోరు బిడ్డర్లు ఇ-వేలం ప్రక్రియలో పాల్గొనేందుకు ఇండియన్ బ్యాంక్స్ ఆక్షన్ ప్రాపర్టీస్ ఇన్ఫర్మేషన్ (IBAPI) పోర్టల్ (https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp) లో తమంతట తాము నమోదు చేసుకోవలసి ఉంటుంది. బిడ్డర్ల రిజిస్ట్రేషన్ కోసం మూడు పని దినములు పడుతుంది కనుక వేలం తేదీకి తగినంత ముందుగా బిడ్డర్లు తమంతట తాము నమోదు చేసుకోవలసి ఉంటుంది. కాగోరు బిడ్డరు, తమ బ్యాంకు అకౌంట్ ద్వారా IBAPI పోర్టల్‌లోని IBAPI వ్యాలెట్‌కు బయానా డిపాజిట్ దాఖలు చేయవలెను.
తనిఖీ, అమ్మకం యొక్క ఏదేని స్పష్టీకరణల కోసం కాగోరు బిడ్డర్లు అధీకృత అధికారి శ్రీ కె.వి. మల్లిక్, మొబైల్:7997211609 ను సంప్రదించవలెను. బిడ్డర్లు బ్యాంక్ ఆమోదిత రిజల్యూషన్ ఏజెంట్ మెసర్స్ రఘు అసోసియేట్స్, హైదరాబాద్, 9440836500, 8885552284 వారిని కూడా సంప్రదించవచ్చును.
గమనిక: ఇ-వేలం తేదీలోగా బకాయిలు పూర్తిగా తిరిగి చెల్లించకపోతే పైన తెలిపిన తేదీన ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు సంబంధించి సదరు రుణం యొక్క రుణగ్రహీత/ గ్యారంటార్లకు ఇది నోటీసుగా కూడా ఉంటుంది.
అమ్మకం యొక్క వివరమైన నియమ నిబంధనల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెక్యూర్డ్ క్రెడిటార్ వెబ్‌సైట్ (a) www.sbi.co.in (b) https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp (c) https://ibapi.in లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి.
తేది: 10.10.2023, ప్రదేశం: హైదరాబాద్ — అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా తాతారావు, మారుతీనగర్ 11 కేవీ ఫీడర్లు, నిమ్స్, ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ల పరిధిల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు బంజారాహిల్స్ రోడ్–4, 5, 7, హనుమాన్ టెంపుల్ లైన్, పరిసర ప్రాంతాలు, నవోదయకాలనీ, శ్రీకృష్ణదేవరాయ కాలనీ, గణపతి కాంప్లెక్స్ ఎదురు గల్లీ, లక్ష్మీనరసింహానగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

– ఐజీ పురం 11కేవీ ఫీడర్ బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఐజీ పురం, బేగంపేట బస్తీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

శబరిమల మాళికాపురం మేల్‌శాంతిగా మురళీనంబూద్రి



బంజారాహిల్స్: సోమాజిగూడ అయ్యప్ప స్వామి దేవాలయం మేల్ శాంతి పి.జి.మురళీ నంబూద్రి శబరిమల మాళికాపురం కొత్త మేల్‌శాంతిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనను ఆలయ ఉద్యోగులతో పాటు భక్తులకు బుధవారం పెద్ద సంఖ్యలో విచ్చేసి అభినందించారు. గడచిన మూడు దశాబ్దాలుగా ఆయన సోమాజిగూడ అయ్యప్ప దేవాలయం మేల్ శాంతిగా పనిచేస్తున్నారు. 2023–24వ సంవత్సరానికి గాను శబరిమల మేల్ శాంతిగా ఆయన దైవిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ అరుదైన అవకాశం నగరంలో మురళీనంబూద్రికి రావడంపట్ల భక్తులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా దాండియా



వెంకటేశ్వరకాలనీ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మా జగదాంబా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద బుధవారం దాండియా వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ వేడుకల్లో స్థానిక బస్తీవాసులతో పాటు మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ. 3.15 లక్షలు స్వాధీనం



ఫిలింనగర్: ఫిలింనగర్ పోలీసులు బుధవారం సినార్ వాలీ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో మహ్మద్ రఫీక్ అనే వ్యక్తి నుంచి రూ. 3.10 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

యువ, మహిళా పోలింగ్ కేంద్రాలు!

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. గతంలో జరిగిన ఎన్నికల్లో పలు వినూత్నమైన మార్పులు ప్రవేశ పెట్టి ఓటర్ల మన్ననలు అందుకున్న ఎన్నికల సంఘం ఈ సారి మరిన్ని కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేసే దిశలో ప్రణాళికలు రూపొందించింది. ఈ సారి యువ, మహిళా, దివ్యాంగులు, నమూనా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ప్రకటించింది. యువ పోలింగ్ కేంద్రాల్లో అంతా యువ అధికారులే ఉండనున్నారు.

ఈసారి ప్రత్యేకం కానున్న పోలింగ్ కేంద్రాలు

- దివ్యాంగులు, యువ, మహిళా ఉద్యోగులతో కేంద్రాల ఏర్పాటు
- కీలకం కానున్న యువ ఓటర్లు
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో త్వరలో నమూనా పోలింగ్ కేంద్రాలు

బంజారాహిల్స్: దివ్యాంగుల పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులే ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. మహిళల కోసం ఏర్పాటు చేసే కేంద్రాల్లో మహిళలే ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తారు. యువ, మహిళా కేంద్రాలంటే అక్కడ ఓటేసేది యువకులు, మహిళలు మాత్రమేనని చాలా మంది పొరపడుతుంటారని అన్ని వర్గాల వారు ఇక్కడ ఓటు వేయవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు.

- దీనిపై ఇప్పటికే ఇందుకు సంబంధించి ఎన్నికల ఏర్పాట్లకు తగిన సూచనలు జారీ అయ్యాయి. నమూనా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఓటింగ్ శాతం పెంచాలని యత్నిస్తున్నారు. ఇప్పటి నుంచే పలుచోట్ల ఈ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిన తర్వాత ఏఏ దశల్లో ఓటర్లు ఈవీఎంల వరకు వెళ్లవచ్చో ఆయా వివరాలపై ముందుగానే అవగాహన కలిగించనున్నారు.
- దీని వల్ల నవంబర్ 30న పోలింగ్ ఉందనే విషయం ముందుగానే ఓటర్లకు మరింతగా ప్రచారం కల్పించే అవకాశం కలగనుంది. దీనికి తోడు యువకులు పెద్ద సంఖ్యలో ఈ సారి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఈ సారి 33 శాతం మంది ఓటర్లు యువకులే ఉండటం గమనార్హం. పెద్ద సంఖ్యలో యువకులు ఓటు వేయడానికి ముందుకు వస్తే పారదర్శకమైన ఫలితాలు రాబట్టవచ్చునని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తున్నది. ఒక్క ఖైరతాబాద్ నియోజకవర్గంలోనే 31 వేల మందికి పైగా యువ ఓటర్లు ఈ సారి అభ్యర్థుల తలరాతలు మార్చనున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఈసారి 35 శాతానికి పైగా యువ ఓటర్లే ఉండటంతో ఇక్కడ అభ్యర్థులు యువకులపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించే అవకాశాలు ఏర్పడ్డాయి. యువ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా యువకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



యువ ఓటర్లు

ఇంటి నుంచే ఓటు హక్కు...

ఈ ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానాన్ని ప్రవేశ పెట్టి మంచి ఫలితాలు సాధించడంతో తెలంగాణలోనూ ఇంటి నుంచే ఓటు హక్కు అవకాశాన్ని కల్పించారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఫారం –12 డీని నింపి ఆర్వోకు అప్పగించాలి. అందులో అసెంబ్లీ నియోజకవర్గం, ఓటరు జాబితాలని వరుస సంఖ్య పొందుపర్చాల్సి ఉంటుంది. దివ్యాంగులు అయితే అందులో ఉన్న బాక్సులో టిక్ చేయాలి. వీటిని పరిశీలించిన అనంతరం రిటర్నింగ్ అధికారి సంబంధిత అర్హులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పిస్తారు. అధికారులు నేరుగా ఇంటికి వెళ్లి రహస్యంగా ఓటు వేసే ప్రక్రియను చేపడతారు. దీన్ని వీడియోలు చిత్రీకరిస్తారు. ఆ సమయంలో రాజకీయ పార్టీలకు కూడా సమాచారం అందిస్తారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం: చింతల



సోమాజిగూడ పోచమ్మ బస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అభివృద్ధిని విస్మరించిన అధికార పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచించారు. ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన సోమాజిగూడ డివిజన్ పరిధిలోని పోచమ్మ బస్తీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను ప్రచారంచేస్తూ కరపత్రాలను ఆయన ఓటర్లకు పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని వెల్లడించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులను కూడా ప్రజల దృష్టికి తీసుకొచ్చారు.

రాహుల్, ప్రియాంకాగాంధీలకు ఘనంగా స్వాగతం



బంజారాహిల్స్: ములుగులో జరిగే కాంగ్రెస్ విజయభేరీ సభలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు బుధవారం బేగంపేట విమానాశ్రయంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్ రెడ్డి ఖైరతాబాద్ నియోజక వర్గం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అక్కడి నుంచి వారితో కలిసి ములుగు విజయభేరి సభకు తరలి వెళ్లారు.

ఓట్ల కోసం బీఆర్ఎస్ మోసపూరిత హామీలు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

హిమాయత్‌నగర్: ఓట్ల కోసం ప్రజలను మరోసారి మోసం చేసేందుకే బీఆర్ఎస్ పార్టీ ఇష్టారాజ్యంగా హామీలు ఇస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఆరోపించారు. బుధవారం హిమాయత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల కార్డును ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వద్దులు, దివ్యాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయని బీఆర్ఎస్ నేతలు ఎన్నికల నేపథ్యంలో రూ. 5016 పెన్షన్ ఇస్తామని మాయమాటలు చెపుతోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెన్షన్‌లకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే అంశంపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

అప్రమత్తతతో కేన్సర్‌కు చెక్



మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రహమత్‌నగర్: కేన్సర్ ప్రాణాంతకమైనదని, దీని పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఎస్‌డీ సేవా సంస్థ అధ్యక్షురాలు, తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ డెరెక్టర్(అడ్మిన్) కాకుమాను శశిశ్రీ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సికింద్రాబాద్ డివిజన్, జూబ్లీహిల్స్ టీ హోప్ కమ్యూనిటీ సెంటర్‌ల సౌజన్యంతో, సికింద్రాబాద్ కేన్సర్ సెంటర్ సహకారంతో మహిళలకు ఉచిత కేన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శశిశ్రీ మాట్లాడుతూ... మారుతున్న కాలంలో కేన్సర్ మహమ్మారి రోజురోజుకూ పెరిగిపోతున్నదని, దీనిని ముందుగానే గుర్తిస్తే త్వరగా నయం చేసే అవకాశం ఉందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో ఉచితంగా పరీక్షలు చేసి మందులకు అందజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సికింద్రాబాద్ కన్వీనర్ అయాబ్‌ఖాన్, రెనోవా కేన్సర్ సెంటర్ ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, టి.గణేష్, సుధాకర్‌రావు, రాజా ఆస్పత్రి వైద్యులు అఫ్రీన్, డాక్టర్ రమేశ్, అజయ్, టీ హోప్ సంస్థ కోఆర్డినేటర్ యామిని తదితరులు పాల్గొన్నారు.

31న 'బహుజన స్వరార్చన'

హిమాయత్‌నగర్: విశ్వజన కళామండలి 45వ వార్షికోత్సవాన్ని ఈ నెల 31న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు మండలి వ్యవస్థాపకులు మాస్టర్ జీ, దళిత ఉద్యమ నేత జె.బి.రాజు వెల్లడించారు. 45 పాటలతో బహుజన స్వరార్చన పేరుతో ప్రజా యుద్ధనౌక గద్దర్ కు ఈ పాటలను అంకితం చేయనున్నట్లు తెలిపారు.

ఈ మేరకు బుధవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో వార్షికోత్సవ వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ మాట్లాడుతూ... మాస్టర్ జీతో మూడు దశాబ్దాల అనుబంధం ఉందని, దళిత ఉద్యమాన్ని బలోపేతం చేసిన వారిలో మాసర్ జీ ఒకరని కొనియాడారు. ప్రజా పోరాటాలతో గద్దర్ మమేకం కాగా, దళిత ఉద్యమాన్ని ప్రపంచ స్థాయికి తీసుకొచ్చిన ఘనత మాస్టర్ జీకే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో కోలా జనార్ధన్, పి.రాజు, నత్య కారుడు పి.అమత్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు ఇంద్రవెల్లి రమేష్, ఆదం రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ. 5 లక్షల కరెన్సీతో అమ్మవారికి అలంకరణ



వెంకటేశ్వరకాలనీ: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పంజగుట్ట కాలనీలో కొలువుదీరిన శ్రీ దుర్గా భవానీ దేవి ఆలయంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి సమేత అమ్మవారు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రూ. 5 లక్షల కరెన్సీ నోట్లతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ దివ్య అలంకారాన్ని తిలకించేందుకు, విశేష పూజలు నిర్వహించేందుకు ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఇందులో భాగంగా మంగళ వాయిద్యాలు, అమ్మవారికి అభిషేకం, ఈశ్వరుడికి రుద్రాభిషేకం, చండీ హోమం, శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చనలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పొన్న వాహన సేవలో శ్రీవారు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు బుధవారం ఉదయం పొన్న వాహన సేవలో, సాయంత్రం హంస వాహన సేవలో తిరువీధుల్లో ఊరేగారు. అంతకుముందు శ్రీవారి సుప్రభాత సేవ, భగవదారాధన, సేవాకాలం తదితర కైంకర్యాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ వాహన సేవల్లో పాల్గొని తరించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారికి ఆలయ చైర్మన్ సి.హెచ్.రామయ్య, ఈవో ఎస్. లావణ్య విశేష పూజలు నిర్వహించారు.

'స్ట్రాంగ్ రూమ్'ల పరిశీలన

బంజారాహిల్స్: వచ్చే నెల 30న జరగనున్న శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరిచే యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం స్ట్రాంగ్ రూమ్‌లలో ఏర్పాట్లను బుధవారం జీహెచ్ఎంసీ సర్కిల్–19 ఈఈ రాజ్ కుమార్, డీఈ శ్రీరాములుతో పాటు సంబంధిత ఎన్నికల సిబ్బంది ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్‌లకు పటిష్ట భద్రత కల్పించే దిశలో ఇప్పటికే కిటికీలను కొన్ని చోట్ల మూసివేస్తూ మరికొన్ని చోట్ల లోనికి ఎవరూ వెళ్ళకుండా అడ్డుగోడలు నిర్మిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి సౌకర్యాలు అవసరమవుతాయో సంబంధిత ఎన్నికల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలోకి వెళ్లేందుకు రెండు మార్గాలు ఉన్నాయి. ఇందులో ఒక వైపు ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఇంకోవైపు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి దారులు కేటాయించనున్నారు. హాల్ లోపల, మధ్యలో పార్టిషన్‌ను ఏర్పాటు చేసి రెండు నియోజకవర్గాలకు వేర్వేరుగా టేబుళ్లు, కుర్చీలు ఎన్నికల సిబ్బందికి ఏర్పాట్లు చేయనున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలు తీసుకొచ్చే మార్గాలను కూడా రెండు నియోజకవర్గాలకు వేర్వేరుగా రూపొందించారు.



స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇంజినీరింగ్ విభాగం అధికారులు

కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలం.. బలగం

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉన్న కార్యకర్తలే తనకు బలం బలగం అని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆ పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన వెంగళరావునగర్ డివిజన్ వీడియోగల్లీ, కమాన్‌గల్లీ, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని మహిళలందరికీ అన్నగా అండగా ఉంటూ వారికి సంక్షేమ కార్యక్రమాలను అందజేశామన్నారు. మూడోసారి కూడా తనకు ఓటు వేసి అవకాశం ఇస్తే ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. కాలనీలకు దీటుగా బస్తీలను తయారు చేస్తానన్నారు. వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్, జీటీఎస్ టెంపుల్ చైర్మన్ చిన్న రమేష్, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు, సీనియర్ నేతలు అంబటి రామకృష్ణ, వేణు, ఆంజనేయులు యాదవ్, పవన్ ముదిరాజ్, పూజారి బాలు, సత్యనారాయణ, బంటి యాదవ్, విజయగౌడ్, కట్టా లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన సిద్ధార్థనగర్‌కాలనీ, వికాస్‌పురికాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు.



కమాన్‌గల్లీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి

సందడిగా బతుకమ్మ

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌కాలనీలోని మహిళాభివృద్ధి శిశుసంక్షేమ శాఖ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం బతుకమ్మ సంబురాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ శాఖ కమిషనర్ శృతి ఓజా, రీజనల్ జాయింట్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు, వివిధ శాఖలకు చెందిన ఇన్‌చార్జిలు బతుకమ్మలను ఎత్తుకుని ప్రాంగణానికి తీసుకొచ్చారు. ఆవరణలో బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో ఉంటూ చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ లయబద్ధంగా నృత్యాలు చేస్తూ బతుకమ్మను వేడుకున్నారు.



బతుకమ్మను ఎత్తుకున్న కమిషనర్ శృతి ఓజా



ఆకృతి ఎగ్జిబిషన్

బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన ఆకృతి ఎలైట్ లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సందర్శకులను హృదయాలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌ను డైరెక్టర్ శశినాథ ప్రారంభించారు.

మహాలక్ష్మీ నమోస్తుతే

- అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- భక్తజన సంద్రంగా మారిన అమ్మవారి మండపాలు
- మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు





గజలక్ష్మిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి, మాగంటి కాలనీలో అన్నపూర్ణాదేవి, శ్రీనగర్‌కాలనీలో మహాలక్ష్మి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం అమ్మవారు శ్రీ గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్య అలంకారాన్ని తిలకించి విశేష పూజలు నిర్వహించేందు కు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 18లోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో కొలువుదీరిన శ్రీ పర్వ తవర్ధినీ దేవి అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబికా దేవి అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.



రామాంజనేయ స్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి

దానం ప్రత్యేక పూజలు...

పంజగుట్టలోని దుర్గా భవానీ ఆలయంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కమిటీ చైర్మన్ నర్సింహా రెడ్డి, నల్ల శివ, యాకరి గణేష్, ఎం. కృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హేమావతినగర్‌లో...

శ్రీనగర్‌కాలనీ: హేమావతినగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జైమాత యూత్ అసోషియేషన్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహ వద్ద విగ్రహ దాతలు సత్యవికాస్‌రాయ్ చౌదరి, పురోహితులు ఎస్‌కే శర్మ, రాజేష్, ప్రణీత్, చక్రవర్తి, భీమేశ్వరశర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పంజగుట్ట దుర్గా భవానీ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో...

వెంగళరావునగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీరామాంజనేయ స్వామి, శ్రీఅభయాంజనేయ స్వామి, జీటీఎస్ ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారిని బుధవారం శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించారు.



నందినగర్‌లో అమ్మవారి పూజల్లో పాల్గొన్న బస్తీవాసులు



మహాలక్ష్మీగా బంజారాహిల్స్ కనకదుర్గా దేవి అమ్మవారు



దైవసన్నిధానంలో 108 కలశాలతో అభిషేక పూజలు

మహిళలు అన్నిరంగాల్లో సత్తాచాటాలి

పంజగుట్ట: వికీపీడియాలో తక్కువ శాతం వ్యాసాలు స్త్రీలకు సంబంధించినవి ఉన్నాయని, 19 శాతం వికీపీడియా ఎంట్రీలు స్త్రీలపై దృష్టి కేంద్రీకరించబడ్డాయి, మిగిలిన 81 శాతం పురుషులకు కేంద్రీకృతమయ్యాయని భారతదేశంలోని ప్రముఖ పోటీ న్యాయవాదుల్లో ఒకరిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన నిషా కౌర్ ఉబెరాయ్ అన్నారు. బుధవారం సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో పోటీ చట్టం, దాని ప్రాముఖ్యతపై సెషన్ సెషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నిషా కౌర్ మాట్లాడుతూ... మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, తాను నేషనల్ లా కాలేజీలో చదువుకుంటున్నప్పుడు తక్కువ మంది మహిళలు ఉండేవారని, ఇప్పుడు అందులో 50 శాతం మహిళలు ఉండటం సంతోషించదగ్గ విషయమన్నారు. భారత న్యాయ వ్యవస్థకు మహిళలు ఎక్కువ మంది అవసరమని, ఎక్కువ మహిళా న్యాయమూర్తులు కావాలన్నారు. మహిళా రిజర్వేషన్ల గూర్చి మాట్లాడుతూ... ప్రవేశస్థాయిలో ఇది మహిళలకు సహాయపడుతుదన్నారు. పార్లమెంట్‌లో ఉన్న ప్రస్తుత 33 శాతం నుంచి 50 శాతానికి పెరిగితేనే సమానత్వం వస్తుందన్నారు. ఫిక్కీ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ రీతు షా ఆమెకు స్వాగతం పలికారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

బంజారాహిల్స్‌లో ఫెడరల్ బ్యాంక్ శాఖ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నెం.3లో ది ఫెడరల్ బ్యాంక్ తమ శాఖను ఏర్పాటు చేసింది. ఈ కొత్త బ్రాంచిని బుధవారం అంకుర ఆసుపత్రి ఎండీ డా.కృష్ణప్రసాద్ రావు, ఏటీఎం కేంద్రాన్ని బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ డైరెక్టర్, సీఎఫ్ఓ సత్యనారాయణ, స్ట్రాంగ్ రూమ్, సేఫ్ డిపాజిట్ లాకర్స్‌ని సంజీవ్ కుమార్ కొరిటాల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ దిలీప్, రీజనల్ హెడ్ జోస్ థామస్, బ్రాంచి మేనేజర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20న ఇందిరాపార్క్ వద్ద మాలల మహాధర్నా



పంజగుట్ట: మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏ పార్టీ నిర్దిష్ట హామీ ఇస్తుందో వారికే రాష్ట్రంలోని 30 లక్షల మాలల మద్దతు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ తెలిపారు. మాలల ఐక్యత చాటుకునేందుకు, మాలలు ఎదుర్కొంటున్న సమస్యలు అన్ని పార్టీల నాయకుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 20న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహాధర్నా కరపత్రాన్ని వర్కింగ్ చైర్మన్లు తాళ్లపల్లి రవి, బేర బాలకిషన్, కో చైర్మన్ గడ్డం సత్యనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ, 20వ తేదీన నిర్వహించే ధర్నాకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున మాలలు హాజరవుతారన్నారు. 30 లక్షల జనాభా ఉన్నప్పటికీ తమ సోదర మాదిగ కులస్తులు జనాభా తక్కువ ఉందని చూపుతూ రాజకీయాల్లో, ఎస్సీ కార్పొరేషన్ లోన్లలో, మూడ ఎకరాల భూమిలో, దళితబంధు పథకంలో అన్నింటిలో తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించిన ముఖ్యమంత్రి మాలలను మాత్రం విస్మరించారని, వెంటనే నగరంలో మాల భవనం కోసం 5 ఎకరాల భూమి, 10 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నగరంలో భాగ్యరెడ్డి వర్మ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పాలన్నారు. సమావేశంలో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో నిమ్స్ వైద్యుల సత్తా



నీట్‌లో ర్యాంకులు సాధించిన యువ వైద్యులను అభినందిస్తున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు

- తొలి ర్యాంక్ సాధించిన డాక్టర్ సుబ్రహ్మణ్యం
- మరో పది మందికి ర్యాంకులు



తొలి ర్యాంక్ సాధించిన డాక్టర్ సుబ్రహ్మణ్యం

లక్డీకాపూల్: ఆల్ ఇండియా నీట్ ఎస్ఎస్- 2023 ప్రవేశ పరీక్షల్లో నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) యువ వైద్యులు సత్తా చాటారు. జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ సుబ్రహ్మణ్యం సూపర్ స్పెషాలిటీ (డీఎం) మెడికల్ కోర్సులో తొలి ర్యాంక్ సాధించారు. దాంతో వైద్య, విజ్ఞాన రంగాల్లో నిమ్స్ ఖ్యాతిని మరింత పెంచారు. ఈయనతో పాటు నీట్‌లో మరో పది మంది నిమ్స్ వైద్యులు ర్యాంకులు సాధించారు. వీరిలో డాక్టర్ శరత్‌చంద్ర గౌడ్ 15వ ర్యాంక్, డాక్టర్ అభిషేక్- 32, డాక్టర్ నవీన్ కుమార్- 35, డాక్టర్ భాను- 49, డాక్టర్ జాకీర్-870, డాక్టర్ కీర్తి- 58, డాక్టర్ అభిలాష్- 356, డాక్టర్ ఖలీల్- 559, డాక్టర్ సుగుణ-656, డాక్టర్ నందిత- 796, డాక్టర్ జాకీర్- 870, డాక్టర్ దినేష్ -1199 ర్యాంక్ కైవసం చేసుకున్నారు.

డైరెక్టర్ అభినందనలు...

ఆల్ ఇండియా ర్యాంక్‌తో పాటు మెరుగైన ఫలితాలు సాధించిన నిమ్స్ యువ వైద్యులను డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అభినందించారు. పరీక్షల సమయంలో యువ వైద్యులకు ఒత్తిడి లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ నావల్ చంద్ర, ప్రొఫెసర్ వైఎస్సాఎన్ రాజు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు, డాక్టర్ శెట్టి, డాక్టర్ స్వరూప, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో బతుకమ్మ వేడుకలు



రాష్ట్రపతి నిలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రసూల్‌పురా: 'ఒక్కేసి పువ్వేసి చందమామా.. చిత్తు చిత్తుల బొమ్మా శివుడి ముద్దుల గుమ్మ'... వంటి బతుకమ్మ పాటలతో రాష్ట్రపతి నిలయం మార్మోగింది. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా బతుకమ్మ పండుగను బొల్లారం రాష్ట్రపతి నిలయంలో బుధవారం ఘనంగా నిర్వ హించారు. రకరకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలను పేర్చి సాంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ ఆడి పాడి బతుకమ్మ విశిష్టతను వివరించారు. రాష్ట్రపతి నిలయం పరిపాలన అధికారి రజనీప్రియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో నీపీడ్ సంస్థకు చెందిన మేధో వైకల్యం గల పిల్లలు, లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్ అక్షరయాన్ అనే మహిళా రచయితల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబురాలు కనుల పండువగా జరిగాయి. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. సీతారామారావు, మహిళా విభాగం ఇన్‌ఛార్జి జి.మేరీ సునంద వేడుకలను ప్రారంభించారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మలు ఆడి, పాడి సందడి చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్యక్రమంలో డాక్టర్ రజిని, డాక్టర్ రాణి, రజిత మాధూరి, మంజుల, సులోచన, సుహాసిని, కామాక్షి పాల్గొన్నారు.



అంబేడ్కర్ వర్సిటీలో బతుకమ్మ సంబురాలు

నిరుద్యోగులను గాలికొదిలేసిన కేసీఆర్

హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: రాష్ట్రం వచ్చిన 9 సంవత్సరాల వరకు ఉద్యోగ నియామకాలు జరపాలన్న సోయిలేని ముఖ్యమంత్రి కేసీఆర్ 2023 ఎన్నికలు సమీపిస్తుండగానే హడావుడిగా నోటిఫికేషన్లు ఇచ్చి, ఒక్క పరీక్షను కూడా సక్రమంగా నిర్వహించలేదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జాగో తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో '30 లక్షల నిరుద్యోగుల జీవితాలను సర్వనాశనం చేస్తూ ప్రవల్లిక ఆత్మహత్యపై దుష్ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదింపుదాం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి ఇష్టమైన వారికే ఉద్యోగాలు ఇచ్చుకునేందుకు బయోమెట్రిక్ లేకుండా పరీక్షలు నిర్వహించారని ఆరోపించారు. తెలంగాణ రాగానే ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ తన ఇంటికి మాత్రం ఐదు ఉద్యోగాలు ఇచ్చుకుని నిరుద్యోగులను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే కేసీఆర్ నీది, మీ ఇంట్లోవారి ఉద్యోగాలు పోతాయి, అప్పుడు నీకు నిరుద్యోగుల ఆవేదన ఏంటో అర్థమౌతుందన్నారు. మిగిలిన పార్టీల వారు కూడా నిరుద్యోలుకు ఏ విధంగా భరోసా కల్పిస్తారో వివరించాలని డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ కార్యదర్శి గోవర్ధన్ మాట్లాడుతూ, ప్రవల్లిక తల్లి సోదరుడు మాట్లాడడం చూస్తుంటే వారిని ఎంతభయపెట్టారో అర్థమవుతుందన్నారు. వెంటనే వారి కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని, ప్రతీ అభ్యర్థికి మూడు లక్షలు ఇవ్వాలని, టీఎస్‌పీఎస్సీ బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య మాట్లాడుతూ... ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటే దానికి ప్రభుత్వం ప్రేమ వ్యవహారం తగిలించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. సమావేశంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా రమ, ప్రొఫెసర్ పద్మజాషా, నైనాల గోవర్ధన్, కృష్ణ ప్రసాద్, సోగరాబేగం, కృష్ణారావు, శివరామ్ రెడ్డి, ఇస్లామొద్దీన్ పాల్గొన్నారు.

ఆగయా... దాండియా

నేపథ్య సంగీతానికి అనుగుణంగా నాట్యమాడిన పాదాలకు చేతులు జతకూడాయి. అందమైన యువతీ యువకుల కేరింతలు నవరాత్రులకు సరికొత్త శోభను అద్దాయి. నగరానికి చెందిన హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ హాల్‌లో 'నవరాత్రి నవరంగ్' పేరుతో నిర్వహించిన దాండియా వేడుక ఉర్రూతలూగించింది. రంగు రంగుల డిజైనర్ దుస్తుల్లో మెరిసిపోయిన నగర యువతతో పాటు భిన్న రంగాల ప్రముఖులు ఈ ఈవెంట్‌లో సందడి చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో







దివ్యాంగులకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలి



పంజగుట్ట: రాష్ట్రంలో 20 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారని, వారి కుటుంబాలతో కలుపుకుంటే 80 లక్షల ఓటు బ్యాంక్ ఉందని, వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలని జాతీయ వికలాంగుల నెట్‌వర్క్ జాతీయ కన్వీనర్ అర్మాన్ అలీ డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ స్థాయిలో 25 వికలాంగుల సంఘాలతో కలిసి 'రాజ్యాధికారంలో వికలాంగుల సంపూర్ణ భాగస్వామ్యం' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులుతో కలిసి అర్మాన్ అలీ మాట్లాడుతూ .. 21 రకాల దివ్యాంగులు రాష్ట్రంలో మొత్తం 20 లక్షల మంది ఉన్నారని, వీరి కుటుంబాలతో కలిపితే ఓటింగ్ సుమారు 20 శాతం వరకు ఉంటుందన్నారు. కానీ రాజ్యాధికారంలో మాత్రం భాగస్వామ్యం లేకపోవడంతో తమ హక్కులను సాధించుకోలేకపోతున్నామన్నారు. వెంటనే పంచాయతీ, మున్సిపాలిటీ చట్టాలు సవరించి వికలాంగులకు స్థానిక సంస్థల్లో, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ వంటి పదవుల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ చైర్మన్లలో భాగస్వామ్యం కల్పించాలని, వికలాంగులకు ఎస్సీ, ఎస్టీల మాదిరిగా రక్షణ, నష్ట పరిహారం అందించాలని కోరారు.

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 52
» పోస్టుల వివరాలు: ఫిజియోథెరపిస్ట్-02, స్టాఫ్ నర్స్-24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్-08, మెడికల్ ఆఫీసర్-10, ఎల్‌జీఎస్-04, సపోర్టింగ్ స్టాఫ్-03, సెక్యూరిటీ గార్డ్-01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.10.2023.
» వెబ్‌సైట్: krishna.ap.gov.in

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 56
» పోస్టుల వివరాలు:ఫార్మసిస్ట్ గ్రేడ్2-02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2-02, రేడియోగ్రాఫర్-01, థియేటర్ అసిస్టెంట్-08, ల్యాబ్ అటెండెంట్-02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్-03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్ఎన్‌వో-28, ఆఫీస్ సబార్డినేట్-01, ప్లంబర్-05, ఎలక్ట్రీషియన్-01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్-01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 21.10.2023.
» వెబ్‌సైట్: ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత: బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» వేతనం: నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 28.10.2023.
» వెబ్‌సైట్: prakasam.ap.gov.in

విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» పోస్టుల వివరాలు: ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్-02, జనరల్ డ్యూటీ అటెండెంట్-05, ఆఫీస్ సబార్డినేట్-01.
» అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
» దరఖాస్తులకు చివరితేది: 25.10.2023.
» వెబ్‌సైట్: https://vizianagaram.ap.gov.in

జెన్‌కోలో.. ఏఈ జాబ్స్

టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 339 ఏఈ పోస్టులకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
» బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» డిసెంబర్ 3న రాత పరీక్ష
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం



తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్టులు

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-145 పోస్టులు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్- 42 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-74 పోస్టులు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-3 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)-జనరల్ రిక్రూట్‌మెంట్-25 పోస్టులు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)-జనరల్ రిక్రూట్‌మెంట్-1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-49 పోస్టులు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్టులు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

- ఏఈ(ఎలక్ట్రికల్): ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
- ఏఈ(మెకానికల్): మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఏఈ(ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18-44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600-రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్-ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్-బిలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమోదైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:అక్టోబర్ 29,2023
- రాత పరీక్ష తేదీ: డిసెంబర్ 3, 2023
- రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో.
- వెబ్‌సైట్: www.tsgenco.co.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్టులు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.

క్లుప్తంగా...

21న సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్!

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్‌తో పాటు లాభాల వాటా కింద వచ్చే మొత్తాన్ని ఈనెల 21న వారి ఖాతాల్లో యాజమాన్యం జమ చేయనుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో పండుగ అడ్వాన్స్, లాభాల వాటా జమను వాయిదా వేసిందని, అయితే యాజమాన్యాన్ని కలిసి చర్చించడంతో ఇప్పుడు విడుదల చేసేందుకు ముందుకొచ్చిందని ఆయన వెల్లడించారు. దసరా అడ్వాన్స్ రూ. 25 వేలతో పాటు ఈ ఆర్థిక ఏడాదిలో కంపెనీ సాధించిన రూ.2,222 కోట్ల నికర లాభాల్లో 32 శాతం రూ.711.18 కోట్లు కార్మికుల ఖాతాల్లో జమ కానుందని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో గుర్తింపు లేదు.. బీజేపీకి మద్దతు

సీఎం ఇలాఖాలో బీఆర్‌ఎస్ నేతల స్పష్టీకరణ



గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో అసమ్మతి నేతలు స్వరం పెంచారు. బీఆర్‌ఎస్ అధిష్టానం తీరుతో విసిగిపోయామని, ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ తరఫున ఈటల రాజేందర్ పోటీ చేస్తే మద్దతు ఇస్తామని కూడా ప్రకటించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో అసమ్మతి నేతలు టేకులపల్లి రాంరెడ్డి, పిడిచెడ్ వెంకటరెడ్డి, ములుగు మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, నాయకులు చెట్టి సురేష్ గౌడ్, పెద్దలుక మధుసూదన్‌రెడ్డి, కొన్నె రాజిరెడ్డితోపాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నేతలు పాల్గొన్నారు. తమను పట్టించుకోకపోతే తమదారి చూసుకుంటామని కూడా హెచ్చరికలు జారీ చేశారు.

కామారెడ్డి బీఆర్‌ఎస్‌లో అసమ్మతి!



కామారెడ్డి టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డి నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీలో అసమ్మతి చెలరేగింది. కామారెడ్డి బల్దియా పరిధిలో తమకు ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన చెందుతున్న పలువురు కౌన్సిలర్లు బుధవారం కలెక్టరేట్ సమీపంలోని ఓ గెస్ట్ హౌజ్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇద్దరు ముఖ్య నేతలు తమకు సమాచారం ఇవ్వకుండానే తమ వార్డుల్లో సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేశారని, డబ్బులు తీసుకుని గృహలక్ష్మి, ఇతర సంక్షేమ పథకాలను అనర్హులకు కట్టబెట్టారని వీరు ఆరోపిస్తున్నారు. దీంతో వీరంతా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

చోరీ నింద మోపారని..

మనస్తాపంతో యువతి ఆత్మహత్య



జహీరాబాద్: తనపై దొంగతనం నింద వేశారన్న మనస్తాపంతో ఒక యువతి ఆత్మహత్యకు పాల్పడింది. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం నాగిశెట్టి తండాలో బుధవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. తండాకు చెందిన బాబిబాయి, యశ్వంత్ దంపతుల కుమార్తె లక్ష్మీబాయి (20). పొరుగు వారి ఇంట్లో నగదు కనిపించకపోవడంతో లక్ష్మీబాయి డబ్బు తీసి ఉంటుందని వారు అనుమానం వ్యక్తం చేశారు. చేయని నేరానికి తనపై నింద మోపారని లక్ష్మీబాయి మనస్తాపానికి గురైంది. దీంతో సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇటీవలే కర్ణాటకకు చెందిన యువకునితో నిశ్చితార్థం జరిగింది. దీపావళి తర్వాత వివాహం జరిపించాలని నిర్ణయించారు.

ఖరగ్‌పూర్ ఐఐటీలో మెదక్ విద్యార్థి ఆత్మహత్య



చేగుంట (తూప్రాన్): ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ చదువుతున్న మెదక్ జిల్లాకు చెందిన ఓ విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చేగుంట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామం సాజుతండాకు చెందిన కేతావత్ చందర్ రెండో కుమారుడు కిరణ్ చంద్ర (21) ఐఐటీలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాగా, కిరణ్ 15 రోజుల క్రితం అనారోగ్యం కారణంగా ఇంటికి రాగా మూత్రపిండాల్లో రాళ్లు ఉన్నాయని శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. తిరిగి ఖరగ్‌పూర్ వెళ్లి రోజూ తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడు తుండేవాడు. రెండ్రోజులుగా కిరణ్‌నుంచి ఫోన్ రాకపోగా, మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం వచ్చింది. కుటుంబసభ్యులు ఖరగ్‌పూర్ వెళ్లి మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు.

ఒకే రోజు రూ.35 కోట్లు జప్తు

- భారీగా పట్టుబడిన నగదు, మద్యం, ఇతర ప్రలోభాలు
- ఇప్పటికి రూ. 165.81 కోట్లకు చేరిన స్వాధీనాల విలువ
- గత ఎన్నికల్లో పట్టుబడిన నగదు రూ. 97 కోట్లు మాత్రమే
- సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి



అధికారులు స్వాధీనం చేసుకున్న చీరల లోడ్ లారీ..



కోమల్ల టోల్‌ప్లాజా వద్ద రూ. 1.37 కోట్లు సీజ్ చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్, సికింద్రాబాద్, నిజాంపేట్, రఘునాథపల్లి: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జరిపిన తనిఖీల్లో బుధవారం ఒకే రోజు రికార్డు స్థాయిలో మొత్తం రూ.35.52 కోట్ల విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను జప్తు చేశారు. దీంతో బుధవారం నాటికి రాష్ట్రంలో జప్తు చేసిన నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.165.81 కోట్లకు పెరిగిపోయింది. బుధవారం రూ.6.25 కోట్ల నగదును జప్తు చేయగా, మొత్తం స్వాధీనం చేసుకున్న నగదు రూ.77.87 కోట్లకు పెరిగింది. 7వ తేదీ నుంచి నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.8.99 కోట్లు విలువ చేసే 59,091 లీటర్ల మద్యం, 18,088 కిలోల నల్లబెల్లం జప్తు చేశారు.

రూ.3 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

బుధవారం రూ.3 కోట్లు విలువ చేసే 1,086 కేజీల గంజాయిని పట్టుకోగా, ఇప్పటి వరకు జప్తు చేసిన మొత్తం గంజాయి విలువ రూ.7.55 కోట్లకు పెరిగింది. కాగా ఇప్పటి వరకు జప్తు చేసిన మొత్తం బంగారం, ఇతర ఖరీదైన లోహాల విలువ రూ.62.73 కోట్లకు చేరింది. బుధవారం రూ.2.3 కోట్లు విలువ చేసే ల్యాప్‌టాప్‌లు, కుక్కర్లు, వాహనాలను జప్తు చేయగా, ఇప్పటివరకు జప్తు చేసిన ఇలాంటి వస్తువుల మొత్తం విలువ రూ.8.64 కోట్లకు చేరింది. దీంతో జప్తు చేసిన మొత్తం నగదు, ఇతర వస్తువుల విలువ రూ.165.81 కోట్లకు చేరినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, 2018లో జరిగిన రాష్ట్ర శాసనసభ సాధాణ ఎన్నికల్లో మొత్తం రూ.97 కోట్ల నగదు, రూ.34 కోట్లు విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు వికాస్‌రాజ్ తెలిపారు.

గిఫ్ట్ ఆర్టికల్స్, బెడ్‌షీట్స్ స్వాధీనం

హైదరాబాద్ దక్కన్, దానాపూర్-సికింద్రాబాద్ రైళ్లలో పార్శిల్ సర్వీసు ద్వారా సికింద్రాబాద్‌కు చేరుకున్న 30 భారీ కాటన్ పార్శిళ్ల స్టెయిన్‌లెస్ స్టీల్ గిఫ్ట్ ఆర్టికల్స్, బెడ్‌షీట్లను రైల్వేపోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. 26 కాటన్ పార్శిళ్లల్లో రూ.1.29 కోట్ల విలువ చేసే 2,160 కిలోల స్టెయిన్ లెస్ స్టీల్ ఆర్టికల్స్, మరో నాలుగు కాటన్ పార్శిళ్లల్లో రూ.78 వేల విలుచేసే దుప్పట్లు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మరో కేసులో సికింద్రాబాద్ జనరల్ బజార్‌కు చెందిన కిషోర్‌సింగ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని నుంచి 538 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

రూ. 2.25 కోట్ల విలువైన చీరల పట్టివేత

బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ప్రగతినగర్‌లోని పంచవటి అపార్ట్‌మెంట్ ఆవరణలో ఉన్న ఏపీ 16టీవీ 3280 నంబరు గల లారీలో సరుకును పరిశీలించగా భారీ మొత్తంలో చీరలు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ.2,25,98,500 ఉంటుందని అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి పంచవటి అపార్ట్‌మెంట్‌లో ఓ రాజకీయ పార్టీ సమావేశం జరిగిందని పోలీసుల విచారణలో తేలింది.

రూ.1.37 కోట్ల బ్యాంక్ డబ్బు సీజ్

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని కోమల్ల టోల్ ప్లాజా వద్ద క్యూ ఆర్ కోడ్ సరిగా లేని బ్యాంకు నగదు రూ.1,37,50,000ను పోలీసులు సీజ్ చేశారు.

కేంద్ర గెజిట్ ఆధారంగానే విచారించాలి

సెక్షన్ 89 కింద విచారణ ఇక అసమంజసం

- కృష్ణా ట్రిబ్యునల్–2కి స్పష్టం చేసిన తెలంగాణ
- గెజిట్‌పై అధ్యయనానికి సమయం కోరిన ఏపీ
- తదుపరి విచారణ నవంబర్ 22, 23కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పంపిణీ చేసేందుకు వీలు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 6న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగానే ఇకపై కృష్ణా ట్రిబ్యునల్–2 విచారణ కొనసాగించాలని తెలంగాణ స్పష్టం చేసింది. ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్ 89లోని మార్గదర్శకాల ఆధారంగా రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకాలు జరిపేందుకు 2016 అక్టోబర్ నుంచి కృష్ణా ట్రిబ్యునల్–2 విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. అయితే కేంద్రం ఇటీవల అదనపు మార్గదర్శకాలతో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో ఇకపై పాత మార్గదర్శకాల (సెక్షన్ 89) ఆధారంగా విచారణను కొనసాగించడం సమంజసం కాదని తెలంగాణ పేర్కొంది. కాగా బుధవారం ఢిల్లీలో సమావేశమైన జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ఇరు పక్షాల వాదనలకు అవకాశం ఇచ్చింది. కొత్త గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం తక్షణమే విచారణను ప్రారంభించాలని తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ సూచించారు. కొత్త గెజిట్‌పై ఏపీ తమ స్టేట్‌మెంట్‌ను ట్రిబ్యునల్‌కు సమర్పించవచ్చని, విచారణను మాత్రం వాయిదా వేయరాదని కోరారు.

అధ్యయనానంతరమే వాదనలు: ఏపీ

గెజిట్ నోటిఫికేషన్‌కు ఉన్న చట్టబద్ధత, దాని ప్రభావాలపై అధ్యయనం చేసేందుకు కొంత సమయం కేటాయించాలని, అధ్యయనం జరిపిన తర్వాతే తమ వాదనలు వినిపించగలమని ఏపీ న్యాయవాది జయదీప్ గుప్తా చెప్పారు. అప్పటివరకు విచారణను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు వేసిన విషయాన్ని కూడా ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు 80 టీఎంసీలను తరలిస్తే, ప్రతిగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవచ్చని గోదావరి ట్రిబ్యునల్ వెసులుబాటు కల్పించింది. ఆ నీళ్లను సైతం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసే బాధ్యతను కృష్ణా ట్రిబ్యునల్–2కు కేంద్రం అప్పగించడంపై ఆయన అభ్యంతరం తెలిపారు. అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశం మినిట్స్‌ను ఉటంకిస్తూ ఈ నీళ్ల కేటాయింపులను గోదావరి ట్రిబ్యునల్ చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ తదుపరి విచారణను నవంబర్ 22, 23వ తేదీలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గెజిట్ నోటిఫికేషన్‌కు ఉన్న చట్టబద్ధత, దాని ప్రభావాలపై తెలంగాణకు నవంబర్ 15లోగా, ట్రిబ్యునల్‌కు నవంబర్ 20లోగా తమ స్పందనను సమర్పించాలని ఏపీని ఆదేశించింది.

త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి



రాష్ట్రపతి భవన్ ప్రకటన

- నాలుగు దశాబ్దాలకుపైగా బీజేపీనే నమ్ముకున్నందుకు గుర్తింపు
- నియామకం ఎంతో సంతోషాన్ని కలిగించింది: 'సాక్షి'తో ఇంద్రసేనారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ /హైదరాబాద్: బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డిని త్రిపుర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. త్రిపుర, ఒడిశా రాష్ట్రాలకు నూతన గవర్నర్‌లను రాష్ట్రపతి నియమించినట్లు రాష్ట్రపతి భవన్ బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి, ఒడిశా గవర్నర్‌గా జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు రఘుబర్‌దాస్‌ను నియమించారు.

బీజేపీతో 40 ఏళ్లకు పైగా అనుబంధం

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం, గానుగబండ గ్రామంలో జన్మించిన నల్లు ఇంద్రసేనారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన మలక్‌పేట్ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1972లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ, 1975లో కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పూర్తిచేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి ఉన్న ఇంద్రసేనారెడ్డి 1980లో భారతీయ జనతా పార్టీలో చేరారు. 43 ఏళ్లుగా అదే పార్టీలో కొనసాగుతున్నారు. బీజేపీ తరఫున 1983, 1985, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో మలక్‌పేట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ మొత్తం ఆరు సార్లు లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయారు. కాగా, 1999లో పార్టీ తరఫున గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలకు బీజేఎల్పీ నేతగా ఉన్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రపార్టీ తరఫున నేతల మధ్య సమన్వయం, వివిధ కమిటీల పర్యవేక్షణ వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బీజేపీ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటూ... పార్టీనాయకులు, కార్యకర్తలను కలుసుకుని సమన్వయం చేస్తున్నారు.

పీఎంవో నుంచే సమాచారం

నియామకానికి సంబంధించి బుధవారం ఉదయమే ఆయనకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) నుంచి సమాచారం అందినట్టు తెలుస్తోంది. మోదీ, అమిత్ షా, నడ్డాలతో కూడిన బీజేపీ అగ్రనాయకత్వం ... పార్టీ కోసం కట్టుబడి పనిచేసిన తెలంగాణకు చెందిన పార్టీ నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించడంలో భాగంగా ఈ నియామకం జరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా తనను గవర్నర్‌గా నియమించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని సాక్షితో ఇంద్రసేనారెడ్డి చెప్పా రు. అధికారికంగా ఉత్తర్వులు చేతికందాక బాధ్య తలు ఎప్పుడు తీసుకోవాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రధాని మోదీకి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

15 నుంచి ఏపీలో సమగ్ర కులగణన

బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీనివాస వేణుగోపాల కృష్ణ

సాక్షి, అమరావతి: వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్రంలో నవంబర్ 15 నుంచి సమగ్ర కులగణనకు శ్రీకారం చుడుతున్నట్టు బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తెలియజేశారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కుల గణన ద్వారా ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ వర్గాలను సైతం గురిస్తామన్నారు. అనంతరం వారి అభ్యున్నతి కోసం వివిధ కులాలకు చెందిన కార్పొరేషన్ల ద్వారా తగిన పథకాలు రూపొందించి అమలు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి పదేళ్లకు ఒక సారి జరిగే జనగణనతో పాటు సమగ్ర కులగణన జరిపించాలని గత బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినా ఇప్పటి వరకు సమాధానం రాలేదన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అధికారాలకు అనుగుణంగా ఏపీలో కులగణన చేయించాలని ఇటీవల శాసన సభ సమావేశాల్లో తీర్మానించినట్లు మంత్రి చెప్పారు. ఇందుకు అనుగుణంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గ్రామ, వార్డు సచివాలయ శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులతో ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ నేతృత్వంలో గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల సహకారంతో ప్రత్యేక యాప్ ద్వారా కులగణన ప్రారంభిస్తున్నట్టు వివరించారు. బీసీ నాయకుల సూచనలు, సలహాల కోసం ప్రాంతాల వారీగా విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, తిరుపతిలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. వ్యక్తిగతంగా సలహాలు, సూచనల ఇచ్చేవారి కోసం ప్రత్యేక ఈ–మెయిల్ ఐడీ అందుబాటులో పెడతామన్నారు.

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM,
(WOMEN'S UNIVERSITY)
TIRUPATI-517502, Andhra Pradesh
21st CONVOCATION
No. SPMVV/Exams/21st Convocation/B14/2023 Dated: 18.10.2023
The 21st Annual Convocation of Sri Padmavati Mahila Visvavidyalayam to confer Degrees and Diplomas either 'IN PERSON' or 'IN ABSENTIA' is proposed to be held in the month of February, 2024. For applications and other details please visit the website www.spmvv.ac.in
REGISTRAR

MSME TECHNOLOGY DEVELOPMENT CENTRE (PPDC)
Process & Product Development Centre, Agra
An Autonomous body under ministry of MSME, Govt. of India Society
EC-Ettumanoor- Organizes 02 Days offline training on
GOLD APPRAISER
Date: 21st & 22nd Oct2023
Timing: 10 AM - 04 PM
Fees: 6500/- (Incl. of GST)
COURSE DETAILS: • Rules to be followed by Gold jewellery appraiser • Method of detecting impurities in gold • Method of judging the quality of gold • Basic Metallurgy • Method of giving credit to gold jewellery, stone jewellery according to their nature • Method of judging quality by touch stone • Job opportunity and start a business in jewellery shops • This training will help you to work as gold jewelery appraiser in banking and financial institutions and buy quality jewellery
VENUE: COHORT Coworking MR Prime, Kondapur, Whitefields, Opp.Sharat City Mall, Gachibowli, Hyderabad- 500081
For more details:
6363055419 / 9626516812 / 9750747571
Website: www.ppdcagra.dcmsme.gov.in
CERTIFICATION WILL BE AWARDED

దసరా తర్వాత ఉన్నత విద్య తరగతులు

రాష్ట్ర మండళ్లకు యూజీసీ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలను ఈనెల 30వ తేదీకల్లా పూర్తి చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఉన్నత విద్యా మండళ్లకు సూచించింది. దసరా తర్వాత నుంచి డిగ్రీ, పోస్టు–గ్రాడ్యుయేషన్ కోర్సులకు సంబంధించిన క్లాసులు ప్రారంభించాలని ఆదేశించింది. సాంకేతిక విద్యకు సంబంధించిన కాలేజీల్లోనూ అన్ని రకాల అనుమతులు, ప్రవేశాలను ఇదే సమయంలో పూర్తి చేయాలని పేర్కొంది. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు తాజాగా జారీచేసింది. ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్లను ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ ఆధారంగా భర్తీ చేస్తారు. ఇలా భర్తీ చేసిన అభ్యర్థుల వివరాలను మండలి పరిశీలించి, అనుమతిస్తుంది. ర్యాటిఫికేషన్ ప్రక్రియలోనూ ప్రతి సంవత్సరం జాప్యం జరుగుతోంది. ఈసారి దీన్ని కూడా అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఆదేశించింది. తెలంగాణలో ర్యాటిఫికేషన్ ప్రక్రియ ఇప్పటికీ మొదలు కాలేదు. నవంబర్ నెలలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరింత ఆలస్యమవడం అనివార్యమని అధికారులు చెబుతున్నారు. ఇలా జరిగినప్పుడు ఈ విషయాన్ని ఏఐసీటీఈకి తెలియజేయాల్సి ఉంటుంది. ఇక దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ఈనెల మొదటి వారం కూడా నడిచింది. సాంకేతికంగా ఇప్పటికే డిగ్రీ అడ్మిషన్లు పూర్తయినట్లేనని అధికారులు అంటున్నారు. పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. యూజీసీ ఆదేశాల మేరకు ఈ నెలాఖరుకు పూర్తి చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

24న విజయ దశమి సాధారణ సెలవు

ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: విజయదశమి(తిథి ద్వయం) పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 24వ తేదీ మంగళవారం సాధారణ సెలవు దినంగా ఏపీ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో 23వ తేదీ సాధారణ సెలవుగా ప్రకటించారు. ఇది యథావిధిగా కొనసాగుతుంది. ఈనెల 24వ తేదీని ఐచ్ఛిక సెలవుగా ప్రకటించగా విజయదశమి (తిథి ద్వయం) పురస్కరించుకుని, ఐచ్ఛిక సెలవుకు బదులుగా సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏఎన్నార్ కుమార్తె నాగ సరోజ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: దివంగత నటుడు అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) కుమార్తె, టాలీవుడ్ నటుడు నాగార్జున సోదరి నాగ సరోజ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. దీంతో అక్కినేని వారి ఇంట విషాదం నెలకొంది. ఏఎన్నార్‌కు సత్యవతి, నాగ సుశీల, నాగ సరోజ, వెంకట్, నాగార్జున.. ఇలా ఐదుగురు సంతానం. వారిలో సత్యవతి చాలా ఏళ్ల క్రితమే మరణించగా, ఇప్పుడు నాగ సరోజ మృతి చెందారు. స్టార్ హీరో కుమార్తె అయినప్పటికీ చిత్రపరిశ్రమకు దూరంగా ఉంటూ చాలా సాధారణ జీవితాన్ని గడిపారు.

గ్రూప్–1పై అప్పీలుకు వెళ్లేదెప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉద్యోగాలకు మొత్తంగా 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో గతేడాది అక్టోబర్ 16న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ ఫలితాలు ప్రకటిస్తూ... 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి జాబితాను విడుదల చేసింది. దీంతో ఆయా అభ్యర్థులంతా మెయిన్ పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో టీఎస్‌పీఎస్సీలో పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారం వెలుగు చూసింది. గ్రూప్–1 పరీక్ష పేపర్ లీకు కావడంతో ఆగమేఘాల మీద అక్టోబర్ 16న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షను కమిషన్ రద్దు చేసింది. ఆ తర్వాత జూన్ 11న మరోమారు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రకటించడంతో అభ్యర్థులు మళ్లీ సన్నద్ధమయ్యారు. రెండో దఫా పరీక్షకు 3,09,323 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోగా... 2,33,248 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. రెండో దఫా పరీక్ష నిర్వహణలో టీఎస్‌పీఎస్సీ పకడ్బందీగా నిర్వహించలేదని అభ్యర్థులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా అభ్యర్థుల వేలిముద్రలు తీసుకోకుండా ఇష్టానుసారంగా నిర్వహించారని, పరీక్ష హాజరు శాతంలో గణాంకాలు మారిపోయాయంటూ ఆరోపించారు. కేసును విచారించిన హైకోర్టు రెండు సార్లు పరీక్ష రద్దు చేయాలని తీర్పునిచ్చింది.

ఇప్పుడు ఏ పరీక్షకు సిద్ధం కావాలో?

సాధారంగా కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఆ తీర్పును అమలు చేయడం లేదా పై కోర్టును ఆశ్రయించడం జరుగుతుంది. కానీ టీఎస్‌పీఎస్సీ ఇప్పటివరకు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించలేదు. దాదాపు ఏడాదిన్నరగా పరీక్షలకు సన్నద్ధమైన అభ్యర్థులకు తక్షణ కర్తవ్యం ఏమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమినరీ పరీక్షలకు సన్నద్ధం కాగా... ఇప్పుడు ఏ పరీక్షకు సిద్ధం కావాలో పాలుపోవడం లేదంటూ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ప్రక్రియ కొనసాగుతోందట!

కాగా, హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని టీఎస్‌పీఎస్సీని వివరణ కోరగా... సుప్రీంకోర్టుకు వెళ్తామని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతుందని కమిషన్ అధికారులు చెబుతున్నారు.

आज़ादी का अमृत महोत्सव
G20 भारत 2023 INDIA
भारत सरकार
कारपोरेट कार्य मंत्रालय
त्वरित कॉर्पोरेट समापन प्रसंस्करण केंद्र (सी-पेस), आई.आई.सी.ए. बिल्डिंग, 7वीं मंज़िल, प्लाट P-6,7,8, से.-5, आई.एम.टी. मानेसर, गुडगाँव, हरियाणा - 122050.
Email: roc.cpace@mca.gov.in
सत्यमेव जयते
భారత ప్రభుత్వం
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (C-PACE)
IICA బిల్డింగ్, 7వ అంతస్తు,
ప్లాట్ పి-6, 7, 8, సెక్టార్-5, IMT మనేసర్,
గుర్గావ్, హర్యానా - 122050
ఇ-మెయిల్: roc.cpace@mca.gov.in

ఫారం నం. STK-6
బహిరంగ ప్రకటన
[కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248లోని ఉప-సెక్షన్ (2) మరియు ఉప-సెక్షన్ (4) మరియు కంపెనీలు (కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్లు తొలగింపు) రూల్స్, 2016లోని రూల్ 7కు అనుగుణంగా]
బహిరంగ ప్రకటన నం. ROC/C-PACE/STK-6/2023/07/405 తేది: 04.10.2023
నిర్దేశం:
(1) దిగువ పేర్కొన్న కంపెనీలకు సంబంధించి కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 క్రింద హైదరాబాద్ రాష్ట్రంలోని 15 (పదిహేను) కంపెనీల పేర్లు కొట్టివేయడం లేదా తొలగింపు విషయంలో:

క్ర.సం.	పని ఐటం	CIN	కంపెనీ పేరు
1	AA3965363	U74994TG2019PTC129776	UNIT SCRAP PRIVATE LIMITED
2	AA4109511	U74999TG2018PTC121808	SINERGON HR SERVICES PRIVATE LIMITED
3	AA4107176	U40101TG1996PTC025724	NAV ENERGY PRIVATE LIMITED
4	AA3976865	U45400TG2008PTC059499	SUNTEK CITY MEADOWS PRIVATE LIMITED
5	AA2371352	U74900TG2010PTC069862	KARAT FACILITIES MANAGEMENT SERVICES PRIVATE LIMITED
6	AA3892645	U33111TG2012PTC083344	ONMASK LIFE SCIENCES PRIVATE LIMITED
7	AA4285885	U72200TG2015PTC102184	PRAVTEK SOLUTIONS PRIVATE LIMITED
8	AA3430820	U74999TG2020PTC142532	LEXAR ENERGETICS PRIVATE LIMITED
9	AA3316460	U24230TG2021PTC151712	GENCO OLIVE OIL PRIVATE LIMITED
10	AA3950333	U15400TG2021PTC154310	ASYA HOSPITALITY PRIVATE LIMITED
11	AA4516755	U22219TG2021PTC155736	L'ORANGER MEDIA PRIVATE LIMITED
12	AA4385775	U51909TG2021PTC156145	BIGPLUS COMPUTER PRIVATE LIMITED
13	AA4019422	U51909TG2022PTC164353	CORE OVERSEAS PRIVATE LIMITED
14	AA3662763	U72900TG2022PTC167377	EVOLUTE 365 TECHNOLOGIES INDIA PRIVATE LIMITED
15	AA4257120	U20119TS2023PTC174496	ZWITTOR MANUFACTURING PRIVATE LIMITED

(2) పైన పేర్కొన్న కంపెనీలు ప్రారంభమైన ఒక సంవత్సరంలోగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించడంలో విఫలమయ్యారు లేదా రెండు ఆర్థిక సంవత్సరాలకు ముందు కాలవ్యవధిలోగా సదరు కంపెనీ(లు) ఏవేని వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా మరియు ఎటువంటి దరఖాస్తులు చేయని కారణంగా కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 455 క్రింద నిద్రాణ స్థితిలో ఉన్న కంపెనీ స్థితిని పొందడం కోసం లేదా మెమోరాండంకు నిద్రాణ కంపెనీల కంపెనీ / సభ్యుల స్థాయిని పొందిన కంపెనీ(లు) కంపెనీ ప్రారంభ సమయంలో చెల్లించడానికి చేపట్టిన సభ్యత్వం చెల్లించని కారణంగా మరియు సెక్షన్ 10ఎ/లోని ఉప-సెక్షన్ (1) క్రింద కంపెనీ ప్రారంభం నుండి 180 రోజులలోగా ఈ ప్రభావానికి సంబంధించి డిక్లరేషన్ దాఖలు చేయని కారణంగా సెక్షన్ 12లోని ఉప-సెక్షన్ (9) క్రింద భౌతిక పరిశీలన తరువాత వెల్లడైనందున ఎటువంటి వ్యాపార కార్యకలాపాలు లేదా నిర్వహణ చేయని కారణంగా తమ / వారి రిజిస్ట్రేషన్‌ను కంపెనీలుగా కొనసాగించడానికి ఇష్టం లేనివారు కంపెనీల నమోదు నుండి తమ / వారి పేర్లను తొలగించడానికి / కొట్టివేయడానికి అభ్యర్థించారు మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 248 (2) క్రింద కంపెనీల నమోదు నుండి తమ / వారి పేరు(ల) తొలగింపు కోసం పైన పేర్కొన్న కంపెనీల నుండి రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ దరఖాస్తులు స్వీకరించారని ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
(3) తదనుగుణంగా, పైన పేర్కొన్న కంపెనీ పేర్లను కంపెనీల నమోదు నుండి తొలగించడానికి లేదా కొట్టివేయడానికి కంపెనీల రిజిస్ట్రార్ ప్రతిపాదిస్తున్నారు.
(4) కంపెనీల నమోదు నుండి కంపెనీల పేర్ల తొలగింపు లేదా కొట్టివేయడం ప్రతిపాదనకు అభ్యంతరం తెలిపే ఎవరేని వ్యక్తి అతని లేదా ఆమె అభ్యంతరాన్ని ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ముప్పై రోజులలోగా పైన తెలిపిన కార్యాలయ చిరునామాకు పంపగలరు.
(హరిహర సాహూ)
రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్
సెంటర్ ఫర్ ప్రాసెసింగ్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్
cbc 07123/11/0134/2324

క్లుప్తంగా...

కేసీఆర్ చేతుల మీదుగా మరో ఆరుగురికి బీఫారం


బీ ఫారం అందుకుంటున్న గంగుల

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా ఖరారైన మరో ఆరుగురు అభ్యర్థులకు ముఖ్యమంత్రి కేసీఆర్ బీఫారం అందజేశారు. కరీంనగర్ అభ్యర్థి మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు ఎల్.బి.నగర్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, వేములవాడ అభ్యర్థి చల్మడ లక్ష్మీనరసింహారావు, ఉప్పల్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్, మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా బీఫారంతో పాటు రూ.40 లక్షల చెక్కుతో కూడిన సీల్డ్ కవర్‌ను సీఎం వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలను కేసీఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారు

కాంగ్రెస్ నేత కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ ద్వారా రాష్ట్ర రైతాంగానికి ఎదురవుతున్న సమస్యలను ఎత్తి చూపిన కాంగ్రెస్ పార్టీపై సీఎం కేసీఆర్ అభాండాలు వేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ద్వారా రాష్ట్ర ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము ధరణిని రద్దు చేసి అంతకంటే మెరుగైన వ్యవస్థను తీసుకువస్తామని చెప్పామని, ఈ పోర్టల్‌ను ప్రైవేటు కంపెనీకి అప్పగించడం వల్లే సమస్యలు వస్తున్నాయని, ఆ విధానంలో మార్పు తీసుకువస్తామని డిక్లరేషన్‌లో ప్రకటించామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో టైటిల్ గ్యారంటీ చట్టం తెచ్చి ఆ రాష్ట్ర ప్రజలకు మేలు చేశారని, కేసీఆర్ తెలంగాణలో టైటిల్ గ్యారంటీ చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు.


బీఆర్ఎస్ మేనిఫెస్టోలో బీసీల ఊసేలేదు: జాజుల



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో బీసీల ఊసేలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. బీసీలకు చట్టసభలు, రిజర్వేషన్లు, బీసీల సమగ్ర కుటుంబ సర్వే, బీసీ రిజర్వేషన్ల పెంపు అనే విషయాలను మేనిఫెస్టోలో చేర్చకపోవడం అన్యాయమన్నారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెజార్టీ ప్రజలకు సంబంధించిన ఆకాంక్షలను, విధానాలను మేనిఫెస్టోలో పొందుపరచకపోవడం దురదృష్టకరమని జాజుల మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ 55 స్థానాల్లో బీసీలకు కేవలం 12 స్థానాలు కేటాయించి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బీసీ కులగణన, మహిళా బిల్లు, బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పిస్తామంటూ కాంగ్రెస్ అధినేత రాహుల్ మాట్లాడుతుంటే.. మరో పక్క ఇక్కడి కాంగ్రెస్ రెడ్డి నేతల తీరు విరుద్ధంగా ఉందన్నారు.

టికెట్ దక్కని కాంగ్రెస్ నేతలు టచ్‌లోకి..

వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి రాంరెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ దక్కని ఆ పార్టీ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్టా రాంరెడ్డి తెలిపారు. తమ పార్టీ నుంచి పోటీ చేసేందుకు వైఎస్సార్‌టీపీ నాయకులే కాకుండా ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు కూడా ఆసక్తి చూపుతున్నారన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, నాయకుడు మహమూద్ అలీతో కలిసి మాట్లాడారు. ఇప్పటికే ఇతర పార్టీల నుంచి 50 మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 4 రోజులుగా 377 దరఖాస్తులు అందాయని, ఒక్క ఎల్బీనగర్ స్థానానికి పది మంది పోటీ పడుతున్నారని తెలిపారు. తమ నాయకురాలి తొలి సంతకం ఉద్యోగ కేలండర్‌పైనే ఉంటుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత వైఎస్సార్‌టీపీలో చేరే అంశంపై త్వరలోనే తన నిర్ణయం చెబుతానన్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలం రమేశ్ పేర్కొన్నారు.

తెలంగాణ రాజ్య సమితికి గ్యాస్ సిలిండర్ గుర్తు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా నమోదైన తెలంగాణ రాజ్య సమితి పార్టీకి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గ్యాస్ సిలిండర్ గుర్తు కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 119 నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్టు పార్టీ విజ్ఞప్తి చేయడంతో.. ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీ పేరును భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చిన తర్వాత .. తెలంగాణ రాజ్య సమితి అనే పేరుతో కొత్త పార్టీ నమోదైంది. ఈ పార్టీ సంక్షిప్త నామం సైతం టీఆర్ఎస్ కావడం గమనార్హం.


బుధవారం జడ్చర్లలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో లక్ష్మారెడ్డి. సభకు భారీగా హాజరైన ప్రజలు

వాళ్లొస్తే కాటగలుస్తం!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రసంగించారు. ఆ అంశాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ పార్టీ నిన్నగాక మొన్న కర్ణాటకలో గెలిచింది. 20 గంటలు ఉచిత కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చింది. ఏమైంది? కర్ణాటక ముఖ్యమంత్రి ఐదు గంటల కరెంటు ఇస్తామంటున్నారు. పొద్దున సగం, రాత్రి సగమని చెప్తున్నారు. ఉచిత కరెంటు ప్రధాన మంత్రికి సైతం చేతకావడం లేదు. ఆయన సొంత రాష్ట్రంలోనూ కరెంట్ లేదు. రైతులు రోడ్ల మీద నిరసనలు చేస్తున్నారు. దేశం మొత్తంలో రైతాంగానికి 24 గంటలు కరెంట్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. కాళేశ్వరం పూర్తి చేసుకున్నాం. సీతారామ పూర్తవుతోంది. మంచినీళ్ల బాధ కూడా పోయింది. తలసరి ఆదాయంలో, విద్యుత్ వినియోగంలో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. కుల మతాలకు అతీతంగా పేదలందరినీ ఆదుకుంటున్నాం. ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుంది. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలి. అలాంటిది కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ కరెంట్ బాధలు వస్తాయి, పరిశ్రమలు దెబ్బతింటాయి.

ఇక్కడి బాధలు చూసి పాట రాశా..

ఒకనాడు జయశంకర్ సార్, నేను నారాయణపేట ప్రాంతం పోయి హైదరాబాద్ వెళ్లడానికి నవాబ్‌పేట అడవి గుండా వస్తున్నాం. అమ్మవారి గుడి ఉంది అక్కడ. పక్కన చిన్న అడవిలో ఉన్న ఆ దేవాలయం దగ్గర లైట్ల వెలుగు అంత దూరం కనిపించింది. మహబూబ్‌నగర్‌లో మనుషులే కాదు.. చివరికి అడవి కూడా బక్కపడిందని బాధపడ్డాం. మహబూబ్‌నగర్‌లో గంజి, అంబలి కేంద్రాలు పెడుతుంటే గుండెలవిసేలా బాధకలిగేది. పక్కనే కృష్ణానది పారుతున్నా ఎందుకీ దుర్గతి? ఆ బాధలు చూసి ''పక్కన కృష్ణమ్మ ఉన్నా ఫలితమేమి లేకపాయె.. పాలమూరు, నల్లగొండ, ఖమ్మం ఎట్లా పంటలు ఎండిపాయె..'' అంటూ పాట రాశా. మహబూబ్‌నగర్ దరిద్రం పోవాలంటే పాలమూరు నుంచి ఎంపీగా పోటీ చేయాలని, ప్రజలు గెలిపిస్తారని జయశంకర్ సార్ చెప్పారు. ఇదే జిల్లా నుంచి పోటీ చేశా. ఆనాడు నన్ను గెలిపించినది లక్ష్మారెడ్డిగారే. 15 ఏళ్ల పోరాటం చేసినప్పటికీ మహబూబ్‌నగర్ ఎంపీగా ఉంటూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కీర్తి నిలిచిపోయింది.

దద్దమ్మ ఎమ్మెల్యేలు అడగక నష్టపోయాం

ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరులోని దద్దమ్మ ఎమ్మెల్యేలు నోరు తెరవక, అడగలేక నష్టపర్చారు. అడిగేవారు లేక నాటి పాలకులు జూరాల నుంచి పాలమూరుకు నీళ్లు తీసుకోవాలని సోర్స్ ఇచ్చారు. జూరాల బెత్తెడు ప్రాజెక్టు.. అందులో ఉండే నీళ్లు 9–10 టీఎంసీలే. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా మనం రోజుకు రెండు టీఎంసీలు తీసుకోవాల్సి ఉంది. ఆ లెక్కన జూరాలలో నీళ్లు మూడ్నాలుగు రోజుల్లో అయిపోతాయి. అందుకే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు శ్రీశైలంను సోర్సుగా ఎంపిక చేశాం. ఆ ప్రాజెక్టు ఎవరి జాగీరు కాదు. రైతుల బాధలు తీర్చేందుకు ప్రాజెక్టుకు నేనే డిజైన్ చేశా. కానీ ఇక్కడి దద్దమ్మ కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి పాలమూరు ప్రాజెక్టును ఆపాలని చూశారు. ప్రాజెక్టు పూర్తయితే బీఆర్ఎస్‌కు పేరొస్తుందని కుట్రలు చేశారు. అయినా మొండిపట్టుతో రిజర్వాయర్లు, టన్నెల్స్ పూర్తి చేసుకున్నాం. రెండు, మూడు నెలల్లో బ్రహ్మాండంగా నీళ్లను చూడబోతున్నాం.

రైతుల బతుకులు మారాలనే..

నిన్నగాక మొన్ననే మేనిఫెస్టో విడుదల చేశాం. రైతుల బతుకులు మారాలన్నదే నా లక్ష్యం. నేను పుట్టించిందే రైతుబంధు పథకం. ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇండియాలోనూ ఎక్కడా లేదు. రైతుల కోసం రూ.37 వేలకోట్ల రుణమాఫీ చేశాం. ఇప్పుడిప్పుడే తెల్లగవుతున్నాం. ఇంకో పదేళ్లు కష్టపడితే.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రైతుల జీవితాలు బాగుపడతాయి. బీఆర్ఎస్ మళ్లీ గెలవగానే.. రాష్ట్రంలో 93 లక్షల తెల్లరేషన్ కార్డుదారులకు రైతు బీమా తరహాలో జీవిత బీమా సౌకర్యం కల్పిస్తాం. సన్న బియ్యం అందిస్తాం. ఆసరా పెన్షన్లను రూ.5 వేల వరకు పెంచుతాం. సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ.3 వేలు అందిస్తాం. రైతుబంధు సాయాన్ని రూ.16 వేల వరకు పెంచుతాం. అగ్రవర్ణాల పిల్లలకు 110 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తాం. మరో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి పంపిణీ చేస్తాం'' అని కేసీఆర్ హామీ ఇచ్చారు. జడ్చర్ల సభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మేడ్చల్ సభలో మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మల్కాజిగిరి అభ్యర్థులు వివేకానంద, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వల్లే తెలంగాణకు 60 ఏళ్ల గోస..

1956లో కాంగ్రెస్ తెలంగాణను ఆంధ్రలో కలిపి 60 ఏళ్ల గోసకు కారణమైంది. సమైక్య రాష్ట్రంలో ఆ బాధలు కళ్లారా చూశా. అందరం కలిసి కొట్లాడితే తెలంగాణ వచ్చింది. అనేక మంది విద్యార్థులు బలిదానాలు చేశారు. నేను సైతం చావు నోట్లో తలకాయ పెడితే తెలంగాణ వచ్చింది. 60 ఏళ్లు గోస పడేట్టు చేసిన కాంగ్రెస్ వాళ్లు ఇప్పుడు మళ్లీ వచ్చి పెద్ద మాటలు మాట్లాడుతుండటం సిగ్గుచేటు.

ఒంటరిగా పోరాడి సాధించా..

నాడు తెలంగాణలో తాగు, సాగునీరు లేక ప్రజలు వలసపోయారు. పోచంపల్లిలో ఒకే రోజు ఏడుగురు చేనేత కార్మికులు చనిపోతే.. అక్కడికి వెళ్లిన. వాళ్లకు సాయం చేయాలంటూ నాటి సీఎంను జోలె పట్టి అడిగినా ఒక్క రూపాయికూడా ఇవ్వలేదు. తెలంగాణకు ఒక్క రూపాయికూడా ఇచ్చేది లేదని నాడు సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఒక్కరు కూడా మాట్లాడలేదు. అలాంటి వారిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. 20ఏళ్ల కింద తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు ప్రతి ఒక్కరూ నవ్వులాటగా చూశారు. హేళనగా మాట్లాడారు. నా మీద ఎన్నో నిందలు వేసి అవమానించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు, ఇతర పార్టీల నేతలు ఉద్యమంలో నాతో కలసి రాకపోయినా ఒంటరిగా పోరాటం చేశాను. దాని ఫలితమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చింది. నేడు అదే తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నాం.

సమన్వయం.. బుజ్జగింపులు

స్పెషల్ టాస్క్‌పై బీఆర్ఎస్ ఇన్‌చార్జుల ఫోకస్

నియోజకవర్గ పరిస్థితులపై మదింపు నివేదికలు	అసంతృప్త నేతలు, కేడర్‌కు తాయిలాలు	కీలక, బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై నజర్	అభ్యర్థుల పనితీరు, సంస్థాగత బలంపై పోస్ట్‌మార్టమ్



సాక్షి, హైదరాబాద్: అభ్యర్థుల ఎంపిక, బీ ఫారాల జారీ, ప్రచార సభలతో దూసుకుపోతున్న బీఆర్ఎస్.. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న పరిణామాలపై ఫోకస్ మరింత పెంచింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచార, సమన్వయ బాధ్యతలను పార్టీ అభ్యర్థులకే వదిలేయకుండా పార్టీ ముఖ్య నేతలను ఇన్‌చార్జీలుగా నియమించింది. వారం క్రితం ఇన్‌చార్జీలుగా నియమితులైన నేతలు ఇప్పటికే తమకు బాధ్యతలు అప్పగించిన నియోజకవర్గాలపై దృష్టి కేంద్రీకరించారు. నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను ఆకళింపు చేసుకోవడంతోపాటు ప్రాథమికంగా మదింపు చేసి పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నివేదిక ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. సుమారు 50 రోజుల క్రితమే పార్టీ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఇన్నాళ్లుగా వారి పనితీరు, కేడర్‌తో సమన్వయం, ప్రజల్లోకి వెళ్తున్న తీరు, బూత్ స్థాయి మొదలుకుని పార్టీ యంత్రాంగం పనితీరు తదితరాలను ఈ నివేదికల్లో పొందుపరుస్తున్నారు. సంస్థాగతంగా పార్టీ, అభ్యర్థుల బలాబలాలపై పోస్టుమార్టమ్ జరుగుతోంది. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ఇతర పార్టీల నుంచి చేర్చుకోవాల్సిన నేతల జాబితాను సిద్ధం చేస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేలోగా చేరికలను పూర్తి చేసేలా పావులు కదుపుతున్నారు. మరోవైపు, పార్టీలో అంతర్గత అసమ్మతిని సర్దుబాటు చేసేందుకు తాయితాలు, బుజ్జగింపుల బాధ్యతను పార్టీ ఇన్‌చార్జీలు భుజం మీద వేసుకున్నారు. తమ స్థాయిలో సర్దుబాటు కాని సమస్యలను మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్తున్నారు. ప్రచారం ముగిసేంత వరకు మరో 40 రోజులపాటు నియోజకవర్గాల్లోనే ఇన్‌చార్జులు బస చేయాలని పార్టీ ఆదేశించింది. దీంతో వారు అనుచరగణంతో కలిసి బస ఏర్పాట్లు చూసుకుంటున్నారు. కాగా, మరో 30 నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను నియమించాలని కేసీఆర్ భావిస్తున్నారు.

కీలక నియోజకవర్గాలపై స్పెషల్ ఫోకస్

రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 54 సెగ్మెంట్లకు బీఆర్ఎస్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్, జిల్లా పరిషత్ చైర్మన్లను ఇన్‌చార్జీలను నియమించింది. కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డిలో పోటీ చేస్తుండటంతో కేటీఆర్, హరీశ్‌రావు ఇన్‌చార్జీలుగా బాధ్యతలు తీసుకున్నారు. కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క పోటీ చేస్తున్న మధిరలో పువ్వాడ అజయ్, చొప్పదండిలో గంగుల కమలాకర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ కేడర్‌తో భేటీలు నిర్వహిస్తున్నారు. సమన్వయ సమస్యలు ఎదుర్కొంటున్న వేములవాడలో మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, జనగామలో హరీశ్‌రావు ఇన్‌చార్జీలుగా పనిచేస్తున్నారు. మైనంపల్లి హన్మంతరావు పోటీ చేస్తున్న మల్కాజిగిరిలో కేటీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇన్‌చార్జిగా నియోజకవర్గ పరిస్థితులను మదింపు చేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడిన ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, గోలి శ్రీనివాస్‌రెడ్డి వంటి నేతలు ఇతర నియోజకవర్గాల్లో పరిస్థితులను చక్కదిద్దే పనిలో ఉన్నారు. వచ్చే నెల మొదటి వారంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి పూర్తి స్థాయిలో ప్రచారంపై దృష్టి కేంద్రీకరించేలా ఇన్‌చార్జులు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు.

రాహుల్ గాంధీ కాదు.. ఎలక్షన్ గాంధీ

ఎమ్మెల్సీ కవిత

- రైతులతో రాహుల్ రాజకీయాలు చేస్తున్నారు
- విభజన చట్టం హామీలపై పార్లమెంట్‌లో ఎందుకు ప్రశ్నించలేదు


బోధన్‌లో బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్సీ కవిత

బోధన్: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. ఎలక్షన్ గాంధీ అని పేరు మార్చుకుంటే కరెక్టుగా సరిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఇక్కడికి వచ్చి నాలుగు మాటలు చెప్పి, ఓట్లు వస్తాయనే ఆశతో వెళ్తారని ఎద్దేవా చేశారు. బుధవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, బీసీ కులగణన చేయాలని రాహుల్ గాంధీ కొత్తగా మాట్లాడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే బీసీ సంక్షేమానికి పెద్దపీట వేసిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే బీసీల ప్రభుత్వమని పేర్కొన్నారు. రైతులను కేసీఆర్ కడుపులో పెట్టుకుని కాపాడుకుంటుంటే, రాహుల్ రైతులతో రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ పదేళ్ల కాలంలో రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలపై పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడలేదో రాహుల్ చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను చూసి బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మైండ్ బ్లాంక్ అయిందని అన్నారు. రాహుల్ గాంధీ నిజామాబాద్ జిల్లాకు వస్తే డిచ్‌పల్లి రామాలయాన్ని సందర్శించాలని, అంకాపూర్ చికెన్ రుచి చూడాలని, బోధన్ ఆతిథ్యం స్వీకరించాలని.. కానీ ఇక్కడి ప్రజల సుహృద్భావ వాతావరణాన్ని చెడగొట్టవద్దని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురం

బోధన్ పట్టణంలో భారత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె పట్టణంలోని పలువురి ఇళ్లలో బతుకమ్మలను పేర్చారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో వేలమంది మహిళలు పాల్గొని, ఉత్సాహంగా బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్, ఆయన సతీమణి ఆయేషా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి గద్వాల డీసీసీ అధ్యక్షుడు

హరీశ్‌రావు సమక్షంలో చేరిన పలువురు నేతలు



పటేల్ ప్రభాకర్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల్ ఎలక్షన్ ఇన్‌చార్జి చిరుమిళ్ల రాకేశ్‌కుమార్, గట్టు తిమ్మప్పల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి సహా పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఎంఐఎం కౌన్సిల్ బంగి ప్రియాంక, ఎంఎమ్ పట్టణ అధ్యక్షుడు బంగి సుదర్శన్, గద్వాల్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రఘు నాయుడు, ధరూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ఉమాదేవి, ఇతర నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, పూల కరుణాకర్, అలెగ్జాండర్, విజయ్‌కుమార్ తదితరులున్నారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గద్వాల సహా బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోకి, హామీలకు ముఖ్యమంత్రి కేసీఆర్ గ్యారంటీ ఇస్తారని అన్నారు.

ఎంపీ లక్ష్మణ్, విజయారెడ్డిపై కేసు

ప్రవల్లిక ఆత్మహత్య చేసుకున్న రోజు హాస్టల్ వద్ద ధర్నా

సాక్షి, హైదరాబాద్: విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్య చేసుకున్న రోజు హాస్టల్ దగ్గర జరిగిన నిరసన కార్యక్రమాలకు బాధ్యులుగా ఆరోపిస్తూ బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డితో సహా పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులపై ఒకటి, రాజకీయ నేతలపై మరొకటి రిజిస్టర్ చేశారు. చిక్కడపల్లి ఠాణా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వైకే ప్రసాద్, సైఫాబాద్ ఎస్సై తరుణ్ కుమార్‌ల ఫిర్యాదు మేరకు శనివారమే ఈ కేసులు నమోదైనప్పటికీ ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. శుక్రవారం ప్రవల్లిక ఆత్మహత్య ఉదంతం వెలుగులోకి వచ్చిన వెంటనే గ్రూప్-2 పరీక్ష వాయిదా వల్లే ఇలా జరిగిందనే వార్తలు వెలువడ్డాయి. దీంతో రాజకీయ నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఆ ప్రాంతానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఇలా వచ్చిన వారిలో బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాశ్, నాంపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత, ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి నీలిమతో పాటు బీజేపీ, బీజేవైఎం నాయకులు ఉన్నారు. వీరంతా పెద్ద సంఖ్యలో నిరసనకారులు అక్కడ చేరుకోవడానికి సహకరించారన్నది పోలీసుల ఆరోపణ. ప్రవల్లిక మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్షలకు తరలిస్తుండగా అడ్డుకుని పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, విద్యార్థులు-పోలీసుల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టారని వారు అంటున్నారు. అక్కడ రాళ్ల దాడి జరగడానికి కూడా వీళ్లే కారణమని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు చిక్కడపల్లి అధికారులు కేసు నమోదు చేశారు. విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకులతో పాటు కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అశోక్‌పై కూడా కేసు నమోదు చేశారు.

పసిగుడ్డు తెలంగాణ.. ఇతరుల చేతుల్లో పెట్టొద్దు!

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే రాష్ట్రం ఆగమైతది
- కరీంనగర్ ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్
- మన తాతలు చేసిన తప్పులు ఇప్పుడు మళ్లీ చేయొద్దు
- జాబ్ కేలండర్‌తో ఏటా కొలువుల భర్తీ.. అవసరమైతే టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన
- తెల్లరేషన్ కార్డున్న కుటుంబాలకు కేసీఆర్ బీమాతో లబ్ధి


బుధవారం కరీంనగర్‌లో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో వినోద్‌కుమార్, గంగుల ● సభకు హాజరైన ప్రజలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తొమ్మిదిన్నరేళ్ల పసిగుడ్డు తెలంగాణను ఇతరుల చేతుల్లో పెట్టవద్దని.. మన తాతలు చేసిన తప్పులను ఇప్పుడు మీరు చేయవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారకరామారావు ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే తెలంగాణ ఆగమవుతుందని పేర్కొన్నారు. గత తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని.. ఇది ఇలాగే కొనసాగాలంటే మరోసారి కారును, కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో గంగుల కమలాకర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఈ వివరాలు ఆయన మాటల్లోనే..

''2009 నవంబర్ 29న కేసీఆర్ కరీంనగర్‌లో తలపెట్టిన దీక్షతో రాష్ట్రంలో అగ్గిరేగింది. ఈసారి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు పార్టీ పుట్టించే మంటల్లో కాంగ్రెస్, బీజేపీ దహించుకుపోవాలి. కరీంనగర్‌లో రోడ్లు, డ్రైనేజీ బాగయ్యాయి. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయడంతో దిగువ, మధ్య మానేరు రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాను సజీవ జలధారగా మార్చిన అపర భగీరథుడు కేసీఆర్. ఒక్క మెడికల్ కాలేజీ లేని పాత ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నేడు నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వచ్చాయి. గంగుల కమలాకర్ నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం 1,001 గురుకులాలను ప్రారంభించుకున్న ఏకైక రాష్ట్రం మనది. గిరిజనులకు 6 నుంచి 10 శాతానికి రిజర్వేషన్లు పెంచుకున్నాం. తండాలను పంచాయతీలుగా చేసుకున్నాం.

మతం పేరిట వచ్చేవారికి చెంపపెట్టు

గంగుల కమలాకర్ మీద పోటీ అంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసినట్టే ఉంది. కాంగ్రెస్, బీజేపీలు పోటీ కోసం బీఫారాలు ఇస్తామన్నా మాకొద్దంటూ ఆ పార్టీల వాళ్లు తప్పించుకుపోతున్నారు. ఇక్కడున్న ఎంపీ (బండి సంజయ్‌ను ఉద్దేశిస్తూ..) గత అసెంబ్లీ ఎన్నికల్లో కమలాకర్ చేతుల్లో చావుదెబ్బ తిన్నాడు. అవే ఏడుపులతో ఎంపీ ఎన్నికల్లో గెలిచాడు. కానీ ఒక్క నవోదయ, కేజీబీవీ, ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీ తెచ్చారా? కనీసం గుడి అయినా తెచ్చారా? ఆయన మాట్లాడితే మసీదులు తవ్వుదాం అంటారు. తవ్వాల్సింది మసీదులు కాదు. కాలువలు, డబుల్‌బెడ్రూం ఇళ్లు, పాఠశాలలు, ఆలయం, మసీదులు, చర్చిల కోసం పునాదులు తవ్వాలి. గత ఎన్నికల్లో మతం పేరిట ఓట్లేయించుకున్న వారికి చెంపపెట్టు లాంటి సమాధానం రావాలి. ఆనాడు ప్రధాని మోదీ జన్‌ధన్ ఖాతాలు తెరిస్తే.. ధనాధన్ ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తా అన్నారు. ఆ రూ.15 లక్షలు వచ్చినవాళ్లంతా బీజేపీకి ఓటేయాలి. అదే రైతుబంధు వచ్చిన వారంతా కారు గుర్తుకు ఓటేయాలి.

పేదలందరికీ బీమా, సన్నబియ్యం

బీఆర్ఎస్ మళ్లీ గెలిచాక ఆసరా పింఛన్లు రూ.5వేలు చేసుకుందాం. తెల్లరేషన్ కార్డున్న కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వమే బీమా చేయించేలా 'కేసీఆర్ బీమా'పేరిట ఎల్ఐసీతో ఒప్పందం చేసుకుంటుంది. రేషన్‌కార్డుదారులు అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తాం. 'సౌభాగ్యలక్ష్మి' పథకం కింద అర్హత కలిగిన ప్రతీ మహిళకు రూ.3,000 ఆర్థిక సాయం ప్రారంభిస్తాం. ప్రవల్లిక అనే అమ్మాయి మృతిని రాజకీయం చేస్తున్నారు. ఆమె కుటుంబ సభ్యులకు పార్టీపరంగా అండగా నిలుస్తాం. రాహుల్, ప్రియాంకా గాంధీ, బీజేపీ వాళ్లు వస్తారు. ఏదేదో చెప్పి రెచ్చగొడతారు. ఆగం కాకుండా ఆలోచించండి. తొమ్మిదిన్నరేళ్లలో 2.20 లక్షల ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ ఇచ్చి, అందులో 1.30లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఏటా జాబ్ కేలండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తాం .అవసరమైతే టీఎస్‌పీఎస్సీ బోర్డును కూడా ప్రక్షాళన చేస్తాం''అని కేటీఆర్ పేర్కొన్నారు.

రాష్ట్రం ఎవరిచేతిలో ఉండాలో ఆలోచించండి

రాష్ట్రంలో మైనార్టీ పిల్లల కోసం ఏర్పాటు చేసిన 205 స్కూళ్లలో 75,000 మంది నాణ్యమైన విద్య అభ్యసిస్తున్నారు. కొందరు ఆరోపిస్తున్నట్టుగా బీజేపీతో బీఆర్ఎస్ చెలిమి చేస్తే.. మైనార్టీల కోసం రూ.13,000 కోట్లు ఖర్చు చేస్తామా? ఇవతల చావు నోట్ల తలపెట్టి తెలంగాణను సాధించిన కేసీఆర్ ఉన్నారు.. అవతల ఉద్యమంలో రాజీనామా చేయాలంటే అమెరికా పారిపోయిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఓటుకుకోట్లు కేసులో అడ్డంగా దొరికిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనే థర్డ్ క్లాస్ క్రిమినల్ ఉన్నారు. తెలంగాణ ఎవరి చేతిలో ఉండాలో మీరే ఆలోచించాలి.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 19-10-2023







దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

'ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు'...

• ఒకనాటి దసరా

లేదయా మీ దయా మా మీద లేదు

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే 'దసరా బుల్లోడు' అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు, అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది. అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.



బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు





సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగి పోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..''వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి'' అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?'' అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా 'అవును వీటిని ఏం చేయాలి?' అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

"దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది".
– తృప్తి గైక్వాడ్

సంపూర్తిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు 'సంపూర్ణమ్' పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లుగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు.



ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు. సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికి వాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్స్‌లుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...

గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిబ్బట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షొలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

'ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షొలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు' అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.



● మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం 'ఇండియన్ సూపర్ ఉమెన్' అంటూ ప్రశంసించింది.

టిప్స్



● రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.
ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

● కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను



రవి బాల శర్మ

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా 'డాన్సింగ్ దాదీ'గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

''నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంపకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.







కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్పకూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు 'డ్యాన్స్ దాది'ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు 'మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ'ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం 'ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త' అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే 'నేనెందుకు చేయలేకపోయాను' అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.





వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను'' అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.



'డీఆర్‌ఎస్'పై డేవిడ్ వార్నర్ అసంతృప్తి

అంపైర్ నిర్ణయ సమీక్ష పద్ధతి (డీఆర్‌ఎస్)పై ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ వార్నర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో మదుశంక బౌలింగ్‌లో వార్నర్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. వార్నర్ రివ్యూ కోరినా...డీఆర్‌ఎస్‌లోనూ అది అవుట్‌గా తేలడం వివాదాస్పదమైంది. 'హాక్-ఐ' టెక్నాలజీ బంతి గమనాన్ని సరిగా అంచనా వేయలేదు. అయినా సరే 'వికెట్లను తగులుతుంది' అనే అవుటిచ్చారు. 'ఈ హాక్-ఐ ఎలా పనిచేస్తోందో అర్థం కావడం లేదు. దయచేసి ఎవరికైనా తెలిస్తే చెప్పండి. లేదంటే ఇది అవసరమా లేదో కూడా చెప్పండి. ఎందుకంటే ఇది టీవీల కోసమే అన్నట్లుగా దీని పని తీరు ఉంటోంది. ఇదేలా అవుటని ఫీల్డ్ అంపైర్‌ను కూడా అడిగాను. అతనేమో (అంపైర్) బంతి స్వింగ్ అయ్యిందని అందుకే అవుటిచ్చానని చెప్పాడు. కానీ బంతి లెగ్‌సైడ్ ఆవల పడింది. ఇలాంటి తప్పుల విషయంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాలి కదా' అని వార్నర్ విమర్శించాడు. బెంగళూరులో ఆదివారం జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఆస్ట్రేలియా తలపడుతుంది.

భారత్ జోరుకు ఎదురుందా!

ఎప్పుడో 2007లో ప్రపంచకప్‌లో అనూహ్యంగా బంగ్లాదేశ్ చేతిలో భారత్ ఓడింది... ఆపై మూడు వరల్డ్ కప్‌లలో కూడా బంగ్లాను టీమిండియా చిత్తుగా ఓడించింది...ఇప్పుడు తాజా ఫామ్, బలాబలాలను బట్టి చూస్తే రోహిత్ సేనకు టోర్నీలో వరుసగా నాలుగో విజయం అందుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. తమ మొదటి పోరులో అఫ్గన్‌ను ఓడించినా... ఆపై రెండు మ్యాచ్‌లలో చిత్తుగా ఓడిన బంగ్లా మళ్లీ కోలుకునే ప్రయత్నంలో ఉంది. అయితే అన్ని రంగాల్లో అత్యంత పటిష్టంగా ఉన్న టీమిండియాను ఆ జట్టు నిలువరించడం దాదాపు అసాధ్యం కావచ్చు.

- నేడు బంగ్లాదేశ్‌తో టీమిండియా పోరు
- నాలుగో విజయంపై రోహిత్ సేన గురి
- తీవ్ర ఒత్తిడిలో బంగ్లా
- మ.గం.2.00నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


రోహిత్


షకీబ్

పుణే: వరల్డ్ కప్ టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగి వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత్ మరో సమరానికి సన్నద్ధమైంది. నేడు జరిగే పోరులో మరో ఆసియా జట్టు బంగ్లాదేశ్‌తో టీమిండియా తలపడుతుంది. ఇటీవలి ఆసియా కప్ సహా గత ఏడాది కాలంలో భారత్‌పై ఆడిన నాలుగు మ్యాచ్‌లలో 3–1తో బంగ్లాదేశ్‌కు మెరుగైన రికార్డు ఉంది. అయితే ప్రస్తుతానికి వచ్చే సరికి ఆ లెక్క ఇక్కడ పని చేయక పోవచ్చు. ఆసీస్, అఫ్గన్, పాక్‌లను అలవోకగా ఓడించిన టీమిండియాకు బంగ్లాపై కూడా అదే జోరు కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ప్రధాన ఆటగాళ్లెవరూ ఫామ్‌లో లేక ఇబ్బంది పడుతున్న బంగ్లా ఎంత వరకు పోటీనిస్తుందనేది చూడాలి. 1998 తర్వాత బంగ్లాదేశ్ జట్టు భారత గడ్డపై భారత్‌ను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి.

మార్పుల్లేకుండా...

ఫామ్‌ను బట్టి చూస్తే సహజంగానే ఈ మ్యాచ్ కోసం భారత్ తమ తుది జట్టులో మార్పులు చేయాల్సిన అవసరం లేదు. గత రెండు మ్యాచ్‌లలో 131, 86 స్కోర్లతో సత్తా చాటిన రోహిత్ మళ్లీ చెలరేగితే బంగ్లాకు చుక్కలు చూపించగలడు. పాక్‌తో విఫలమైనా టోర్నీలో ఇప్పటికే రెండు అర్ధ సెంచరీలు చేసిన కోహ్లి కూడా తన దాటిని ప్రదర్శించగలడు. బంగ్లాదేశ్‌పై ఆడిన 15 వన్డేల్లో ఏకంగా 67.25 సగటుతో చెలరేగిన కోహ్లి 4 సెంచరీలూ బాదాడు. టాప్–5లో ఇతర బ్యాటర్లు గిల్, అయ్యర్, రాహుల్ కూడా చెలరేగిపోగలరు. రాహుల్ ప్రతీ మ్యాచ్‌లో ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేస్తుండగా, అయ్యర్ కూడా ఫామ్‌లోకి వచ్చాడు. పాండ్యా, జడేజా తమ ఆల్‌రౌండ్ పాత్రను సమర్థంగా నిర్వహిస్తున్నారు. శార్దుల్ స్థానంలో కాస్త చర్చ కొనసాగుతున్నా... పిచ్‌ను బట్టి చూస్తే అతడినే కొనసాగించవచ్చు. పేస్ విభాగంలో కూడా బుమ్రా, సిరాజ్ జోరు మీదుండటంతో సీనియర్ షమీకి అవకాశం దక్కడం కష్టమే. మరో వైపు కుల్దీప్ ఇప్పటి వరకు కేవలం 3.9 ఎకానమీ నమోదు చేయడం చూస్తే అతని బౌలింగ్‌ను ఎదుర్కోవడానికి బ్యాటర్లు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థమవుతుంది. మూడు మ్యాచ్‌లలో కలిపి 28 ప్రత్యర్థి వికెట్లు తీసిన భారత్...మొత్తంగా 9 వికెట్లే కోల్పోయింది.

ఆదుకునేదెవరు...

భారత్‌పై పదహారేళ్ల క్రితం విజయంలో భాగమైన షకీబ్, ముష్ఫికర్ బహుశా చివరి సారి వరల్డ్‌కప్‌లో భారత్‌తో కాస్త మెరుగైన ప్రదర్శన కనబర్చాలని పట్టుదలగా ఉన్నారు. ముష్ఫికర్ రెండు అర్ధ సెంచరీలు సాధించినా షకీబ్ విఫలం కావడంతో జట్టుపై భారం పడుతోంది. మూడు మ్యాచ్‌లు ముగిసినా అతడినుంచి ఆశించిన ప్రదర్శన రాలేదు. నజ్ముల్, దాస్ ఒకే మ్యాచ్‌లో ఫర్వాలేదనిపించారు. కొత్త బ్యాటర్ తన్‌జీద్ కూడా ప్రభావం చూపలేక పోగా, ప్రపంచకప్‌కు ముందు అద్భుతంగా ఆడి అంచనాలు పెంచిన తౌహీద్ వరుసగా విఫలమయ్యాడు. మరో ఆల్‌రౌండర్ మిరాజ్‌లోనూ నిలకడ లోపించింది. బౌలింగ్‌లో ముస్తఫిజుర్ మినహా అంతా విఫలమయ్యారు.

తుది జట్లు (అంచనా):

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, పాండ్యా, జడేజా, శార్దుల్, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

బంగ్లాదేశ్: షకీబ్ (కెప్టెన్), తన్‌జీద్, దాస్, నజ్ముల్, తౌహీద్, ముష్ఫికర్, మిరాజ్, మహ్మదుల్లా, తస్కిన్, షరీఫుల్, ముస్తఫిజుర్.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. గతంలోనూ భారీగా పరుగులు వచ్చాయి. బుధవారం నగరంలో జల్లులు కురిసినా...మ్యాచ్ రోజు వర్షసూచన లేదు.

రోహిత్‌కు 3 జరిమానాలు...

వరల్డ్ కప్‌లో 142 స్ట్రయిక్‌రేట్‌తో దూసుకుపోతున్న భారత కెప్టెన్ రోహిత్ శర్మ రోడ్డుపై అంతకు మించిన వేగాన్ని ప్రదర్శించాడు. ముంబై–పుణే హైవేపై తన కారులో పరిమితికి మించిన వేగంతో వెళ్లడంతో ట్రాఫిక్ అధికారులు అతనిపై మూడు చలాన్లు విధించారు. భారత జట్టుతో చేరేందుకు ముంబైనుంచి తన కారులో పుణేకు వెళ్లిన రోహిత్ చాలా ప్రమాదకరంగా కారు నడిపాడని అధికారులు వెల్లడించారు. అతని అత్యధిక స్కోరు 264 నంబర్ ప్లేటుతో ఉన్న రోహిత్ 'లాంబోర్గిని' ఒక దశలో గంటకు 200–215 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయిందని సమాచారం.

న్యూజిలాండ్ 4/4

- అఫ్గాన్‌పై 149 పరుగులతో భారీ విజయం
- రాణించిన ఫిలిప్స్, లాథమ్, యంగ్


లాథమ్ ఫిలిప్స్

చెన్నై: టాస్ గెలిచి కూడా ఫీల్డింగ్ ఎంచుకొని చేసిన తప్పుడు వ్యూహంతో పాటు ఫీల్డింగ్‌లో మూడు క్యాచ్‌లు వదిలేసిన వైఫల్యం చివరకు అఫ్గనిస్తాన్ భారీ ఓటమికి కారణంగా మారింది. తడబడుతూ ఇన్నింగ్స్ కొనసాగించి చివర్లో చెలరేగిన న్యూజిలాండ్ ఆపై బౌలింగ్‌లో సత్తా చాటగా...పేలవ బ్యాటింగ్‌లో అఫ్గన్ కుప్పకూలింది. దాంతో కివీస్ ఖాతాలో వరుసగా నాలుగో విజయం చేరింది. బుధవారం జరిగిన పోరులో కివీస్ 149 పరుగుల తేడాతో అఫ్గనిస్తాన్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ ఫిలిప్స్ (80 బంతుల్లో 71; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ లాథమ్ (74 బంతుల్లో 68; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), విల్ యంగ్ (64 బంతుల్లో 54; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. ఆరంభంలో 109/1తో పటిష్టంగా ఉన్న కివీస్ పరుగు తేడాతో 3 వికెట్లు కోల్పోయి 110/4 వద్ద నిలిచింది. ఈ స్థితిలో లాథమ్, ఫిలిప్స్ ఐదో వికెట్‌కు 144 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అయినా సరే టీమ్ ఒక దశలో 44 ఓవర్లలో 210 పరుగులే చేసింది. కానీ చివరి 6 ఓవర్లలో బ్యాటర్లు చెలరేగడంతో ఏకంగా 78 పరుగులు సాధించగలిగింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 34.4 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. రహ్మత్ షా (62 బంతుల్లో 36; 1 ఫోర్) టాప్ స్కోరర్. గత మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి సంచలనం రేపిన అఫ్గన్ గత వరల్డ్ కప్ రన్నరప్ ముందు అదే స్థాయి పోరాటపటిమ కనబర్చలేక చేతులెత్తేసింది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	4	4	0	8	1.923
భారత్	3	3	0	6	1.821
దక్షిణాఫ్రికా	3	2	1	4	1.385
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
నెదర్లాండ్స్	3	1	2	2	-0.993
అఫ్గానిస్తాన్	4	1	3	2	-1.250
శ్రీలంక	3	0	3	0	-1.532

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 20; విల్ యంగ్ (సి) ఇక్రామ్ (బి) ఒమర్జాయ్ 54; రచిన్ (బి) ఒమర్జాయ్ 32; మిచెల్ (సి) ఇబ్రహీమ్ (బి) రషీద్ 1; లాథమ్ (బి) నవీనుల్ 68; ఫిలిప్స్ (సి) రషీద్‌ఖాన్ (బి) నవీనుల్ 71; చాప్‌మన్ నాటౌట్ 25; సాన్‌ట్నర్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 288. వికెట్ల పతనం: 1–30, 2–109, 3–110, 4–110, 5–254, 6–255. **బౌలింగ్:** ముజీబ్ 10–0–57–1, ఫరూఖీ 7–1–39–0, నవీనుల్ 8–0–48–2, నబి 8–1–41–0, రషీద్ ఖాన్ 10–0–43–1, అజ్మతుల్లా ఒమర్జాయ్ 7–0–56–2.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (బి) హెన్రీ 11; ఇబ్రహీమ్ (సి) సాన్‌ట్నర్ (బి) బౌల్ట్ 14, రహ్మత్ షా (సి) అండ్ (బి) రచిన్ 36; హష్మతుల్లా (సి) సాన్‌ట్నర్ (బి) ఫెర్గూసన్ 8; ఒమర్జాయ్ (సి) లాథమ్ (బి) బౌల్ట్ 27; ఇక్రామ్ నాటౌట్ 19; నబి (బి) సాన్‌ట్నర్ 7; రషీద్‌ఖాన్ (సి) మిచెల్ (బి) ఫెర్గూసన్ 8; ముజీబ్ (సి) యంగ్ (బి) ఫెర్గూసన్ 4; నవీనుల్ (సి) చాప్‌మన్ (బి) సాన్‌ట్నర్ 0; ఫరూఖీ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (34.4 ఓవర్లలో ఆలౌట్) 139. వికెట్ల పతనం:** 1–27, 2–27, 3–43, 4–97, 5–107, 6–125, 7–134, 8–138, 9–139, 10–139.

బౌలింగ్: బౌల్ట్ 7–1–18–2, హెన్రీ 5–2–16–1, సాన్‌ట్నర్ 7.4–0–39–3, ఫెర్గూసన్ 7–1–19–3, ఫిలిప్స్ 3–0–13–0, రచిన్ రవీంద్ర 5–0–34–1.

'అభిమానులు కూడా గెలవాలి'

(గౌతమ్ గంభీర్)

మన జట్టు మూడు మ్యాచుల్ని గెలిచింది. కానీ మన ప్రేక్షకులే అందరి మనసుల్ని గెలవలేకపోతున్నారు. ఢిల్లీలో నవీనుల్‌ను గేలి చేయడం, అహ్మదాబాద్‌లో బాబర్ అజమ్ లక్ష్యంగా చేసిన నినాదాలు మనల్ని ప్రపంచకప్ వేదికపై పలుచన చేస్తాయి. క్రికెట్ జగమంతా ఒకే కుటుంబం అనేదానికి ఇది పూర్తిగా విరుద్ధం. ఈ విషయంలో మనం మారాలి. ఒకవేళ 2036 ఒలింపిక్ బిడ్‌ను భారత్ గెలిచినా మనమంతా తటస్థంగా మెలగాలి. అనుచిత, వ్యతిరేక ధోరణి మెగా ఈవెంట్ ఆతిథ్యంలో తగదు. మైదానంలో మన జట్టు గెలిచినట్లే... వెలుపల ప్రేక్షకులు తమ ప్రవర్తనతోనూ గెలవాలి. ఇక ప్రస్తుత బంగ్లాదేశ్‌తో మ్యాచ్ విషయానికొస్తే భారత్ ఫామ్ దృష్ట్యా ఇదేమంత క్లిష్టమైన మ్యాచే కాదు. ఇలాంటి సందర్భంలో శార్దుల్‌ను కాదని అనుభవజ్ఞుడైన షమీకి చోటివ్వడం సముచితంగా ఉంటుంది. అతని స్వింగ్ బౌలింగ్ ప్రత్యర్థి పాలిట సింహస్వప్నంగా మారగలదు.



రజతం సాధించిన ఇందు

జాతీయ పవర్‌లిఫ్టింగ్



సాక్షి, హైదరాబాద్: జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన వీసారపు ఇందు రజత పతకం గెలుచుకుంది. ఇటీవలే బెంగళూరులో జరిగిన ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన పవర్‌లిఫ్టర్లు పాల్గొన్నారు. మహిళల 90 కేజీల విభాగంలో బరిలోకి దిగిన ఇందు మొత్తం 100 కేజీల బరువు నెత్తి రెండో స్థానంలో నిలిచింది.

సినిమా


● రామ్‌చరణ్, ఉపాసన

తొలి విహార యాత్ర!

రామ్‌చరణ్, ఉపాసన ఇటలీ వెళ్లారు. తమ కుమార్తె క్లీం కారని తీసుకుని ఈ విహార యాత్రకు వెళ్లారు. కుమార్తెతో చరణ్, ఉపాసన వెళ్లిన ఫస్ట్ వెకేషన్ ఇది. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' సినిమాలో నటిస్తున్నారు రామ్ చరణ్. ఈ సినిమా తాజా షెడ్యూల్ మంగళవారంతో పూర్తయింది. తర్వాతి షెడ్యూల్‌కి కాస్త గ్యాప్ రావడంతో కుటుంబంతో కలిసి బుధవారం ఇటలీ వెకేషన్‌కు బయలుదేరారు రామ్‌చరణ్. దాదాపు వారంరోజుల పాటు ఈ ట్రిప్‌ని ప్లాన్ చేసుకున్నారని సమాచారం.

పులివెందులలో యాత్ర 2


● జీవా

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలోని ముఖ్య ఘటనల ఆధారంగా రూపొందుతున్న సినిమా 'యాత్ర 2'. ఈ చిత్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాత్రలో జీవా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాత్రలో మమ్ముట్టి నటిస్తున్నారు. 2019లో విడుదలైన 'యాత్ర' సినిమాకు సీక్వెల్‌గా 'యాత్ర 2' తెరకెక్కుతోంది. 'యాత్ర'ను తెరకెక్కించిన మహీ వి. రాఘవ్ 'యాత్ర 2' చిత్రానికీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ వైఎస్‌ఆర్ కడప జిల్లా పులివెందులలో జరుగుతోంది. జీవా పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ''వైఎస్ జగన్ మోహన్ రెడ్డిగారి పాత్రలో జీవా జీవిస్తున్నాడు. ప్రస్తుతం నేనే ప్రత్యక్ష సాక్షిని. ఫిబ్రవరి 8న మీరూ (ప్రేక్షకులు) చెబుతారు'' అన్నారు మహీ వి. రాఘవ్. శ్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యూలాయిడ్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024 ఫిబ్రవరి 8న విడుదల కానుంది.

ఉల్లిపాయలు కొంటే మనిషి కాదా!


● విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా సినిమాకు 'ఫ్యామిలీ స్టార్' అనే టైటిల్ ఖరారు చేశారు. పరశురామ్ పెట్ల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ టీజర్‌ను బుధవారం రిలీజ్ చేశారు మేకర్స్. ఇంట్లో పనులు చేసే ఫ్యామిలీ మ్యాన్‌గా, బయట రౌడీల బెండు తీసే పవర్‌ఫుల్ మ్యాన్‌గా విజయ్ దేవరకొండ టీజర్‌లో కనిపించారు. 'లైన్‌లో నిలబడి ఉల్లిపాయలు తేవడాలు, టైమ్‌కు లేచి పిల్లల్ని రెడీ చేసి స్కూల్‌కు పంపించడాలు అనుకున్నావా మగతనం అంటే' అని విలన్ ఎగతాళిగా మాట్లాడగా... 'భలే మాట్లాడతారన్నా మీరంతా... ఉల్లిపాయలు కొంటే ఆడు మనిషి కాదా... పిల్లల్ని రెడీ చేస్తే ఆడు మగాడు కాదా... ఐరన్ వంచాలా ఏంటి?' అంటూ విజయ్ చెప్పే డైలాగ్‌లు టీజర్‌లో ఉన్నాయి. ''ఫ్యామిలీ స్టార్' సంక్రాంతి పండగకు రిలీజ్ చేయనున్నాం. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్, సంగీతం: గోపీసుందర్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: వాసు వర్మ.

కీడా కోలా నవ్విస్తుంది

\- రానా


● చైతన్యా రావు, రానా, తరుణ్ భాస్కర్

తరుణ్ భాస్కర్ కథ అందించి, నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కీడా కోలా'. బ్రహ్మానందం, చైతన్యా రావు, రాగ్ మయూర్, విష్ణు, రవీంద్ర విజయ్, రఘురామ్ ప్రధాన పాత్రల్లో నటించారు. నటుడు – నిర్మాత రానా సమర్పణలో కె.వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్ నండూరి, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేసిన రానా మాట్లాడుతూ– ''తాము అనుకున్న కథను బలంగా నమ్మి, కథ... కథనానికి కట్టుబడి సినిమాలు చేసే తరుణ్ భాస్కర్ వంటి ఫిల్మ్ మేకర్స్ చాలా అరుదుగా ఉంటారు. 'కీడా కోలా' చూసి నవ్వుకున్నాను. ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది. నేను హీరోగా చేసే సినిమాల అప్‌డేట్స్ త్వరలో తెలుస్తాయి. అలాగే అరవై ఏళ్లుగా ఉన్న సురేష్ ప్రొడక్షన్స్‌లో చాలా సినిమాల రీమేక్స్ రైట్స్ ఉన్నాయి. అయితే ప్రస్తుతానికి నేను ఏ రీమేక్ చేయడం లేదు. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' తో నాకు ఉన్న అసోషియేషన్ ఏంటి? అనేది త్వరలో తెలుస్తుంది'' అన్నారు. ''లాక్‌డౌన్ టైమ్‌లో డబ్బులు ఎలా సంపాదించాలని ఆలోచిస్తున్నప్పుడు ఏదైనా డ్రింక్‌లో ఓ కీడా ఉంటే కన్‌జ్యూమర్ కేసు వేసి, కోట్లు సంపాదించవచ్చు కదా అనే ఆలోచన వచ్చింది. అలా క్రైమ్ కామెడీగా 'కీడా కోలా' కథను కొత్తగా రెడీ చేసుకున్నాను. వెంకటేశ్‌గారితో సురేష్ ప్రొడక్షన్స్‌లో నేను చేయాల్సిన సినిమా కథ సెకండాఫ్ వర్క్ చేస్తున్నాను''అన్నారు. ''తరుణ్ భాస్కర్‌తో సినిమా చేయాలన్న నా కల నేరవేరింది'' అన్నారు చైతన్యా రావు. ''ప్రేక్షకులు ఈ మూవీని ఎంజాయ్ చేస్తారు'' అన్నారు నిర్మాతలు.

జపాన్ రేంజే వేరు


● కార్తీ

'హార్ట్ ఆఫ్ ది సిటీలో ఒకడు కన్నమేసి రెండు వందల కోట్ల రూపాయల విలువ చేసే నగలు ఎత్తుకుపోతే మీ లా అండ్ ఆర్డర్ లాఠీ ఊపుతూ కూర్చుందా?' అనే డైలాగ్‌తో 'జపాన్' చిత్రం టీజర్ విడుదలైంది. కార్తీ హీరోగా రాజు మురుగన్ దర్శకత్వం వహించిన చిత్రం 'జపాన్'. ఇందులో అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటించారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్‌ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్‌ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో దీపావళికి విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని బుధవారం విడుదల చేశారు. ''ఇండియా అంతటా జపాన్‌పై (కార్తీ పాత్ర పేరు) 182 కేసులున్నాయి. నాలుగు రాష్ట్రాల పోలీసులు వాడి కోసం వెతుకుతున్నారు. కానీ, ఒక్కసారి కూడా వాడు ఎవ్వరికీ దొరకలేదు', 'జపాన్ రేంజే వేరు' వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.


తెలుసు కదా ఆరంభం


● రాశిఖన్నా, సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి, నీరజ కోన

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'తెలుసు కదా' సినిమా ఆరంభం అయింది. ఈ సినిమా ద్వారా స్టైలిస్ట్, కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాని క్లాప్ కొట్టగా, దర్శకుడు హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. హీరోలు నితిన్, ఆది పినిశెట్టి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. ''తెలుసు కదా' త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు మేకర్స్. దర్శకులు వక్కంతం వంశీ, 'బొమ్మరిల్లు' భాస్కర్, మల్లిక్ రామ్, నందినీ రెడ్డి, నిర్మాతలు నాగవంశీ, విజయేందర్ రెడ్డి, రచయిత కోన వెంకట్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: తమన్, కెమెరా: యువరాజ్ జె.

నరేశ్ అంటే ఎవరు అన్నారు

\- వీకే నరేశ్



సంపూర్ణేష్ బాబు హీరోగా వీకే నరేష్, శరణ్య ప్రదీప్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. వై నాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పిస్తున్న ఈ చిత్రంలో దర్శకుడు వెంకటేశ్ మహా స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అదించడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. పూజా కొల్లూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించిన వీకే నరేశ్ మాట్లాడుతూ– ''వినోదం, సందేశం... ఈ రెండు అంశాలు మిళితమై ఉన్న సినిమాలు తక్కువగా వస్తుంటాయి. 'మార్టిన్ లూథర్ కింగ్'లో ఈ రెండూ ఉన్నాయి. ఓ గ్రామంలోని రాజకీయ వర్గానికి నాయకుడిగా నటించాను. తమిళ 'మండేలా' సినిమాకు 'మార్టిన్..' చిత్రం స్ఫూర్తి మాత్రమే. పూర్తి స్థాయి రీమేక్ కాదు. ఈ సినిమా సంపూర్ణేష్‌కు సెకండ్ ఇన్నింగ్స్‌లా ఉంటుంది. 30 మంది నటీనటులు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''కొంతకాలం రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నాను. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలు చేస్తున్నాను. జీవితంలో ఎత్తుపల్లాలు చూశాను. రాజకీయాల నుంచి ఇండస్ట్రీకి తిరిగొచ్చినప్పుడు నరేశ్ అంటే ఎవరు? అని కొందరు అన్నారు. ఎస్వీ రంగారావుగారిని స్ఫూర్తిగా తీసుకుని విభిన్నమైన పాత్రలు చేస్తున్నాను. ఈ తరం దర్శకులు నాకోసం పాత్రలు రాయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.

అప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి

\- నిర్మాత అభిషేక్ అగర్వాల్



రవితేజ టైటిల్ రోల్ చేసిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఇందులో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించారు. వంశీకృష్ణ దర్శకత్వంలో తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో నిర్మాత అభిషేక్ అగర్వాల్ చెప్పిన విశేషాలు.

● మంచి కంటెంట్, కొత్త కథలను చెప్పడమే మా అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థ ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలోనే పవర్‌ఫుల్ కంటెంట్ ఉన్న 'టైగర్ నాగేశ్వరరావు' చేశాం. ఈ సినిమా చేయడానికి ముందే నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను సంప్రదించి, ఆయన పూర్తి వివరాలు తెలుసుకున్నాం. టైగర్ నాగేశ్వరరావు దొంగగా మారడానికి దారి తీసిన కారణాలు, పరిస్థితులు ఏమై ఉంటాయి? ఆయన దొంగగా మారిన తర్వాత ఏం చేశారు? అనే అంశాలు ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటాయి.

● రవితేజగారు హార్డ్‌వర్క్ చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌లన్నీ ఆయనే చేశారు. ఓ రోజు ఆయన చేతికి గాయమైంది. లొకేషన్‌లో ఐదారు వందలమంది ఉన్నారు. ప్రొడక్షన్ కాస్ట్ వృథా కాకూడదని, ఆయనకు ఇబ్బందిగా ఉన్నా షూటింగ్‌లో పాల్గొన్నారు. ఇక అనుపమ్ ఖేర్ గారు నా లక్కీ చార్మ్ అనే చెప్పాలి. ఫలానా పాత్ర చేయాలని అనుపమ్‌గారిని కోరితే వెంటనే ఓకే అంటారు. నాపై ఆయనకు ఉన్న నమ్మకం అలాంటిది. హేమలత లవణంగా రేణూ దేశాయ్ బాగా నటించారు. రేణూదేశాయ్ 2.ఓ చూస్తారు. ప్రత్యేక శ్రద్ధతో జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందించాడు. అవినాష్ కొల్లా అద్భుతంగా ఆర్ట్ డైరెక్షన్ చేశాడు. దర్శకుడిగానే కాదు.. నిర్మాతగా కూడా బాధ్యతలు తీసుకుని పని చేశారు వంశీ. కథకు ఏది అవసరమైతే అది నేను వంద శాతం ఇస్తాను. నిర్మాణంలో రాజీపడను. నా కెరీర్‌లో ఓ మంచి గుర్తుగా నిలిచిపోతుంది 'టైగర్ నాగేశ్వరరావు'.

● పండగ అంటే రెండు, మూడు సినిమాలు రావడం సహజం. మా సినిమా కంటెంట్‌పై నమ్మకం ఉంది. ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకం కూడా ఉంది. నార్త్‌లోనూ మంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది.

● తెలుగు ఇండస్ట్రీలో నిర్మాతగా నేను అవుట్‌సైడర్‌ని. ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. వచ్చిన మూడేళ్ళలో నిర్మాతగా జాతీయ అవార్డు ('కశ్మీరీ ఫైల్స్' చిత్రం) అందుకోవడం మా సంస్థకు గౌరవాన్ని తెచ్చింది. అవార్డు అందుకుంటున్నప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. మా బ్యానర్‌లో త్వరలో ఓ క్రేజీ బయోపిక్ ప్రకటిస్తా.

ఓ మంచి జ్ఞాపకంలా..


● సాయి సుధాకర్, దినేష్ తేజ్, పాయల్

దినేష్ తేజ్ హీరోగా, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వంలో కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుకకి అతిథిగా హాజరైన దర్శకుడు నక్కిన త్రినాథరావు మాట్లాడుతూ– ''మారేష్ అనుభవం ఉన్న దర్శకుడిలా ఈ సినిమా తీశారు'' అన్నారు. ''ఇలాంటి చిత్రాలను ప్రేక్షకులు ప్రోత్సహించాలి'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. ''మా సినిమా అందరికీ ఓ మంచి జ్ఞాపకంలా ఉంటుంది'' అన్నారు దినేష్ తేజ్. ''థియేటర్స్ నుంచి వచ్చాక రెండు గంటల పాటు ప్రేక్షకులు ఈ కథ ట్రాన్స్‌లోనే ఉంటారు'' అన్నారు మారేష్ శివన్. ''క్యూట్ లవ్‌స్టోరీ ఫిల్మ్ ఇది. అంతర్లీనంగా సందేశం ఉంది'' అన్నారు కొమ్మాలపాటి సాయి సుధాకర్. ''ఈ సినిమాలో బోల్డ్‌గా నటించా'' అన్నారు పాయల్ రాధాకృష్ణ.

సాక్షి బిజినెస్

గురువారం
19-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	551	65,877
నిఫ్టీ ▽	140	19,671

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,365	▽ 169
డోజోన్స్	33,737	▽ 260
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▽ 87
డాక్స్	15,095	▽ 157
షాంఘై	3,059	▽ 25
నికాయ్	32,042	▽ 2

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
59,840	△ 557
బంగారం (99.5 స్వచ్ఛత)	
59,600	△ 554
వెండి (కిలో)	
72,197	△ 1,351

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎటిఎం	82.48	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎటిఎం	99.79	103.11
€	యూరో	ఎటిఎం	86.59	89.64
¥	జపాన్ ఎన్ (100)	ఎటిఎం	54.82	56.53
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎటిఎం	52.04	54.33
S$	సింగపూర్ డాలర్	ఎటిఎం	59.93	61.87
SAR	సౌదీ రియాల్	ధావన్‌సత్	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ధావన్‌సత్	21.77	23.56
¥	చైనా యువాన్	ధావన్‌సత్	10.26	12.33

ఇండస్‌ఇండ్ లాభం జూమ్

క్యూ2లో రూ. 2,202 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంక్ ఇండస్‌ఇండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 22 శాతం ఎగసి రూ. 2,202 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,805 కోట్లు ఆర్జించింది. మొండిబకాయిలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,719 కోట్ల నుంచి రూ. 13,530 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం పుంజుకుని రూ. 5,077 కోట్లయ్యింది. నికర వడ్డీ మార్జిన్లు 4.24 శాతం నుంచి 4.29 శాతానికి స్వల్పంగా మెరుగుపడ్డాయి. ఇతర ఆదాయం రూ. 2,011 కోట్ల నుంచి రూ. 2,282 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.11 శాతం నుంచి 1.93 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.61 శాతం నుంచి 0.57 శాతానికి నీరసించాయి. ప్రొవిజన్లు రూ. 1,141 కోట్ల నుంచి రూ. 974 కోట్లకు తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 18.21 శాతంగా నమోదైంది. ఈ కాలంలో 3,500 మంది ఉద్యోగులను విధుల్లోకి తీసుకున్నట్లు బ్యాంక్ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు 1% నష్టంతో రూ. 1,421 వద్ద ముగిసింది.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఫలితాలు బాగున్నాయ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2023–24 రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. క్యూ2లో నికర లాభం 72% జంప్‌చేసి రూ. 920 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం, మొండి రుణాలు తగ్గడం ఇందుకు సహకరించింది. నిర్వహణ లాభం 31% బలపడి రూ. 1,920 కోట్లకు చేరినట్లు బ్యాంక్ ఎండీ ఏఎస్ రాజీవ్ పేర్కొన్నారు. బ్యాంక్ మొత్తం ఆదాయం రూ. 4,317 కోట్ల నుంచి రూ. 5,796 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు 3.4% నుంచి 2.19%కి తగ్గాయి.



విప్రో లాభం ఫ్లాట్

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 2,667 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,649 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం నామమాత్ర క్షీణతతో రూ. 22,516 కోట్లకు పరిమితమైంది. గత క్యూ2లో రూ. 22,540 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఐదు అనుబంధ సంస్థలను కంపెనీలో విలీనం చేసుకునేందుకు బోర్డు అనుమతించినట్లు విప్రో తాజాగా వెల్లడించింది. వీటిలో విప్రో హెచ్ఆర్, ఓవర్‌సీస్ ఐటీ, టెక్నాలజీ ప్రొడక్టు సర్వీసులు, వీఎల్ఎస్ఐ డిజైన్ సర్వీసులు, విప్రో ట్రేడ్‌మార్క్ హోల్డింగ్ ఉన్నాయి.

గైడెన్స్ వీక్..

ప్రస్తుత త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)క్యూ3లో ఐటీ సర్వీసుల ఆదాయం 3.5–1.5 శాతం మధ్య క్షీణించవచ్చంటూ విప్రో తాజా అంచనాల(గైడెన్స్)ను ప్రకటించింది. వెరసి కరెన్సీ నిలకడ ప్రాతిపదికన 261.7–267.2 కోట్ల డాలర్ల స్థాయిలో ఆదాయాన్ని ఊహిస్తోంది. అంటే రూ. 21,643–22,097 కోట్ల మధ్య టర్నోవర్‌ను అంచనా కట్టింది. ప్రస్తుత బలహీన ప్రపంచ ఆర్థిక ఔట్‌లుక్ నేపథ్యంలో తాజా గైడెన్స్‌ను ప్రకటించింది.

ఇతర విశేషాలు

- నిర్వహణ మార్జిన్లు నామమాత్ర వృద్ధితో 16.1 శాతానికి చేరాయి.
- 3.78 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది.
- క్యూ2కల్లా సిబ్బంది సంఖ్య 7 శాతం తగ్గి 2,44,707కు చేరింది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు గత 6 త్రైమాసికాల్లోనే తక్కువగా 15.5%కి పరిమితమైంది.

అనిశ్చితులు ఉన్నాయ్...

బిజినెస్ వాతావరణం అనిశ్చితిగా ఉన్నట్లు ఫలితాల విడుదల సందర్భంగా విప్రో సీఈవో థియరీ డెలాపోర్ట్ పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు గరిష్టస్థాయిలలో కొనసాగుతున్నాయని, పెట్టుబడులపట్ల క్లయింట్లు మరింత కఠిన వైఖరిని ప్రదర్శిస్తున్నారని తెలియజేశారు. ప్రస్తుత పెట్టుబడుల గరిష్ట వినియోగంపై దృష్టి పెడుతూనే కొత్త పెట్టుబడులపై వేగవంత రిటర్నులను ఆశిస్తున్నట్లు వివరించారు. విచక్షణా వ్యయాలు, ఆర్డర్లు నెమ్మదిస్తున్నట్లు వెల్లడించారు. ఇది ఆదాయ వృద్ధిపై ప్రభావం చూపుతున్నట్లు తెలియజేశారు. అయితే మార్జిన్లు నిలుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.



ఫలితాల నేపథ్యంలో విప్రో షేరు ఎన్ఎస్ఈలో 1 శాతం నీరసించి రూ. 408 వద్ద ముగిసింది.

బజాజ్ ఆటో లాభం ప్లస్

క్యూ2లో రూ. 2,020 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ఆటో రంగ దిగ్గజం బజాజ్ ఆటో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 18 శాతం ఎగసి రూ. 2,020 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,719 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 10,537 కోట్ల నుంచి రూ. 11,207 కోట్లకు బలపడింది. అయితే వాహన విక్రయాలు 8% క్షీణించి 10,53,953 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ2లో 11,51,012 వాహన అమ్మకాలు నమోదయ్యాయి. వీటిలో దేశీ విక్రయాలు 19% తక్కువగా 5,05,320కు పరిమితంకాగా.. ఎగుమతులు 5% నీరసించి 3,76,263 యూనిట్లకు చేరాయి. ఇక త్రిచక్ర వాహన విక్రయాలు మాత్రం 31% జంప్‌చేసి 1,72,370కు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఆటో షేరు ఫ్లాట్‌గా రూ. 5,144 వద్ద ముగిసింది.

లాభాలు ఒకరోజుకే పరిమితం

- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో భారీ అమ్మకాలు
- బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- మళ్లీ 66 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్
- నిఫ్టీకి 140 పాయింట్ల నష్టం



ముంబై: దేశీయ స్టాక్ సూచీల లాభాలు ఒక్కరోజుకే పరిమితమయ్యాయి. బలహీన జాతీయ అంతర్జాతీయ సంకేతాలతో బుధవారం సెన్సెక్స్, నిఫ్టీలు ఒకశాతం మేర నష్టపోయాయి. మార్జిన్ల క్షీణత ఆందోళనలతో బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు నెలకొన్నాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ద్వయం, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 3–1% క్షీణించి సూచీల పతనాన్ని శాసించాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల అనూహ్య పెరుగుదల, అమెరికా వడ్డీ రేట్ల పెంపు అంచనాల భయాలు, పశ్చిమాసియా దేశాల్లోని యుద్ధ పరిస్థితుల పరిణామాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 551 పాయింట్లు నష్టపోయి 66 వేల స్థాయి దిగువన 65,877 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 140 పాయింట్లు నష్టపోయి 19,671 వద్ద నిలిచింది. ఉదయం స్వల్పలాభాలతో మొదలైన సూచీలు వెంటనే నష్టాల్లోకి మళ్లాయి. ఫార్మా, ఆటో షేర్లు మినహా అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సూచీలు ఏ దశలో కోలుకోలేదు. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 586 పాయింట్లు క్షీణించి 65,842 వద్ద, నిఫ్టీ 151 పాయింట్లు పతనమై 19,660 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.85%, 0.32% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,832 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,470 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

''బలహీన అంతర్జాతీయ సంకేతాలు, పశ్చిమాసియా దేశాల్లోని అనిశ్చిత పరిణామాలు దేశీయ మార్కెట్లో లాభాల స్వీకరణకు పురిగొల్పాయి. క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో ఉద్రిక్తతలు మరింత ఎక్కువయ్యాయి. ఫెడ్ చైర్మన్ ప్రసంగానికి ముందు ఎఫ్ఐఐలు అప్రమత్తత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. దేశీయ ఐటీ, ఫైనాన్స్ రంగ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడం ఇన్వెస్టర్లను మరింత నిరాశపరిచింది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జెసానీ తెలిపారు.

- సెప్టెంబర్ క్వార్టర్‌లో నికరలాభం 28% క్షీణించడంతో బీఎస్ఈలో బజాజ్ ఫైనాన్స్ షేరు 3% నష్టపోయి రూ.7,871 వద్ద స్థిరపడింది. ఫలితంగా కంపెనీ ఒక్కరోజులో రూ.13,345 కోట్ల మార్కెట్ విలువను కోల్పోయింది.
- యాజమాన్యం ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు ఆదాయ వృద్ధి అంచనాలు తగ్గించడంతో ఎల్ అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ షేరు 6% క్షీణించి రూ.4,354 వద్ద స్థిరపడింది.
- జెన్సార్ టెక్నాలజీ క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో కంపెనీ 6% నష్టపోయి రూ. 517 వద్ద స్థిరపడింది.
- సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లకు గానూ టాటా మోటార్స్ 2%, సన్ ఫార్మా 1.50%, మారుతీ 0.50% షేర్లు మాత్రమే లాభపడ్డాయి. సూచీ ఒకశాతం పతనంతో ఇన్వెస్టర్లకు ఒక్కరోజులో రూ.2.42 లక్షల కోట్ల నష్టంవాటిల్లింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.321.40 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఏపీలో కోరమాండల్ ప్లాంటు ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నెలకొల్పిన సల్ఫ్యూరిక్ యాసిడ్ ప్లాంటులో ఉత్పత్తి కార్యకలాపాలను ప్రారంభించింది. విశాఖపట్నం వద్ద ఉన్న కంపెనీకి చెందిన ఫెర్టిలైజర్ కాంప్లెక్స్‌లో రూ.400 కోట్ల పెట్టుబడితో ఈ కేంద్రాన్ని స్థాపించారు. ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 1,650 మెట్రిక్ టన్నులని కోరమాండల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ బుధవారం వెల్లడించారు. నూతన కేంద్రం చేరికతో సంస్థ సల్ఫ్యూరిక్ యాసిడ్ తయారీ సామర్థ్యం ఏటా 6 లక్షల టన్నుల నుంచి 11 లక్షల టన్నులకు చేరిందని పేర్కొన్నారు. .

లాట్ దసరా సంబరాలు



హైదరాబాద్: దసరా సంబరాలను లాట్‌తో జరుపుకోవాలని మల్టీ బ్రాండ్ రిటైల్ చైన్ లాట్ మొబైల్స్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా కస్టమర్లకు ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ టీవీ, ఏసీ, ల్యాప్‌టాప్ కొనుగోళ్లపై కచ్చితమైన బహుమతితో పాటు రూ.10వేల వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను అందిస్తుంది. బ్రాండెడ్ యాక్సెసరీలు, ఇతర వస్తువులపై 60% వరకు తక్షణ తగ్గింపు ఇస్తుంది. జీరో డౌన్ పేమెంట్ కూడిన రుణ సదుపాయాన్ని ఏడాది కాల వ్యవధితో జీరో కాస్ట్, నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని అందిస్తుంది. ఆఫర్ల అవకాశాన్ని కస్టమర్లంతా వినియోగించుకోవాలని కంపెనీ డైరెక్టర్ ఎం.అఖిల్ కోరారు.

బీ న్యూ దసరా ఆఫర్లు



హైదరాబాద్: దసరా పండుగకి 'బీ న్యూ' ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.15వేల వరకు క్యాష్‌బ్యాక్‌తో పాటు రూ.6,999 వరకు కచ్చితమైన బహుమతి ఇస్తామని సంస్థ సీఈఓ వై.సాయి నిఖిలేష్ తెలిపారు. స్మార్ట్‌టీవీ కొనుగోలుపై రూ.17,999 విలువైన సౌండ్ బార్‌ను రూ.5,999లకే ఇస్తామన్నారు. ఐఫోన్ల కొనుగోలుపై రూ.24వేల వరకు తగ్గింపు ఉందన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 70% వరకు రాయితీ అందిస్తామన్నారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలుపై రూ. 11వేల వరకు, ఎస్‌బీఐ కార్డుతో రూ.6వేల వరకు, ఐసీఐసీఐ కార్డుతో రూ.5వేల వరకు క్యాష్ బ్యాక్ లభిస్తుందన్నారు. సిబిల్ స్కోర్, పాన్ కార్డు లేకుండానే ఫైనాన్స్‌పై మొబైల్స్, స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను కొనుగోలు చేయొచ్చని చెప్పారు.



FOR ALL INSTITUTIONAL/BULK REQUIREMENTS PLEASE MAIL corporate.customersupport@tvsmotor.com హైదరాబాదు ఆథరైజ్డ్ మెయిన్ డీలర్స్: కిరణ్ టీవీఎస్, ఎం.జి రోడ్: 9069138215, సుశీల్ టీవీఎస్, కుక్కట్ పల్లి: 9069138239, సుశీల్ టీవీఎస్, ఎస్.ఆర్. నగర్: 9069138254, సుశీల్ టీవీఎస్, కొండాపూర్: 9069138257, సుశీల్ టీవీఎస్, నిజాంపేట్: 9069138274, సుశీల్ టీవీఎస్, సూరారం: 9069138269, వరం టీవీఎస్, ఆర్.సి. పురం: 7303656835, శ్రీ ఎల్.బి టీవీఎస్, వనస్థలిపురం: 9069138225, శ్రీ ఎల్.బి టీవీఎస్, భువనగిరి: 9247023387, ఓం శ్రీ సాయి శ్రీనివాస టీవీఎస్, కొంపల్లి: 9870262436, ఓం శ్రీ సాయి శ్రీనివాస టీవీఎస్, మేడ్చల్: 9870259858, నానేష్ టీవీఎస్, బోయిన్‌పల్లి: 9391000046, శాంతి టీవీఎస్, హిమాయత్ నగర్: 9069139025, శాంతి టీవీఎస్, విద్యా నగర్: 9870259590, శాంతి టీవీఎస్, బర్కత్‌పురా: 7093091520, వన్ టీవీఎస్, బహదూర్‌పుర – అత్తాపూర్ – హాఫీజ్‌గూడ: 9988189999, శ్రీ తులసి టీవీఎస్, ఎఎస్ రావ్ నగర్: 8498090744, శ్రీ తులసి టీవీఎస్, మౌలాలి: 8498090744, శ్రీ తులసి టీవీఎస్, నాగారం: 8498090744, అంజలి టీవీఎస్, సోమాజిగూడ: 8341486204, అంజలి టీవీఎస్, లంగర్‌హౌస్: 9069138230, అంజలి టీవీఎస్, కృష్ణానగర్: 9069138227, రాంకోర్ టీవీఎస్, మలక్‌పేట్: 8919527076, రాంకోర్ టీవీఎస్, చాంద్రాయణగుట్ట: 9700029786, యస్.ఆర్ టీవీఎస్, వికారాబాద్: 9069138214, శ్రీనివాస టీవీఎస్, సిద్దిపేట: 9870260452, దుర్గ టీవీఎస్, సంగారెడ్డి: 9069138247, యువన్ టీవీఎస్, ఎల్‌బి నగర్/వంపాపేట్: 9573656291, వృద్ధి టీవీఎస్, గచ్చిబౌలి – నస్‌సిటీ: 9015255555.

dentsu/sak hyd/05/23

అలంపూర్



దేవీశరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జోగుళాంబదేవిని కూష్మాండమాతగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. -జోగుళాంబ శక్తిపీఠం

భద్రాచలం



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శ్రీ లక్ష్మీతాయారమ్మవారు బుధవారం ధనలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. -భద్రాచలం

హనుమకొండ



వరంగల్ శ్రీభద్రకాళి ఆలయంలో బుధవారం భద్రకాళి అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. -హనుమకొండ కల్చరల్

బాసర



నిర్మల్ జిల్లా బాసరలో సరస్వతి అమ్మవారు బుధవారం కూష్మాండ అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అల్లం గారెలు నైవేద్యంగా సమర్పించారు. -భైంసా

ఇంద్రకీలాద్రి



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ బుధవారం మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. శుక్రవారం ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. -విజయవాడ

శ్రీశైలం



శ్రీశైల మహాక్షేత్రంలో దసరా నవరాత్రుల్లో భాగంగా బుధవారం శ్రీశైల భ్రమరాంబాదేవి కూష్మాండదుర్గగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. -శ్రీశైలం

ధాన్యం విక్రయ టెండర్ల గడువు పెంపు

- 21 వరకు అవకాశం
- నిబంధనల సడలింపుతో భారీగా బిడ్లు

సాక్షి, హైదరాబాద్: మిల్లుల్లో నిల్వ ధాన్యాన్ని విక్రయించేందుకు టెండర్ల గడువుని రాష్ట్ర సర్కారు ఈనెల 21కి పొడిగించింది. సడలించిన నిబంధనలతో టెండర్ల దాఖలుకు ఇచ్చిన మలి విడత గడువు మంగళవారంతో ముగియగా, 500కు పైగా టెండర్లు దాఖలయినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అప్పగించే మిల్లర్లందరినీ బిడ్డింగ్‌లో పాల్గొనేలా చేసి, ఏ మిల్లులో ఉన్న ధాన్యాన్ని అక్కడే విక్రయించాలన్నది ప్రభుత్వం ఆలోచనగా ఉంది. ఈ నేపథ్యంలో గడువును ఈనెల 21వ తేదీ వరకు పెంచినట్లు సమాచారం. రాష్ట్రంలోని మిల్లుల్లో నిల్వ ఉన్న గత సంవత్సరం యాసంగి ధాన్యం 25 లక్షల మెట్రిక్ టన్నులను ఈ–టెండర్ల ద్వారా విక్రయించేందుకు తొలుత ఆగస్టులో టెండర్లు ఆహ్వానించారు. 11 సంస్థలు పాల్గొన్నాయి. వాటిలో 10 సంస్థలు అర్హత పొందినప్పటికీ, క్వింటాలు ధాన్యాన్ని సగటున రూ. 1,865కి కొనుగోలు చేసేలా బిడ్లు దాఖలు చేశాయి. దీంతో ఆ టెండర్లను రద్దు చేసిన ప్రభుత్వం ఈనెల 7న నిబంధనలు సడలిస్తూ మరో విడత బిడ్లు ఆహ్వానించింది. అధిక మొత్తంలో టెండర్లు దాఖలయ్యేలా ధాన్యం లాట్‌ల పరిమాణాన్ని తగ్గించారు. గతంలో లక్ష టన్నుల లాట్ కింద 25 బిడ్లు ఆహ్వానించగా, ఈసారి లాట్ పరిమాణాన్ని 15 వేల టన్నులకు తగ్గించారు. బిడ్‌లో పాల్గొనే సంస్థ లేదా వ్యక్తి వార్షిక టర్నోవర్ మూడేళ్లలో రూ. 100 కోట్లు ఉండాలని పేర్కొనగా, ఆ మొత్తాన్ని రూ. 10 కోట్లకు తగ్గించారు. అది కూడా ఒకరే కాకుండా ఇద్దరు నుంచి నలుగురి వరకు జాయింట్ వెంచర్‌గా బిడ్డింగ్ దాఖలుకు అవకాశం కల్పించారు.

ఇక అత్యవసర సేవల ఉద్యోగులకూ పోస్టల్ బ్యాలెట్

- తొలిసారిగా జర్నలిస్టులకు, 12 ఇతర విభాగాల ఉద్యోగులకు సౌకర్యం
- జాబితాలో వైద్య, విద్యుత్, అగ్నిమాపక, ఆర్టీసీ, రైల్వే, బీఎస్ఎన్ఎల్, పౌర సరఫరాల శాఖలు
- ఇప్పటికే 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40% వైకల్యం గల దివ్యాంగులకూ తొలిసారిగా ఈ సదుపాయం కల్పిస్తూ ప్రకటన
- గతంలో ఎన్నికల సిబ్బంది, సర్వీసు ఓటర్లు, ప్రవాసీ ఓటర్లకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ సదుపాయం
- నోటిఫికేషన్ తర్వాత 5 రోజుల్లోగా ఆర్వోకి ఫారం–12డీ సమర్పిస్తే పోస్టల్ బ్యాలెట్ కల్పన

సాక్షి, హైదరాబాద్: పోలింగ్ రోజు ఎన్నికల వార్తల సేకరణలో ఉండే జర్నలిస్టులతో పాటు ఎన్నికలతో సంబంధం లేని 12 ఇతర అత్యవసర సేవల రంగాల ఉద్యోగులు సైతం ఇకపై పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల శాసనసభ సాధారణ ఎన్నికల్లో తొలిసారిగా ఈ సదుపాయం కల్పించబోతున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 60(సీ) కింద కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 10న ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈసీ ఆదేశాలతో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సైతం



గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అత్యవసర సేవల రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ ఉద్యోగ స్వభావం రీత్యా ఓటు హక్కు ఉన్న ప్రాంతానికి దూరంగా ఉండే ఓటర్లు పెద్ద సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో వీరికి సైతం ఓటు హక్కు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇప్పటి వరకు వీరికే సదుపాయం..

ఇప్పటివరకు ఎన్నికల విధుల్లో పనిచేసే సిబ్బంది, సర్వీసు ఓటర్లు(సాయుధ బలగాలు), ప్రవాస ఓటర్లకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయం ఉండేది. 40 శాతం, ఆపై వైకల్యం కలిగిన దివ్యాంగులు, 80 ఏళ్లకు పైబడిన ఓటర్లకు ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించనున్నట్టు ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తాజాగా జర్నలిస్టులతో పాటు ఎన్నికల విధులతో సంబంధం లేని అత్యవసర సేవల విభాగాల ఉద్యోగులకు సైతం పోస్టల్ సదుపాయం కల్పిస్తున్నట్టు ప్రకటించింది.

నవంబర్ 7లోగా దరఖాస్తు చేసుకోవాలి..

వచ్చే నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ వెల్లడి కానుండగా, నాటి నుంచి 5 రోజుల్లోగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోరుతూ ..'ఫారం–12డీ'దరఖాస్తులను స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 7 నాటికి దరఖాస్తులు రిటర్నింగ్ అధికారికి చేరితే ఈ మేరకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడానికి ఏర్పాట్లు చేస్తారు. జర్నలిస్టులతో పాటు ఆయా అత్యవసర విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించడానికి సంబంధిత విభాగాలు నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. నోడల్ అధికారుల వద్ద ఫారం–12డీ అందుబాటులో ఉంచాలని కోరింది. ఈ కింది జాబితాలోని అత్యవసర విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించనున్నారు.

- ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా
- ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
- ఇండియన్ రైల్వే
- ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో
- దూరదర్శన్
- ఆల్ ఇండియా రేడియో
- విద్యుత్ శాఖ
- వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ
- రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)
- పౌర సరఫరాల శాఖ
- బీఎస్ఎన్ఎల్
- పోలింగ్ రోజు వార్తల సేకరణ కోసం ఎన్నికల సంఘం నుంచి పాస్ పొందిన మీడియా ప్రతినిధులు
- అగ్నిమాపక శాఖ

రూ. వంద కోట్లతో వెలుగులు... సిద్దిపేట రైల్వే మార్గం విద్యుదీకరణ

- ప్రాజెక్టు మంజూరు చేసిన రైల్వే శాఖ
- 75 కి.మీ. మేర తొలి విడతలో పనులు
- రెండు నెలల్లో పనులు ప్రారంభం.. వచ్చే ఏడాదిలోగా పూర్తి
- మలి విడతతో సిద్దిపేట నుంచి కొత్తపల్లి వరకు చేపట్టాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఇటీవలే సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైలు సేవలు ప్రారంభించిన రైల్వే శాఖ ఇప్పుడు ఆ మార్గాన్ని విద్యుదీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు 75 కి.మీ. మేర తొలి విడతలో విద్యుదీకరణ చేపట్టబోతోంది. రూ.100 కోట్లతో ఈ పనులు నిర్వహించనుంది. ఇందుకోసం ఈపీసీ విధానంలో టెండర్ నోటిఫికేషన్ జారీ చేయబోతోంది. రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. ఏడాదిలోగా సిద్దిపేట వరకు పూర్తి కానున్నాయి. రెండో విడతగా సిద్దిపేట నుంచి కొత్తపల్లి వరకు చేపట్టనున్నారు.

బ్రాంచ్ లైన్ నుంచి కీలక రూట్‌గా..

సికింద్రాబాద్–నిజామాబాద్ రూట్‌లో ఉన్న మనోహరాబాద్ స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే కొత్త లైను నాచారం, గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల మీదుగా కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వద్ద ముగుస్తుంది. ఇది ప్రధాన లైన్ కానందున రైల్వే శాఖ దీన్ని బ్రాంచి లైన్‌గా పరిగణిస్తుంది. కానీ, ఇప్పుడు దీన్ని కీలక రూట్‌గా మార్చాలని నిర్ణయించింది. సికింద్రాబాద్–నిజామాబాద్ మార్గానికి సమాంతరంగా మరో రూట్‌గా దీన్ని అభివృద్ధి



చేయాలని రైల్వే నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సికింద్రాబాద్–నిజామాబాద్–కరీంనగర్–వరంగల్ మధ్య స్పష్టమైన మార్గం ఏర్పడనుంది.

నేరుగా కరీంనగర్.. వరంగల్ వయా పెద్దపల్లి

ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి కరీంనగర్‌కు నేరుగా రైల్వే మార్గం లేదు. నిజామాబాద్ స్టేషన్ వరకు వెళ్లి, అక్కడి నుంచి ఇంజిన్‌ను రివర్స్ చేసుకుని, నిజామాబాద్ నుంచి దాదాపు కిలోమీటరున్నర వెనక్కు వచ్చి కరీంనగర్ మార్గంలోకి మళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు ఆ బాధ లేకుండా తక్కువ సమయం, నిడివితో నేరుగా కరీంనగర్ చేరుకోవచ్చు. అక్కడి నుంచి పెద్దపల్లితో అనుసంధానమై నేరుగా వరంగల్ చేరుకోవచ్చు.

ఆ రెండూ పూర్తయితే..

తెలంగాణ మీదుగా ఉన్న అన్ని ప్రధాన రైల్వే లైన్ల విద్యుదీకరణ పూర్తయింది. బ్రాంచి లైన్లుగా ఉన్న మెదక్–అక్కనపేట, ఇటీవలే రైలు సేవలు ప్రారంభమైన దేవరకద్ర–కృష్ణా మార్గం, మనోహరాబాద్–కొత్తపల్లి మార్గం (సిద్దిపేట వరకు ట్రాక్ సిద్ధం) మాత్రమే మిగిలి ఉన్నాయి. అందులో ఇప్పుడు మనోహరాబాద్–కొత్తపల్లి మార్గంలో మొదటి విడత పనులు ప్రారంభం కాబోతున్నాయి. మిగతా రెండు కూడా ప్రారంభమైతే, యావత్ తెలంగాణ రైల్వే లైన్లు మొత్తం విద్యుదీకరించుకున్నట్టవుతుంది.



72198 21111 | BAJAJ FINANCE LTD - AF | BAJAJ SECURE

Authorised Dealers For Bajaj Auto Ltd.: Bahadurpura SRI VINAYAKA BAJAJ 9393745666 • Begumpet SRI VINAYAKA BAJAJ 9390459666 • Chandanagar VARUN BAJAJ 8297544420 • Dilsukhnagar SRI VINAYAKA BAJAJ 9391770116 • ECIL SELECT AUTOMOBILES 8008104461 • NAMPALLY SRI VINAYAKA BAJAJ 9642488833• Erragadda MGB BAJAJ 8978865666• Habsiguda SELECT BAJAJ 8008104400 • Hydernagar JNTU SELECT AUTMOBILES 9154292284 • Kachiguda SRI VINAYAKA BAJAJ 9030030280 • Suchitra VVC Motorcycle 8143690900, 9154311770 • Kondapur VARUN BAJAJ 8297544408 • Kukatpally Y Jun SELECT AUTMOBILES 9154292288 • LB Nagar SRI VINAYAKA BAJAJ 9948222455 • RC Puram VARUN BAJAJ 8297544405 • RP Road DECCAN BAJAJ 9948884427 • Tirumalgiri SELECT AUTOMOBILES 80081044466 • Tolichowki ABHINANDAN BAJAJ 8008803761 • Uppal SELECT BAJAJ 8008100966. **Authorised Service Centre:** ALWAL 9441799486, AMBERPET 9133425299, ANAND BAGH 8008104445, ATTAPUR 8008803765, BALAPUR 9949256471, BALANAGAR 9246115566, BN REDDY COLONY 9989652503, BODDUPAL 8008104449, CHANDRAYANGUTTA 9885647692, ,Chegunta 9440104103, DMRL'X'ROAD 9849300124, GAJWEL 9848347349, GHATKESAR 7032141444,HAYATH NAGAR 9010115299 IBRAHIMPATNAM 9912299916, IDPL COLONY 9246260803, Isnapur 6303910598, Keesara 9948260156, LUNGER HOUSE 9885562687, MADHAPUR 9581291777, MALAKPET 9000228558, MALKAJGIRI 8008104445, MEDAK 9292602222, MEDCHAL 9440442588, MEERPET 9949523333, METTUGUDA 9000049373, MOOSAPET 9989192111, MUSHEERABAD 9160599998 , NAGARAM 6301212199, Narayankhed 9000110040, NARSAPUR 9440033366, NARSINGI 8297544402, PARIGI 8297544414,*RAMAYAMPET 9848444434, Rampally 9912228337, SADASIVPET 9848877161, SAINIKPURI 9652040129 , SANGAREDDY 8297544409, SHAMSHABAD 9100793093 , SHANKARPALLY 9949022233, Shapur 9246260802, SIDDIPET 9133309650 , Somajiguda 9848295965, SURARAM 9848295965, TANDUR 8297544419, TEMPLE ALWAL 9000055318, THUMKUNTA 9985731111, VIKARABAD 8297544413, ZAHEERABAD 8297544426, KARMANGHAT 9908886782, Yousufguda 9949949112, Manikonda ABHINANDAN BAJAJ 9100988102, Toopran VVC Motorcycle 9154311773 • Gandimaissamma VVC Motorcycle 9154311772, Nallagandla Varun Motors 9581429111, JOGIPET, SRI SAI SAGHAMESWARA MOTORS 967620406

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.